


సంగీత మేరు శిఖరాలు
రూ॥ 120/-
పేజీలు:138
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 286 | బుధవారం | 16-09-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## వచ్చే నెల 15 నుండి యుపిఐ చెల్లింపు ఛార్జీలు

● రూ.2 వేలు లోపు చెల్లింపులకు ఉచిత లావాదేవీలు ● లక్ష రూపాయలు లోపు చెల్లింపులకు రూ.300లు ● ఓటిటి చెల్లింపులు రూ.2 వేలు దాటితే రూ.400




**న్యూఢిల్లీ:** యుపిఐ ద్వారా చెల్లింపులకు ఆరేళ్ళపాటు ఇచ్చిన ఉచిత సౌకర్యానికి తెర పడింది. వ్యాపారులకు చెల్లించే లావాదేవీలపై వినియోగదారులకు ఎలాంటి భారం ఉండదు. చిరు వ్యాపారులకు మినహాయింపు ఇచ్చారు. రూ.2000లు దాటిన యుపిఐ లావాదేవీకు 0.4 శాతం చార్జీలు వర్తిస్తాయి. మర్చంట్ డిస్కౌంట్ రేటు(ఎండిఆర్)ను గరిష్ఠంగా రూ.300గా నిర్దేశించారు. ఐతే ఓటిటి వేదికలకు చెల్లింపులు చేయాల్సివస్తే ఆ చెల్లింపులు రూ.2000 దాటితే ఎండిఆర్ వర్తించదు. రూ.400లు ఇవ్వాల్సిందే. అదేవిధంగా ప్రభుత్వ వినియోగ బిల్లులు అంటే విద్యుత్ ఛార్జిలు,వాటర్ బిల్లులు,స్కూలు ఫీజులు వంటివి తరువాయి 8లో

## 22ఎ నిషేధిత భూములపై అసెంబ్లీలో సమగ్ర వివరణ

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని ప్రభుత్వం నిర్ణయం

అందుబాటులో ఉన్న మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర 22ఎ నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో సమగ్ర వివరణ ఇవ్వాలని, ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్న రాష్ట్ర మంత్రులతో అత్యవసరంగా సమావేశమయ్యారు. సమావేశంలో ప్రధానంగా ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. బుధవారం జరిగే అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వ వ్యూహం, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇవ్వడంపై చర్చించారు. ముఖ్యంగా 22ఎ నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎన్.ఉత్తమ్ కుమార్, జి.వివేక్ వెంకటస్వామితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో 22ఎ భూముల అంశంపై రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సుదీర్ఘంగా వివరించారు. 22ఎ కు సంబంధించిన పూర్తి వివరాలను నివేదిక రూపంలో పూర్తి సమాచారాన్ని ముఖ్యమంత్రికి మంత్రి అందజేశారు.

## సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రిని పునరుద్ధరించండి



● విద్య, టూరిజం, వైద్య రంగాల్లో కలిసి పనిచేద్దాం
● 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు రండి
● ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని, ఈ రంగాల్లో ప్రభుత్వానికి సహకరించాలని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు హాజరు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5ను కోరారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎం సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, అగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5 తండ్రి కీ.శే.ఆగా ఖాన్–4 మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు రామకృష్ణారావు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5కు వివరించారు.హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు ఇతర యూనివర్సిటీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి అంగీకరించాయని ఆయన తెలిపారు. మరోవైపు, ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా కోరారు. పర్యాటక రంగంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ పాత్రను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ గుర్తు చేశారు. భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని ఆమె కోరారు. తెలంగాణలో ఫౌండేషన్ తరపున చేపడుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకుని ఇటీవలే ప్రారంభించుకున్న విషయాన్ని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5కు సిఎం గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో పునరుద్ధరించిన కుతుబ్ షాహీ టూంబ్స్ ప్రారంభోత్సవంలో తాము కలిసిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా సిఎం ప్రస్తావించారు.

**ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్––5 ఆసక్తి**

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి తరువాయి 8లో

## ట్రంప్‌ను సంతృప్తి పరిచేందుకేనా?

యుపిఐ చెల్లింపులకు చార్జీలు వసూలుపై కాంగ్రెస్ విమర్శ

యుపిఐపై రుసుములు విధించేందుకు మోదీ ప్రభుత్వం రహస్యంగా మార్గం సుగమం చేసిందని రాహుల్‌గాంధీ మండిపాటు



**న్యూఢిల్లీ :** యుపిఐ లావాదేవీలపై రుసుములు విధించేందుకు మోదీ ప్రభుత్వం రహస్యంగా మార్గం సుగమం చేసిందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. రాజీపడ్డ మన ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా ఒత్తిడికి మరోసారి లొంగిపోతున్నారరన్నారు. యుపిఐ లావాదేవీలపై ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తింది. ఇలాంటి లావాదేవీలకు ప్రజలు రుసుము చెల్లించేందుకు స్పష్టంగా రంగం సిద్ధమవుతోందని, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సంతృప్తి పరచడం కోసం అమెరికన్ సంస్థలకు డిజిటల్ చెల్లింపులను అందుబాటులోకి తీసుకురావడానికే ఇలా చేస్తున్నారా అని ప్రశ్నించింది. యుపిఐపై రుసుములు తరువాయి 8లో

'రాజీవ్ యువ వికాసం'

## నవంబర్ 19 నుంచి తొలి విడత సాయం

● విద్యాభివృద్ధికి ఖర్చుకు వెనుకాడబోం
● ఇందిరమ్మ రాజ్యంలో పేద, బహుజన వర్గాల భవిష్యత్తును తీర్చిదిద్దడమే లక్ష్యం
● డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టీకరణ
● గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం యువశక్తిని నిర్వీర్యం చేసిందని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతికే కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, విద్యారంగ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఖర్చు చేయడానికి వెనుకాడబోమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేద, బహుజన వర్గాల భవిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరయ్యారు. నవంబర్ 19 నుంచి తరువాయి 8లో

## ఐక్యతకు ఎప్పుడూ సిద్ధమే

● ప్రజాసమస్యలపై కమ్యూనిస్టుల ఐక్య కార్యాచరణతో పాటు ఏకం కావాలని జాతీయ మహాసభలోనే నిర్ణయం తీసుకున్నాం
● సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు స్పష్టీకరణ ● సిపిఐ నాయకత్వంతో వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాసమస్యలపై కమ్యూనిస్టుల ఐక్య కార్యచరణతో పాటు ఏకం కావాలని జాతీయ మహాసభలోనే సిపిఐ నిర్ణయం తీసుకుందని, ఇందుకు ఇప్పుడు ఎప్పుడు కట్టుబడే ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టత ఇచ్చారు. కమ్యూనిస్టు పార్టీలన్ని ఐక్యం కావాలని, ఇందుకు సిపిఐ ప్రత్యేక చొరవ తీసుకోవాలని వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక సిపిఐ రాష్ట్ర న్యాయత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో తరువాయి 8లో

## అంతరిక్షం నుంచీ యుద్ధం చేయగలం

ఆయుధాన్ని అభివృద్ధి చేసినట్లు అమెరికా ప్రకటన

స్పేస్‌ను యుద్ధభూమిగా మార్చొద్దు : చైనా హెచ్చరిక



**వాషింగ్టన్ :** అంతరిక్షం నుండి యుద్ధం చేయడానికి వీలుగా ఒక ఆయుధాన్ని అమెరికా అభివృద్ధి చేసింది. తమ వద్ద అంతరిక్ష ఆయుధాలు ఉన్నట్లు మొదటిసారి అమెరికా అంగీకరించింది. భూమిక క్ష్యలో ఒక అంతరిక్ష ఆయుధాన్ని మోహరించినట్లు అమెరికా అంగీకరించడం ఇదే మొదటిసారి. శత్రువుల నుండి అమెరికా సైన్యాలను కాపాడుకోవడానికి భూకక్ష్యలో ఒక ఆయుధం ఉండాల్సిన అవసరం ఉందని అమెరికా వైమానిక దళ కార్యదర్శి ట్రాయ్ మీంక్ అన్నారు. ఎయిర్–స్పేస్–సైబర్ అనే అంశంపై మంగళవారం జరిగిన ఒక సదస్సులో మీంక్ మాట్లాడుతూ, యుద్ధ సాంకేతికతలో తీవ్రమైన మార్పులు తరువాయి 12లో

## 'పిఎంఎవై' కింద తెలంగాణకు 2 లక్షల ఇళ్లు

ఆంధ్రప్రదేశ్‌కు మూడు లక్షల ఇళ్లు మంజూరు

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి



**ఢిల్లీ/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' (పిఎంఎవై) పథకం కింద తెలుగు రాష్ట్రాలకు భారీ సంఖ్యలో ఇళ్లను మంజూరు చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పేదల కోసం ఇంత పెద్ద సంఖ్యలో ఇళ్లు మంజూరు కావడం చరిత్రలోనే ఇదే మొదటిసారని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల పేదల కలను సాకారం చేసే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని మోదీకి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన కృతజ్ఞతలు తరువాయి 12లో

## మరుగునపడ్డ వీర నారీమణుల చరిత్ర వెలికితీయాలి

● తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వారి పాత్రను పాఠ్యాంశాల్లో పొందుపరచాలి ● ప్రముఖ రచయిత్రి డాక్టర్ శ్రీదేవి ఉద్ఘాటన



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వేలాది మంది మహిళలు ప్రాణాలకు తెగించి పోరాడిన వీర నారీమణుల చరిత్రను పాఠ్యాంశ్యాలలో పొందపర్చి భవిష్యత్ తరాలకు అందించాలని ప్రముఖ రచయిత డాక్టర్ శ్రీదేవి అన్నారు. చిట్యాల ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం పేర్లు మాత్రమే విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయని, అజ్ఞాతంగా మిగిలిపోయిన వందలాది తరువాయి 12లో




# 'యాప్' వెనుక అలసిన మనిషి బలహీన స్వరం

స్మార్ట్ ఫోన్‌లో ఒక యాప్ తెరుచుకుంటుంది. ఆర్డర్ వస్తుంది. కొన్ని నిమిషాల్లో ఆహారం, మందులు, కిరాణా సామగ్రి ఇంటి గుమ్మానికి చేరతాయి. మరో 'యాప్' వాహనం బుక్ చేస్తే డ్రైవర్ ప్రత్యక్షమవుతాడు. నగర జీవితం వేగంగా సాగేందుకు గిగ్ ఆర్థిక వ్యవస్థ కీలకంగా మారింది. కానీ ఈ వేగం వెనుక పరుగులు తీస్తున్న మనిషి జీవితం ఎలా ఉంది? అతని ఆరోగ్యం, భద్రత, పని గంటలు, విశ్రాంతి, సామాజిక భద్రత గురించి మనం ఎంతగా ఆలోచిస్తున్నాం? జనపహల్, గిగ్ వర్కర్స్ అసోసియేషన్ నిర్వహించిన తాజా అధ్యయనం ఈ ప్రశ్నలకు ఆందోళన కలిగించే సమాధానం ఇస్తోంది. ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ సహా పది నగరాల్లో వివిధ ప్లాట్‌ఫామ్స్ ఆధారిత గిగ్ కార్మికులపై అధ్యయనం చేసిన తర్వాత విడుదల చేసిన నివేదిక ప్రకారం 57 శాతానికి పైగా కార్మికులు వారానికి కనీసం 49 గంటలు పనిచేస్తున్నారు. 23.4 శాతం మంది వారానికి 70 గంటలకు మించి పనిచేస్తున్నారు. అంటే గిగ్ పని ఇక అదనపు ఆదాయం కోసం చేసే తాత్కాలిక పని కాదు. అనేక కుటుంబాలకు అదే ప్రధాన జీవనాధారం. అయితే పూర్తి స్థాయి ఉద్యోగానికి సమానంగా పని చేస్తున్నా, పూర్తి స్థాయి ఉద్యోగికి లభించే హక్కులు, భద్రత మాత్రం వారికి అందడం లేదు. ప్లాట్‌ఫామ్ సంస్థలు గిగ్ కార్మికుడికి స్వేచ్ఛ ఉందని చెబుతాయి. తనకు నచ్చినప్పుడు పని చేయవచ్చని, నచ్చనప్పుడు ఆపివేయవచ్చని అంటాయి. కానీ వాస్తవ జీవితంలో ఆదాయం కోసం ఎక్కువ ఆర్డర్లు తీసుకోవాల్సి ఉంటుంది. సమయానికి డెలివరీ చేయాలి. రేటింగ్ కాపాడుకోవాలి. ప్రోత్సాహకాలు కోల్పోకూడదు. అల్గారిథమ్ నిర్ణయించే పనితీరు ప్రమాణాలను అందుకోవాలి. ఈ ఒత్తిళ్ల మధ్య 'స్వేచ్ఛా కార్మికుడు' అనే నిర్వచనం ఎంతవరకు వాస్తవమో ప్రశ్నించాలి. ఆరోగ్య గణాంకాలు ఈ పరిస్థితిని మరింత స్పష్టం చేస్తున్నాయి. 64.5 శాతం మంది అలసట, నిద్రకు సంబంధించిన సమస్యలను ఎదుర్కొంటున్నారు. 47.42 శాతం మంది కండరాలు, ఎముకలకు సంబంధించిన నొప్పులతో బాధపడుతున్నారు. 41.08 శాతం మందికి ఒత్తిడి, ఆందోళన ఉన్నాయి. 30 శాతం మందికి కళ్ల సమస్యలు, 26.45 శాతం మందికి శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నాయి. గంటల తరబడి బైక్ నడపడం, వాహనాలపై కూర్చోవడం, సరుకులు మోయడం, ట్రాఫిక్‌లో ప్రయాణించడం, ఎండలో పనిచేయడం శరీరంపై నిరంతర ఒత్తిడిని పెంచుతున్నాయి. విశ్రాంతి, తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక అవసరాల పరిస్థితి కూడా తీవ్రంగా ఉంది. 53.8 శాతం మంది పని సమయంలో తాగునీటిని సొంత డబ్బుతో కొనుక్కుంటున్నారు. 43.9 శాతం మంది డబ్బులు చెల్లించి టాయిలెట్లను ఉపయోగిస్తున్నారు. 74.6 శాతం మందికి విశ్రాంతి తీసుకునే స్థలం అసలు లేదు. 66.2 శాతం మంది పని సమయంలో అరుదుగా లేదా అసలు విరామం తీసుకోలేకపోతున్నారు. ఈ గణాంకాలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడతాయి. ఒక నగరం తనకు సేవలందించే కార్మికుడికి తాగునీరు, టాయిలెట్, కొన్ని నిమిషాల విశ్రాంతి కూడా ఇవ్వలేకపోతే ఆ నగర అభివృద్ధిని ఏ ప్రమాణంతో కొలవాలి? వాతావరణ మార్పు ఈ సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. మండుతున్న ఎండలో, ఉక్కపోతలో, భారీ వర్షంలో కూడా డెలివరీ కార్మికుడు రోడ్డుపైనే ఉండాలి. ఇతర రంగాల్లోని ఉద్యోగులకు కార్యాలయ రక్షణ లేదా పని విధానాల్లో మార్పులు సాధ్యమవుతాయి. గిగ్ కార్మికుడికి మాత్రం వాతావరణం అనుకూలించకపోయినా పని ఆపితే ఆదాయం ఆగిపోతుంది. వేడి కారణంగా డీహైడ్రేషన్, అధిక ఉష్ణోగ్రత ప్రభావం, చర్మ సమస్యలు వంటి ఆరోగ్య ఇబ్బందులు ఎదురవుతున్నా వాటిని వ్యక్తిగత సమస్యలుగా చూడటం ప్రమాదకరం. ఇది వృత్తిపరమైన భద్రతకు సంబంధించిన అంశం. రోడ్డు ప్రమాదాల గణాంకాలు కూడా హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. 66.4 శాతం మంది ద్విచక్ర వాహనాలను పని కోసం ప్రధానంగా ఉపయోగిస్తున్నారు. 62.2 శాతం మంది ఏదో ఒక రకమైన ప్రమాదాన్ని ఎదుర్కొన్నారు. సుమారు 38 శాతం మంది రహదారి పరిస్థితుల వల్ల గాయపడ్డారు. 27 శాతం మంది ట్రాఫిక్ సంబంధిత ప్రమాదాలను ఎదుర్కొన్నారు. సమయానికి ఆర్డర్ ఇవ్వాలనే ఒత్తిడి, ట్రాఫిక్ రద్దీ, రహదారుల దుస్థితి, రోడ్డు భద్రతా నిబంధనల బలహీన అమలు కలిస్తే ప్రమాదం వ్యక్తిగత తప్పిదంగా మిగలదు. అది వ్యవస్థ వైఫల్యంగా మారుతుంది. ఇక, 59 శాతం మంది కార్మికులకు ఎలాంటి భద్రతా శిక్షణ అందలేదు. బీమా పరిస్థితి మరింత దారుణం. 62 శాతానికి పైగా కార్మికులకు ఆరోగ్య బీమా లేదు. 44.2 శాతం మందికి ప్రమాద బీమా లేదు. ప్రమాదంలో గాయపడిన కార్మికుడు ఆసుపత్రి ఖర్చును భరించలేకపోతే, అతని 'స్వతంత్ర ఉపాధి' ఎంతటి భరోసాను ఇస్తుంది? చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడాల్సి వస్తోందని పలువురు కార్మికులు చెప్పడం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. గిగ్ వర్కర్ల విధానాన్ని 'కొత్త తరహా ఉపాధి'గా ప్రభుత్వాలు ముద్రవేసి, ఘనంగా ప్రకటించుకోవడం సిగ్గుచేటు. గిగ్ కార్మికులకు స్పష్టమైన చట్టపరమైన గుర్తింపు, కనీస భద్రతా ప్రమాణాలు, ఆరోగ్య, ప్రమాద బీమా, భద్రతా శిక్షణ, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ, పని సమయంలో విశ్రాంతి, తాగునీరు, పారిశుధ్యం వంటి హక్కులను నిర్ధారించాలి. తీవ్ర వాతావరణ పరిస్థితుల్లో పని గంటలు, డెలివరీ సమయాలపై మానవీయ నిబంధనలు తీసుకురావాలి. ప్రజా స్థలాలను కూడా పని ప్రదేశాలుగా గుర్తించి పట్టణ ప్రణాళికలో గిగ్ కార్మికుల అవసరాలను చేర్చాలి. గిగ్ వర్కర్లకు పనులను పురమాయించే వివిధ ప్లాట్‌ఫామ్ సంస్థలపైన కూడా కీలక బాధ్యత ఉంది. 'టెక్నాలజీ కంపెనీలు' ముద్ర వేసుకొని, శ్రమ బాధ్యత నుంచి తప్పించుకోవడం దుర్మార్గం. కార్మికుడి పనితీరును ఒక సంస్థ అల్గారిథమ్‌తో కొలుస్తున్నప్పుడు, ఆ అల్గారిథమ్ సృష్టించే ఒత్తిళ్లకు కూడా సదరు సంస్థే బాధ్యత వహించాలి. వేగం కంటే భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రమాదం జరిగినప్పుడు కార్మికుడిని ఒంటరిగా వదిలేయకూడదు. ఈ మొత్తం అధ్యాయంలో వినియోగదారుడి పాత్రను కూడా విస్మరించలేం. కొన్ని నిమిషాల్లో డెలివరీ రావాలని కోరుకోవడం సులభం. కానీ ఆ కొన్ని నిమిషాల వెనుక ఒక మనిషి మండే ఎండలో, ప్రమాదకరమైన రహదారిపై ప్రయాణిస్తున్నాడనే విషయం గుర్తుండాలి. ఆలస్యానికి దురుసుగా స్పందించడం, తక్కువ రేటింగ్ ఇవ్వడం, ప్రమాదకర పరిస్థితుల్లో కూడా సమయపాలన కోరడం వంటి ప్రవర్తనలు కార్మికుడిపై ఒత్తిడిని పెంచుతాయి. ఇక్కడ, గిగ్ ఆర్థిక వ్యవస్థను అడ్డుకోవడం పరిష్కారం కాదు. సాంకేతికతను వెనక్కి తిప్పడం కూడా సాధ్యం కాదు. కావాల్సిందల్లా బాధ్యతాయుతమైన ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థ మాత్రమే. వినియోగదారుడికి సౌకర్యం పెరిగే కొద్దీ కార్మికుడికి భద్రత పెరగాలి. యాప్ వేగంగా పనిచేసే కొద్దీ కార్మిక హక్కుల అమలు కూడా వేగంగా జరగాలి. గిగ్ కార్మికుడికి దానం అవసరం లేదు. హక్కులు కావాలి. సానుభూతి మాత్రమే కాదు, చట్టపరమైన రక్షణ కావాలి. స్మార్ట్ నగరాలు నిర్మించడం ఎంత ముఖ్యమో, ఆ నగరాలను నడిపించే కార్మికులకు గౌరవప్రదమైన జీవితం కల్పించడం కూడా అంతే ముఖ్యం.



## మా పథకాలు ట్రంప్ కాపీ

**కర్నాటకలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు ప్రజల్లో మంచి ఆదరణ పొందాయి. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా కాంగ్రెస్ హామీలనే కాపీ కొడుతున్నారు. నవంబర్‌లో జరిగే మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లు ప్రతినిధుల సభ, సెనెట్‌పై ఆధిపత్యాన్ని కొనసాగిస్తే.. ప్రతి వయోజన అమెరికన్‌కు 5,000 డాలర్ల చొప్పున 'డివిడెండ్' అందిస్తామని ట్రంప్ ప్రతిపాదించారు.**

– ముఖ్యమంత్రి డికె శివకుమార్




## శీతల భూగోళం దిశగా మానవాళి అడుగులు

జీవకోటి ఆరోగ్యకర మనుగడకు అనువైన వాతావరణం భూగ్రహంపైన మాత్రమే ఉన్నది. సూర్యరశ్మి లేకుండా జీవి మనుగడ సాగించలేదు. భూమాత గృహంలో సకల ప్రాణికోటి మనుగడకు సంబంధించిన ఉష్ణోగ్రతలు, వాతావరణం, పరిశుద్ధ గాలి, స్వచ్ఛమైన నీరు, పవిత్రమైన మట్టి అందుబాటులో ఉన్నాయి. ప్రాణులకు హాని కలిగించే అంశాలకు ప్రకృతి మాత్రమే అడ్డుకట్ట వేస్తున్నది. సూర్యుడి నుంచి భూమిపైకి చేరుతున్న సూర్యరశ్మిలో అతి ప్రమాదకర అతినీలలోహిత లేదా అల్ట్రావాయిలెట్ (యూవీ) కిరణాలు కూడా ఉంటాయి. ఈ కిరణాలు నేలపైకి చేరితే జీవకోటి ఉనికికి అతి ప్రమాదకరంగా మారుతుంది. ఇలాంటి అత్యంత ప్రమాదరమైన, హానికారక యువి కిరణాలను నేలపైకి రాకుండా 10–30 కిమీ దూరంలోని స్ట్రాటోస్ఫియర్‌లో ఓజోన్ అనబడే పొర అడ్డుకొని, శోషణం చేసుకొని, సాధారణ సూర్యరశ్మి నేలపైకి చేరడానికి దోహదపడుతుంది. ఇలాంటి ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఓజోన్ పొర జీవులకు ఒక రక్షణ గొడుగుగా పనిచేస్తున్నది.

**ఓజోన్ పొర ప్రాధాన్యం:** రసాయనపరంగా త్రిపరమాణుక ఆక్సిజన్ అణువు ($O_3$)ని ఓడోన్ అని పిలుస్తాం. ఈ అణువు యువి కిరణాలను శోషణం చేసుకొని, సాధారణ సూర్యరశ్మిని భూమిపైకి చేర్చుతుంది. ఓజోన్ పొర పలుచడినపుడు లేదా పొరకు రంధ్రాలు ఏర్పడినపుడు సూర్యరశ్మితో పాటు యువి కిరణాలు నేలపైకి చేరి మానవాళికి, జంతువులకు, వృక్ష సంపదకు హానిని కలిగిస్తాయి. ఓజోన్ పొర తరుగుదలను అడ్డుకోవడానికి స్థానిక స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు నిర్దిష్ట చర్యలు తీసుకోవడం నిరంతరం జరగాలి. రేపటి తరానికి ఆరోగ్యంగా జీవించడానికి అనువైన వాతావరణాలను బహుకరించడానికి కృషి చేద్దాం. నేటి యువతలో ఓజోన్ పరిరక్షణ అవగాహన పెంచుదాం.

*(16 సెప్టెంబర్ ప్రపంచ ఓజోన్ దినం సందర్భంగా)*

# లేదు.. లేదంటూనే యుపిఐపై రుసుము!

సామాన్యుడు భయపడాల్సింది ఏమీ లేదని, డిజిటల్ చెల్లింపులపై రుసుము ఆలోచన వారిపై ఎలాంటి ప్రభావం చూపదని చెప్తూ వచ్చిన కేంద్ర ప్రభుత్వం, 'వినాయక చవితి' పర్వదినాన (సెప్టెంబర్ 14)న వెజిట్ నోటిఫిషన్ జారీ చేయడం ఆశ్చర్యకర పరిణామం. పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007లోని సవరించిన 'సెక్షన్ 10 ఎ' కింద ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో రూ.2,000 వరకు యుపిఐ లావాదేవీలకు, రుపే డెబిట్ కార్డు చెల్లింపులకు బ్యాంకులు, పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లు ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ ఎలాంటి రుసుము వసూలు చేయరాదని పేర్కొన్నారు. అయితే, అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతోంది. ఇంత కాలం యుపిఐ లావాదేవీలపై మొత్తంతో సంబంధం లేకుండా ఎలాంటి రుసుము లేకపోతే, ఇప్పుడు చట్టపరమైన రక్షణను రూ.2,000 వరకు మాత్ర మే ఎందుకు పరిమితం చేశారు? రూ.2,000 దాటిన లావాదేవీల విషయంలో భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) విధించే అవకాశం ఉందా? ఉంటే ఎంత? ఎవరిపై? ఏ లావాదేవీలకు? వినియోగదారుడిపై ప్రత్యక్ష ప్రభావం ఉండదని ప్రభుత్వం చెబుతున్నప్పుడు, వ్యాపారి చెల్లించే రుసుము చివరికి వస్తువు ధరలో కలిసిపోయే అవకాశాన్ని ఎలా నిరోధిస్తా రు? ఇవే ప్రజల ముందున్న వాస్తవ ప్రశ్నలు. ప్రస్తుతం రూ.2,000కు మించిన యుపిఐ చెల్లింపులపై ఎలాంటి ఎండిఆర్ అమలులోకి రాలేదు. ప్రభుత్వం కూడా రేటును ఇంకా నిర్ణయించలేదని చెబుతోంది. యుపిఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ అంశంపై నిర్ణయం తీసుకునే ప్రక్రియ ఉంటుంది. కాబట్టి ఇప్పటి నుంచే యుపిఐకి రుసుము మొదలైంది అని చెప్పడం వాస్తవానికి మించి వెళ్లడం అవుతుంది. అదే సమయంలో యుపిఐ ఎప్పటికీ పూర్తిగా ఉచితంగానే ఉంటుంది అని చెప్పడానికి కూడా తాజా చట్టపరమైన మార్పు తర్వాత ఆధారం లేదు. ఈ రెండింటి మధ్య ఉన్న ఖాళీనే ఇప్పుడు ప్రభుత్వం స్పష్టంగా పూరించాలి. ఇదే అంశంపై కాంగ్రెస్ నాయకత్వం చేసిన విమర్శ రాజకీయ వాదనను ముందుకు తెచ్చింది. జైరాం రమేశ్ ప్రశ్నించినట్టు, రూ.2,000 వరకు మాత్రమే చార్జీల నుంచి చట్టపరమైన రక్షణ కల్పించడం భవిష్యత్తులో పెద్ద లావాదేవీలపై రుసుము విధించడానికి తలుపు తెరిచినట్టేనా అన్న సందేహం సహజమే. అమెరికన్ కంపెనీలకు మార్కెట్ తెరవడానికి, అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్‌ను సంతృప్తిపరచడానికి ఈ మార్పు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. యుపిఐని నిర్వహించడం ఉచితం కాదన్నది నిజం. లావాదేవీల పరిమాణం విపరీతంగా పెరిగినకొద్దీ సర్వర్లు, డేటా సెంటర్లు, సైబర్ భద్రత, మోసాల నివారణ, వ్యవస్థ నిర్వహణ, సాంకేతిక నవీకరణలపై ఖర్చు పెరుగుతుందనేది కూడా నిజమే. జులై 2026లోనే యుపిఐ 23.6 బిలియన్ లావాదేవీలను, సుమారు రూ.29.9 లక్షల కోట్ల విలువను నిర్వహించింది. ఇంత భారీ మౌలిక వ్యవస్థను నిరంతరం నిర్వహించడానికి స్థిరమైన ఆదాయ నమూనా అవసరమని చెల్లింపు పరిశ్రమ చాలా కాలంగా చెబుతోంది. అయితే ఖర్చు ఉందనే వాదనతోనే రుసుము విధానానికి సమర్థన కూడదు. యుపిఐ విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటి దాని సరళత, చౌకదనం. చిన్న వ్యాపారి నుంచి సాధారణ ఉద్యోగి వరకు అందరికీ ఒకే డిజిటల్ మౌలిక సదుపాయాన్ని అందించడం దాని బలం. అందులో రుసుము ప్రవేశిస్తే, అది ఎంత చిన్నదైనా, ఆ వ్యవస్థపై ప్రజల మానసిక నమ్మకాన్ని ప్రభావితం చేయవచ్చు. ప్రత్యేకించి నగదు నుంచి డిజిటల్ చెల్లింపుల వైపు ప్రజలను మళ్లించినప్పుడు డిజిటల్ చెల్లింపు ఉచితం అనే భావన కూడా ఒక విధాన ప్రోత్సాహకంగా పని చేసింది. ఇక్కడ ప్రభుత్వం చెప్పే మరో అంశాన్ని కూడా విస్మరించలేం. ప్రస్తుతం యుపిఐ వ్యవస్థకు ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర ఆర్థిక మద్దతులు అవసరమవుతున్నాయి. లావాదేవీలు పెరి గే కొద్దీ ప్రతి లావాదేవీపై ప్రభుత్వమే వ్యయం భరించడం దీర్ఘకాలంలో ఎంతవరకు సాధ్యమనే ప్రశ్న ఉంది. మరిన్ని కంపెనీలు ఈ రంగంలోకి రావాలంటే వాటికి స్థిరమైన వ్యాపార నమూనా అవసరం. సైబర్ భద్రతపై పెట్టుబడులు పెంచాలి. మోసాల నియంత్రణకు ఆధునిక సాంకేతికత అవసరం. ఇవన్నీ వాస్తవ సమస్యలే. కానీ అదే సమయంలో, మరో ప్రమాదం కూడా ఉంది. ప్రభుత్వం వ్యాపారులపై ఎండిఆర్ విధించినా, వ్యాపారి ఆ వ్యయాన్ని వినియోగదారుడిపై మళ్లించే అవకాశం పూర్తిగా లేకపోలేదు. చట్టపరంగా చార్జీ వినియోగదారుడిపై కాదు అని చెప్పడం ఒక విషయం; వస్తువు లేదా సేవ ధరలో ఆ వ్యయం ప్రతిబింబించకుండా చూడటం మరో విషయం. ఒక రెస్టారెంట్, ఆసుపత్రి, ఆన్‌లైన్ సేవ, పెద్ద రిటైల్ సంస్థ లేదా ఇతర వ్యాపారి తన మొత్తం చెల్లింపు వ్యయాన్ని ధరల నిర్మాణంలో కలిపితే, వినియోగదారుడు పరోక్షంగా భారం మోయాల్సి వస్తుంది. అందుకే ఎండిఆర్ రూపకల్పనలో రేటు కంటే పారదర్శకత, పోటీ, వినియోగదారుడి రక్షణ ముఖ్యమైనవి. ఇంకో ముఖ్యమైన అంశం చిన్న వ్యాపారులది. యుపిఐని అత్యంత వేగంగా స్వీకరించిన వర్గాల్లో చిన్న దుకాణదారులు, వీధి వ్యాపారు లు, స్వయం ఉపాధి పొందేవారు ఉన్నారు. వారికి ప్రతి లావాదేవీపై అదనపు ఖర్చు కూడా గణనీయమే. పెద్ద సంస్థలకు అది ఖర్చుల లో ఒక చిన్న భాగం కావచ్చు. చిన్న వ్యాపారికి మాత్రం అది లాభంలో నేరుగా కోత కావచ్చు. అందుకే రూ.2,000 పరిమితి కేవలం వినియోగదారుడిని రక్షించే గీత కాదు. చిన్న వ్యాపార వ్యవస్థను కాపాడే విధాన పరికరంగా కూడా చూడాలి. వినియోగదారుల నుంచి నేరుగా యుపిఐ చార్జీ వసూలు చేయడం లక్ష్యం కాదని, భవిష్యత్తులో ఎండిఆర్ ఉంటే అది వ్యాపారులపై వర్తిస్తుందని స్పష్టం చేయడం ఇప్పటివరకు ప్రభుత్వం చెప్పిన అత్యంత ముఖ్యమైన విషయం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఎండిఆర్ వినియోగదారులపై కాకుండా వ్యాపారులపై వర్తిస్తుందని, బ్యాంకులు, ఫిన్టెక్ సంస్థలు మౌలిక సదుపాయాలు, భద్రత, ఆవిష్కరణలపై పెట్టుబడులు పెట్టడానికి అది తోడ్పడుతుందని పేర్కొన్నారు. పార్లమెంటులోనూ యుపిఐపై వినియోగదారుల నుంచి పన్ను లేదా ప్రత్యక్ష చార్జీ విధించే ఉద్దేశం లేదని ప్రభుత్వం వివరించింది. అయితే మాటలకంటే చట్టంలోని స్పష్టతే ప్రజలకు ముఖ్యం. నిన్నటి వరకు చార్జీ రక్షణ విస్తృతంగా ఉండి, ఇప్పుడు రూ.2,000 వరకు మాత్రమే స్పష్టంగా పేర్కొంటే, సహజంగానే అనుమానం కలుగుతుంది. ప్రభు త్వం ఆ అనుమానాన్ని రాజకీయ ప్రతివాదంతో కాదు, స్పష్టమైన విధాన పత్రంతో తొలగించాలి. రూ.2,000 పరిమితి ఎందుకు ఎంచుకున్నారో చెప్పాలి. పెద్ద లావాదేవీలకు ఎండిఆర్ ఉంటే దాని గరిష్ఠ పరిమితి ఏమిటో వెల్లడించాలి. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే లావాదేవీలపై ఎలాంటి రుసుము ఉండదని స్పష్టమైన నిబంధన ఇవ్వాలి. వ్యాపారులు వినియోగదారుల నుంచి ఆ రుసుము ను ప్రత్యేకంగా వసూలు చేయకుండా ఏ రక్షణలు ఉంటాయో వివరించాలి.

యుపిఐ భారతదేశపు డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు చెందిన ప్రజా మౌలిక సదుపాయంగా మారింది. దాని యాజమాన్యం, నిర్వహణ, సాంకేతిక భాగస్వామ్యం గురించి చర్చలు ఉండవచ్చు. విదేశీ సంస్థలు ఈ వ్యవస్థలో పనిచేయవచ్చు. దేశీయ ఫిన్టెక్ సంస్థలు పోటీ పడవచ్చు. కానీ అంతిమంగా వ్యవస్థ ప్రజలకు ఎంత అందుబాటులో ఉంది, ఎంత సురక్షితంగా ఉంది, ఎంత పారదర్శకంగా ఉంది అన్నదే దాని విజయానికి కొలమానం. ప్రభుత్వం కూడా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. యుపిఐని ప్రపంచానికి భారత డిజిటల్ విజయగాథగా చూపించినప్పుడు, దాని ఉచితాన్ని కూడా ఆ విజయగాథలో భాగంగానే చూపించింది. ఇప్పుడు ఆ నమూనాలో మార్పు చేయాలనుకుంటే, ప్రజలకు ముందుగానే పూర్తి వివరాలు చెప్పాలి. పార్లమెంటులో చట్టం ఆమోదం పొందడం మాత్రమే ప్రజా విశ్వాసానికి సరిపోదు. చట్టం తర్వాత వచ్చే ప్రతి నోటిఫికేషన్ కూడా అదే స్థాయి పారదర్శకతను కలిగి ఉండాలి. ప్రతిపక్షం కూడా ఈ అంశాన్ని భయాందోళనల రాజకీయంగా కాకుండా విధాన చర్చగా నడిపితేనే ప్రజలకు ప్రయోజనం. రేపు అందరిపై చార్జీ పడొచ్చు అనే సందేహం లేవనెత్తడం సమంజసమే. కానీ అది వాస్తవం కావాలంటే ఆధారం కావాలి. అదే సమయంలో ప్రభుత్వం వినియోగదారుడిపై ఎలాంటి భారం లేదు అని చెప్పడమే కాకుండా, ఆ హామీకి చట్టపరమైన, నియంత్రణపరమైన భరోసా ఇవ్వాలి. యుపిఐకి ఇప్పుడు ఎదురవుతున్న అసలు సవాలు ఉచితం వర్సెస్ రుసుము అనే సరళమైన ద్వంద్వం కాదు. ప్రజలకు అందుబాటులో ఉండే, వ్యాపారులకు భరించగలిగే, బ్యాంకులు ఫిన్టెక్ సంస్థలకు పెట్టుబడి పెట్టేంత ఆదాయాన్ని అందించే, అంతర్జాతీయ స్థాయిలో సురక్షితంగా ఉండే చెల్లింపు వ్యవస్థను ఎలా నిర్మించాలన్నదే అసలు ప్రశ్న. ఆ సమతుల్యత సాధించడంలో విఫలమైతే ఉచిత యుపిఐ కూడా నిలవదు; నియంత్రణలేని రుసుములు ప్రవేశిస్తే దాని ప్రజాదరణ కూడా దెబ్బతింటుంది. అందువల్ల సెప్టెంబరు 14వ తేదీ నాటి నోటిఫికేషన్‌ను తుది నిర్ణయంగా కాకుండా ఒక కొత్త దశకు ఆరంభంగా చూడాలి. ఈ దశలో అత్యవసరమైనది రాజకీయ ఆరోపణ కాదు, విధాన స్పష్టత. యుపిఐని నిర్మించడానికి ప్రజలు తమ అలవాట్లు మార్చుకున్నారు. ఇప్పుడు ఆ వ్యవస్థ భవిష్యత్తును నిర్ణయించే వారు కూడా ప్రజల నమ్మకాన్ని కేంద్రంగా ఉంచాలి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు నిలకడ అవసరమే. కానీ ఆ నిలకడకు తొలి పెట్టుబడి ప్రజల విశ్వాసమే. దానిపై ఎలాంటి రుసుము విధించకూడదు.

**కె.శ్రీనివాస్**




# దారి తప్పుతున్న కలాలు, శృతి తప్పుతున్న దళాలు

తెలంగాణ జన జీవితంలో పాట అంతర్భాగమైంది. కష్టమొచ్చినా, సంతోషమొచ్చినా, పండగైనా, పబ్బమైనా, పుట్టుకైనా, చావైనా పాట ఉండాల్సిందే. ప్రజల జీవన విధానం, ఆలోచనలు, ఆచారాలకు అనుగుణంగా కవులు అనేక పాటలు జనంలోకి తీసుకు వచ్చారు. గాయకులు పాటలను మధురంగా అలపిస్తూ ప్రజలకు చేరువ చేసేవారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటం నుంచి ఇటీవల తెలంగాణ సాధన వరకు తెలంగాణ ప్రజలను పాట తట్టి లేపింది. ఆలోచింపజేసింది. రౌద్రం నింపింది. ముందుకు నడిపించింది. దశాబ్దకాలంగా తెలంగాణ కవుల కలాలు దారి తప్పుతున్నాయి. లేని గొప్పతనాన్ని కొందరికీ అపాదించడానికి, జరగని విషయాలను జరిగినట్లు, ఉన్నట్లుగా భ్రమింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జన సమస్యలు, ఆచర వ్యవహారాల నడుమ మధ్య పుట్టిన తెలంగాణ పాట ఇప్పుడు ఆర్థిక అవసరాలను నెరవేర్చుకునేందుకు ప్రజలను వంచించే పనిలో పడ్డది. గళాలు చైతన్యాన్ని రగిల్చిన గొంతులు ఇప్పుడు రాజకీయ నేతల సేవలో తృప్తి పొందుతున్నాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పిలుపు ముందు తెలంగాణ సమాజ పరిస్థితి దయనీయంగా ఉండేది. బడుగు, బలహీన వర్గాల జీవితాలను శాసించే రోజుల్లో దేవునికి దండం పెట్టుకోవాలన్నా భయపడే పరిస్థితి నుంచి ప్రశ్నించే స్థాయికి ఎదగడంలో తెలంగాణ కవులు, గాయకుల కృషి దాగి ఉంది. తెలంగాణ సాహిత్యం అనేక ప్రజా ఉద్యమాలకు పురుడుపోసి నడిపించింది. వందల పాటలు సందర్భానుసారంగా పుట్టుకొచ్చాయి. స్థానిక పరిస్థితులను బట్టి ఎక్కడికక్కడ పాటలు కైకొట్టి పాడారు. చదువురాని బండి యాదగిరి అలపించిన

బండెనుక బండి కట్టి
పదహారు బండ్లు కట్టి
ఏ బండ్లో వస్తావ్ కొడకో
నైజాం సర్కారోడా
నాజీలను మించినవురో అంటూ సాగిన పాట

తెలంగాణ ప్రజలకు గొప్ప ధైర్యాన్ని ఇచ్చింది.

చిన్న చిన్న పోరగాళ్లు
సీతయ్య జీతగాళ్లు
గొడ్లళ్లు నూరినారు,
భుజాన పెట్టినారు

అంటూ భూస్వామి సీతారామిరెడ్డికి వ్యతిరేకంగా పుట్టిన గేయం. అనేకమంది సామాన్యులను సాయుధులను చేసింది. సొంత కరెన్సీ, రైల్వేలు, రవాణా వ్యవస్థ , లక్షలాది ఎకరాలు, ప్రపంచంలో బలవంతుడైన రాజుగా పేరొందిన నిజాంకు వ్యతిరేకంగా 'ముసలి నక్కకు రాచరికం దక్కునే' అంటూ దశరథి గర్జించాడు.

ఒక్క రోజు కూడా
ఒక్క నిమిషం సేపు,
దుక్కి దున్నని నీకు
దిక్కు తెలియని భూములెక్కడివి

అంటూ సుద్దాల హన్మంతు ప్రశ్నించాడు. అనేక మంది కవు లు నిజాం నవాబుకు వ్యతిరేకంగా గొప్ప సాహిత్యాన్ని ప్రజలకు అందించారు. మలిదశలో తెలంగాణ ఉద్యమంలో అంతకు తెలంగాణ కవులు గొప్ప విప్లవ సాహిత్యాన్ని తీసుకువచ్చి ప్రజలకు అందించారు. అనేక పాటలు ప్రజల నాలుకలపై నిలిచిపోయాయి. చెరబండ రాజు పాటలు పదును కత్తులై మెరిశాయి. గద్దర్, గూడ అంజయ్య, జయరాజు, అందెశ్రీతో పాటు అనేక మంది తెలంగాణ కవుల పాటలు గతాన్ని తెలియజేస్తూ వర్తమానాన్ని చూపుతూ భవిష్యత్తును ఆవిష్కరింపజేశాడు.

తాడేసి, తనుకేసి
పట్టణంలో కొడుకును
పై చదువు చదివిస్తే
కొలువులు దొరకకపోయేరా
కొడుకు బరువైపోయేరా

అంటూ భవిష్యత్తు నిరుద్యోగ సమస్యను 1980 దశకంలోనే గూడ అంజయ్య ఆవిష్కరింపజేశారు. ఇప్పుడు ప్రశ్నిస్తే వచ్చే నిర్బంధాలను



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా

తెలంగాణ కవులే దశాబ్దాల క్రితమే పాటల రూపంలో ప్రజల ముందు ఉంచారు. మలిదశ తెలంగాణ పోరాటం లో వందలాది పాటలు ప్రజల మదిలో గూడుకట్టుకున్నాయి. ప్రకృతిని, ప్రజలను సమాంతరంగా చూపుతూ తెలంగాణ పాటలు ఎక్కువగా వచ్చాయి. తెలంగాణ పాట కీర్తించింది, ప్రశ్నించింది.

రాతి బొమ్మలలోనా / కొలువైన శివుడా
రక్తబంధం విలువ
నీకు తెలియదురా
తెలిసి ఉంటే చెట్టంత నా
కొడుకును తెచ్చివ్వగలవాని మహిమలు

అంటూ మిట్టపల్లి సురేందర్ రాసిన పాట తెలంగాణ అంతట మారుమ్రోగింది.

ఇప్పుడు ఏమైంది తెలంగాణ పాటకు బిఆర్ఎస్ పాలనలో కెసిఆర్ తెలంగాణ కళాకారులను, కవులను వేతనాలు ఇచ్చి బందీలుగా చేశాడు. అప్పుడే దారితప్పిన కలలు మండు వేసవిలో మత్తడి తొక్కిన చెరువులంటూ అసంబద్ధ గీతాలను రచిస్తే, అరువు గళాలు అలపించాయి. ఏ పాట తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా ఉంచిం దో, ఏ పాట తెలంగాణ రాష్ట్ర సాధనకు దోహదపడిందో ఆ పాటను తనకు అనుకూలంగా మార్చుకోవాలని అనుకున్నప్పుడు

దొర కోసమే పాడాలి
దొర గురించి పాడాలా అంటూ
కొన్ని గొంతులు వినిపించాయి. కానీ తర్వాత

ఏ పాట రాజ్యాధికారానికి దగ్గర చేసేందుకు దోహదపడిందో ఆ పాటను తమ వైపుకు తిప్పుకునే ప్రయత్నం చేశాయి రాజకీయ పార్టీలు. ఆర్థిక ఇబ్బందుల్లో కవులు, కళాకారులకు డబ్బును ఎరగా చూపాయి.

బాల రసాల సాల
నవ పల్లవ కోమల కావ్య కన్యకన్
ఊడల కిచ్చి అప్పుడగు
కూడు భుజించటం కన్నా సత్ కవులు,
హాలికులు అయితేనేమి ...

అంటూ చెప్పడానికి ఇప్పటి కవులు, కళాకారులు బమ్మెర పోతనలు కాదు. కాబట్టి ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రశ్నించే పాట జన జీవితాలను, వారి సమస్యలను, అవసరాలను ఆవిష్కరించిన పాట ఇప్పుడు శృతించడం మొదలుపెట్టింది. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను, మతోన్మాదాన్ని చూస్తూ గడిపేస్తుంది. గొంతుకలు శృతించడానికి తప్ప మరెందుకు పనికిరాని పరిస్థితికి దిగజారాయి. పాట పుట్టిన నాటి నుండి నేటి వరకు ప్రజల పక్షాన నిలిచిన పాట అందుకు కారకులైన వారు చిరస్మరణీయులు. వారి మధ్య లేకపోవచ్చు కానీ పాట సజీవం. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల వేళ ప్రజల పక్షాన నిలిచిన కలాలకు, గళాలకు ఉద్యమాభివందనాలు. దారి తప్పిన కలాలు, గళాలు ప్రజలకోసం నిలవాలని ఆకాంక్షిద్దాం.

**ఏవిఆర్**



# ఉపరాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

### 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఈనెల 17న హైదరాబాద్‌లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పర్యటనకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న విమోచన దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్, వైద్య సేవలు, రహదారులు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఈనెల 17న ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. అనంతరం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు.ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సిఎస్ సంజయ్ జాజు సంబంధిత శాఖల కార్యదర్శులు, పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు కేంద్ర సాంస్కృతిక శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.సమావేశంలో జిఎడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, డిజిపి సి.వి. ఆనంద్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ‘తెలంగాణ విమోచన దినోత్సవ’ ఉత్సవాలు కేంద్ర ప్రభుత్వమే నిర్వహిస్తోంది

కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రభుత్వాలు ముందుకు రాకపోవడంతోనే కేంద్ర ప్రభుత్వమే ‘తెలంగాణ విమోచన దినోత్సవ’ ఉత్సవాలను నిరంతరాయంగా నిర్వహిస్తోందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాల్లో కేంద్ర సాయుధ దళాల విన్యాసాలు, ప్రత్యేకంగా వేలాది మంది తెలంగాణ కళాకారులతో కూడిన ఆకర్షణీయమైన నాట్య ప్రదర్శనలు, సంప్రదాయ డప్పుల విన్యాసాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ హాజరుకానున్నట్టు తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ విమోచన దినోత్సవ ఏర్పాట్లను కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న కేంద్ర సాయుధ బలగాల కవాతు (పరేడ్) రిహార్సల్స్, సాంస్కృతిక ప్రదర్శనల సన్నాహాలను ఆయన వీక్షించారు. అనంతరం భద్రత, ట్రాఫిక్ మళ్లింపు, విఐపి ప్రొటోకాల్ తదితర అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఇది ఏ ఒక్కరికో సంబంధించిన కార్యక్రమం కాదని, ఆనాడు నిజాం పెట్టిన బాధలను భరించి, తెలంగాణ ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన సమరయోధులను స్మరించుకోవడం కోసమే కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ‘హైదరాబాద్ ముక్తి దివస్’ను ప్రారంభించిందన్నారు. గతంలో బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి భయపడి ఉత్సవాలను నిర్వహించడం లేదని ఆరోపించారు.

## ‘22ఎ’పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టండి : మాధవరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రం ‘22ఎ’ అంశంపైన సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బిఆర్ఎస్ ఎమ్మె ల్యే మాదవరావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బిఆర్ఎస్ఎల్‌పి విప్ కె.పి.వివేకానందతో కలిసి మాదవరావు మాట్లాడుతూ తనపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసి, అసెంబ్లీ సమావేశాలకు అనుమతినిస్తే 22ఎకు సంబంధించిన ఆధారాలతో మాట్లాడుతానని, తాను చెప్పేవి అబ్బద్ధాలైతే, తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని స్ప ష్టం చేశారు. కె.పి. వివేకానంద గౌడ్ మాట్లాడుతూ ‘క్యూర్’ బిల్లుపై ఒక్కరోజే చర్చ, బిల్లు ఆమోదం జరిగిందని, 465పేజీలతో కూడిన ‘క్యూర్ బిల్లు’పైన కేవలం అర గంటలో చదివి చర్చించడం సాధ్యమా అని ప్రశ్నించారు. 1955 మున్సిపల్ చట్టాన్ని సవరించి, కొత్త బిల్లును ప్రవేశపెట్టే ముందు అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తాము మొదటి నుంచి చెబుతున్నామని తెలిపారు.




# ‘నేడు’ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల ఛాయాచిత్ర ప్రదర్శన

### ముస్తాబైన సిపిఐ రాష్ట్ర కార్యాలయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాల్లో భాగంగా ఈ నేలపై విప్లవాగ్నిని రగిలించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల ఘట్టాలతో పాటు వీరయోధుల పోరాట చరిత్రతో కూడిన చాయ చిత్ర ప్రదర్శనకు సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ ముస్తాబైంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికిన కమ్యూనిస్టు యోధులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్‌తోపాటు కమ్యూనిస్టు దిగ్గజం చండ్ర రాజేశ్వరరావు, సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, బొమ్మగాని ధర్మబిక్షం, రాజ్ బహదూర్ గౌర్, షేక్ బందగీ, కె.ఎల్. మహేంద్ర, సుద్దాల హనుమంత్, నల్ల నరసింహులు, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, చాకలి ఐలమ్మతో అమరవీరుల పోరాట చాయాచిత్రాలతో ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో ఏలాంటి సంబంధం లేని బిజెపి నాయకులు విమోచనం పేరుతో ఉత్సవాలను నిర్వహించే అర్హతే లేదన్నారు. ప్రపంచ చరిత్రలోనే మహోన్నతమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందేదుకు బిజెపి పప్రయత్నం చేస్తోందని ఆ కుట్రలను సాగనీయబోమని ఆయన స్పష్టం చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన వీరోచిత పోరాటంలో ప్రాణాలర్పించిన యోధుల ఛాయాచిత్రాల ప్రదర్శను బుధవారం ఉదయం సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

# సాయుధ పోరాట వారోత్సవాలు అధికారికంగా నిర్వహించాలి

- గ్రామపంచాయతీలలో జాతీయ జెండాలు ఎగురవేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- అమరుల స్మృతివనం ఏర్పాటు చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్నీ అధికారికంగా నిర్వహిస్తూ అన్ని గ్రామ పంచాయతీల్లో జాతీయ జెండాలు ఎగురవేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అమరవీరుల స్ఫూర్తినింపేలా స్మృతీ వనం ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కరీంనగర్‌లోని కూరగాయల మార్కెట్ వద్ద గల సాయుధ పోరాటంలో ఎన్‌కౌంటర్‌కు గురైన అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి చాడ వెంకట రెడ్డి పూలమాల వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం రజాకార్ల ఆగడాలను ఎదిరించడానికి 1947 సెప్టెంబరు 11న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీల అగ్రనేతలు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మకూం మొహియుద్దీన్ లు పిలుపు నిచ్చారని, ఆ పిలుపునందుకొని తెలంగాణ ప్రాంతంలో నిజాంకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం జరిగిందని, ఆ పోరాట మూలంగా 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు దక్కిందని, 4,500 మంది అమరవీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, కమ్యూనిస్టుల పోరాటం మూలంగానే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో 1948 సెప్టెంబర్ 17న విలీనం కాబడిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సాయిధ పోరాట స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని, ఆ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై పెట్టాలని, నాటి పోరాటమే లేకుంటే నేటి తెలంగాణ ప్రాంతమే లేనందున ఆ ఘట్టాలను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాలు ఎగురవేసేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన కరీంనగర్ నడిబొడ్డున ఉన్నటువంటి అనభేరి ప్రభాకర్ రావు విగ్రహం చుట్టూ, కోతి రాంపూర్ బైపాస్ రోడ్డులోని కరీంనగర్ మొట్టమొదటి పార్లమెంట్ సభ్యుడు బద్దం ఎల్లారెడ్డి విగ్రహం చుట్టూ సుందరీకరణ చేయాల్సిన బాధ్యత అటు ప్రభుత్వంపై ఇటు నగర పాలక సంస్థపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమళ్ళ సమ్మయ్య, బోయిని తిరుపతి,న్యాలపట్ల రాజు,జిల్లా కౌన్సిల్ సభ్యులు బండ రాజిరెడ్డి,పైడిపెల్లి రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి,బీర్ల పద్మ,ప్రజా నాట్య మండలి కళాకారులు కె.స్వామి,లక్ష్మీ నారాయణ,రాజయ్య,నాయకులు చెంచల మురళి,కాల్వ శ్రీనివాస్,మల్లయ్య,శ్రీనివాస్, రాజు, కొమురయ్య,బాపురెడ్డి,బీర్ల స్వాతి,విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలను మించిపోయిన పోలీసు శాఖ

బిఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్ శాఖ కాంగ్రెస్ కార్యకర్తల కంటే మించి ఎక్కువగా పని చేస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. తన పిఆర్ఒ, పిఎపైన పోలీస్ స్టేషన్‌లో దాడికి పాల్పడింది ఎవరో తేలాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ ఇంటిమీద దాడి జరిగిందని, గుండాలు పోలీస్ స్టేషన్‌లో దాడులకు తెగబడిన వారిపైన ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదని తెలిపారు. ఈ అంశంపైన తాము కోర్టును ఆశ్రయిస్తామన్నారు.


## దాడులకు పాల్పడితే.. ప్రతిదాడులు తప్పవు

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రేవంత్ రెడ్డి పాలన ప్రతిపక్షాలను వేధించడం పరాకాష్టకు చేరిందని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి ఆరోపించారు. కెసిఆర్ కుటుంబంపై కుట్రలకు పాల్పడితే తెలంగాణ అగ్ని గుండం అవుతుందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వ దాడులకు ప్రతి దాడులు తప్పవని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం స్వయంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపై దాడికి ఉసి గొల్పారని ఆరోపించారు. రాష్ట్రంలో హింసాత్మక రౌడీ పాలన సాగుతోందని, 30 వేల మంది బూత్ ఏజెంట్లకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు జారీ చేసిందని , ముసుగులు వేసుకుని పోలీస్ స్టేషన్‌పై దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్‌న నాయకులు బాలరాజు యాదవ్ ,బొమ్మెర రామమూర్తి ,కిషన్ రావు పాల్గొన్నారు.

# ఇంజనీర్ల కృషితోనే అభివృద్ధి సాధ్యం

- దేశ నిర్మాణంలో ఇంజనీర్లదే కీలక పాత్ర..
- సాంకేతికతను ప్రజా సంక్షేమంతో మేళవించాలి: మంత్రి కోమటిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రహదారులు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక రంగం, పట్టణాభివృద్ధి నుంచి ఆధునిక సాంకేతిక రంగాల వరకు ప్రతి అభివృద్ధి అడుగులోనూ ఇంజనీర్ల కృషి కీలకమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇంజనీర్ల ప్రతిభ, కృషి లేకుండా రాష్ట్రం గానీ, దేశం గానీ అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా రాష్ట్రంలోని ఇంజనీర్లందరికీ మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశం గర్వించదగిన తొలి తరం ఇంజనీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో ఆర్అండ్‌బి శాఖ ఇఎన్‌సి లింగారెడ్డి, చీఫ్ ఇంజనీర్లు బి.వి.రావు, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, నర్సింగ్‌రావు, వనజతో పాటు పలువురు ఇంజనీర్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అసాధారణ ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావం, దూరదృష్టి నేటి తరానికి, ముఖ్యంగా ఇంజనీర్లకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. విశ్వేశ్వరయ్య తన జీవితాన్ని దేశ నిర్మాణానికి అంకితం చేశారని, ఆయన చూపిన మార్గంలో నేటి తరం ఇంజనీర్లు పనిచేయాలని సూచించా రు. దేశ నిర్మాణానికి ఇంజనీర్లు వెన్నెముక. ర హదారులు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక రంగం, పట్టణాభివృద్ధి, ఆధునిక సాంకేతిక రంగం.. ఇలా ప్రతి రంగంలోనూ ఇంజనీర్ల పాత్ర అనివార్యం. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజా సంక్షేమంతో మేళవించి ప్రజల జీ వితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలి అని మంత్రి అన్నారు.తెలంగాణలో బలమైన మౌలిక వసతుల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నాణ్యమైన రహదారులు, ఆధునిక భవనాలు, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఇంజనీర్లు అంకితభావంతో పని చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు.

### ‘ఎంబిబిఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా’

## తొలి, రెండవ ఫేస్ సీట్లు విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎంబిబిఎస్ 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ‘ఎంబిబిఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా’ సెకండ్ ఫేజ్ సీట్లతో పాటు మేనేజ్‌మెంట్ మొదటి ఫేస్ సీట్లను కూడా కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కెఎన్‌ఆర్‌యుహెచ్‌ఎస్) మంగళవారం విడుదల చేసింది. కన్వీనర్ కోటాలో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 19 సాయం త్రం 4 గంటలలోపు తమకు సీట్లు కేటాయించిన కళాశాలల్లో చేరాలని, ఇందు కు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించింది. అలాగే మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంబిబిఎస్/బిడిఎస్ సీట్ల ఫస్ట్ ఫేజ్ కేటాయింపులను కూడా యూనివర్సిటీ విడుదల చేసిం ది. ఈ కేటగిరీలో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 6 గంటలలోపు తమకు సీట్లు కేటాయించిన కళాశాలలో చేరాలని, అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర పత్రాలను సమర్పించి, అడ్మిషన్ పూర్తి చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. కళాశాలల వారీగా సీట్ల కేటాయిం పు వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులోఉంచింది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ షెడ్యూల్ ప్రకారం 2026–27 విద్యా సంవత్సరానికి ఎంబిబిఎస్, బిడిఎస్ అకడమిక్ సెషన్ మంగళవారం నుంచి ప్రారంభమైందని యూనివర్సిటీ తెలిపింది. విద్యార్థులు నిర్ణీత గడువులో తమ అడ్మిషన్లను పూర్తి చేసుకోవాలని సూచించింది.

# కల్తీ కల్లు దందాపై ఎక్సైజ్ ఉక్కుపాదం

- రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఆపరేషన్..
- సిద్దిపేటలో 5 కిలోలు, సైబరాబాద్‌లో 1.931 కిలోలు పట్టివేత
- మహారాష్ట్ర, ముంబయి, గుజరాత్ నుంచి తెలంగాణకు అక్రమ సరఫరా..
- తయారీ కేంద్రాలపైనా నిఘా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈత, తాటి చెట్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. దీంతో కల్లుకు ఉన్న డిమాండ్‌ను అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. సహజసిద్ధమైన కల్లు అందుబాటులో లేకపోవడంతో కృత్రిమంగా కల్లు తయారు చేసి మార్కెట్‌లోకి పంపేందుకు ప్రమాదకర రసాయనమైన ఆల్ప్రాజోలంను వినియోగిస్తున్న ముఠాలు రాష్ట్రంలో విస్తరిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ గుర్తించింది. దీంతో ఆల్ప్రాజోలం అక్రమ తయారీ, రవాణా, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ యుద్ధ ప్రాతిపదికన నిఘా ముమ్మరం చేసింది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి ఆదేశాలతో స్టేట్ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా ఎక్సైజ్ బృందాలు రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో రంగంలోకి దిగాయి. సిద్దిపేటలో టాస్క్‌ఫోర్స్ బృందం రూ.50 లక్షల విలువైన 5 కిలోల ఆల్ప్రాజోలం, కారును స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను పట్టుకుంది. సైబరాబాద్‌లో మరో ఆపరేషన్‌లో రూ.24 లక్షల విలువైన 1.931 కిలోల ఆల్ప్రాజోలం పట్టుబడింది. గత ఏడాది రాష్ట్రంలో 28.67 కిలోల ఆల్ప్రాజోలం ఎక్సైజ్ బృందాలకు చిక్కగా.. ఈ ఏడాది కూడా అక్రమ సరఫరా కొనసాగుతున్నట్లు తాజా పట్టివేతలు స్పష్టం చేస్తున్నాయి. ముంబయి, మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాల నుంచి తెలంగాణకు ఈ రసాయనం తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కేవలం రవాణాదారులపైనే కాకుం డా ఆల్ప్రాజోలం తయారు చేస్తున్న ముఠాలు, సరఫరా నెట్‌వర్క్, కృత్రి మ కల్లు తయారీ కేంద్రాలపై కూడా అధికారు లు దృష్టి సారించారు. హై దరాబాద్ పరిసరాలతోపాటు ఘట్‌కేసర్, సూర్యాపేట, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో అనుమతులు లేకుం డా రసాయనాలను తయారు చేస్తు న్న యూ నిట్లను గుర్తించి గతంలో ఎక్సైజ్ అధికారులు కేసులు నమోదు చేశారు. నివాస గృహాలు, కోళ్ల ఫారాలను సైతం అక్రమ తయారీ కేంద్రాలుగా మా ర్చుకున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మహబూబ్‌నగర్‌లో ఆల్ప్రాజోలం వినియోగించి తయారు చేసిన కృత్రిమ కల్లును ఎక్సైజ్ బృందా లు ధ్వంసం చేశాయి. కల్లులో కల్తీకి అడ్డుకట్ట వే యడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఆల్ప్రాజోలం ఎక్కడి నుంచి వస్తోంది? ఎవరికి సరఫరా అవుతోంది? కృత్రిమ కల్లు తయారీ వెనుక ఉన్న అసలు ముఠా ఎవరు? అనే కోణాల్లో ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగు లు, ఉపాధ్యాయులకు ఎన్నికల సమయం లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో సిఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని తెలంణ రక్ష ణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. పారదర్శకమైన పాలన అందించడంలో ప్రభుత్వ ఉద్యోగులదే కీలక పాత్ర అని,అందుకే వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 18 లోపు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే హైదరాబాద్ ను దిగ్బంధించేందుకు ఉద్యోగ సంఘాలు పిలుపునివ్వాలని కవిత కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై (టిఆర్ఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్, బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన సదస్సులో కవిత మాట్లాడారు. ఉద్యోగులు, ప్రభుత్వ ఉపాధ్యాయులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ పని కూడా అయిపోయిందన్నారు. ఉద్యోగులకు చెందిన డిఎలు, పిఆర్సి,పెన్షన్లు, రిటైర్ మెంట్ బెనిఫిట్స్ విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలను అడిగే విషయంలో ఉద్యోగులు భయపడాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. 2003 లో రిక్రూట్ అయిన టీచర్లకు ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, టిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి శ్రీనివాస్, కనిష్క మహేందర్ రెడ్డి, విద్యావేత్త ధరణిరాణి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం.**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రం. ఫోన్ నం. 08743-232428
ఆర్.సి నం. ఇ1/625/2026 | ఈ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు ప్రకటన | తేదీ: 13.09.2026
ఈ దేవస్థానంనకు సంబంధించిన వివిధ పనులు చేయుటకుగాను రిజిష్టర్డ్ సంస్థల నుండి ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు కోరబడుచున్నవి. **ఇ-టెండరు డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది:** 16.09.2026 ఉదయం గం.11.00ల నుండి, **టెండరు దాఖలు చేయు చివరి తేదీ:** 22.09.2026 ఉదయం గం.11.00 వరకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది:** 22.09.2026 ఉదయం గం.11.30 ని.లకు. ఇతర వివరములు https://tender.telangana.gov.in నందు చూడగలరు.
సం/- కె. దామోదర్ రావు
కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 9941-PP/CL/ADVT/2026-27, Date: 15-09-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-30, జిహెచ్ఎంసి.**
NIT No.21 : NIT No. 25/E.E.30/GHMC/2026-27 | తేదీ: 15.09.2026
**పని పేరు:** జిహెచ్ఎంసి, కెజెడ్, డివిజన్-30 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు, **అంచనా విలువ:** రూ.7.10లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది:** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 15.09.2026 మ.03.00గం.ల నుండి మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 16.09.2026 మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 9971-PP/CL/ADVT/2026-27, Date: 15-09-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| NIT No. 15/EE/ Circle-34/GZ/ GHMC/2026-27, తేది: 11.09.2026 | 6 పనుల కొరకు, సిసి రోడ్ల నిర్మాణం, షెడ్ ఏర్పాటు, మైదానాల నిర్వహణ మరియు వీధి దీపాల స్తంభాల ఏర్పాటు. | రూ. 100.00 లక్షలు | ప్రారంభ తేది: 15.09.2026 సా.4.00గం.ల నుండి / ఆఖరి తేది: 22.09.2026 ఉ.11.30గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-34, జి.జెడ్, జిహెచ్ఎంసి, అబిడ్స్. ఫోన్ నెం. 7993360287 |
| మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://tender.telangana.gov.in లో చూడవచ్చు. | | | | కమిషనర్, జిహెచ్ఎంసి |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-34, (జిజెడ్) జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 9959-PP/CL/ADVT/2026-27, Date: 15-09-2026




## ఎఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవ వేడుకలు వరంగల్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి తెలిపింది. మంగళవారం హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో ఏఐఎస్ఎఫ్ విడుదల చేయడం జరిగింది. అనంతరం ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్య 2020 వలన విద్య మరింత వ్యాపారంగా మారుతుందని, దీనికి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ పోరాటాన్ని కొనసాగిస్తుందని, విద్యా బడ్జెట్‌ను జిడిపిలో 10 శాతానికి పెంచాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సిహెచ్ హరీష్ అభిప్రసాద్, వివేక్, వెనీష్, అరవింద్, హరీష్ పాల్గొన్నారు.

## సర్పంచ్‌పై విలేకరుల ఫిర్యాదు

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు పోలీస్ స్టేషన్‌లో వేలేరు మండలానికి చెందిన ఓ సర్పంచ్‌పై వేలేరు, ధర్మసాగర్ విలేకరులు పలువురు ఫిర్యాదు చేశారు. ఓ విలేకరిపై సర్పంచ్ కక్షపూరితంగా కేసు నమోదు చేశారని పేర్కొంటూ ఇరుమండలాల విలేకరులు సోమవారం వేలేరు ఎస్సై ఎ.సురేష్‌కు పిటిషన్ అందజేశారు. ఇటీవల గ్రామంలో చోటుచేసుకున్న ప్రజాసమస్యలు, ప్రజా కార్యక్రమాలకు సంబంధించిన విషయాలను వార్తల రూపంలో వెలుగులోకి తీసుకువచ్చిన ఓవిలేకరిపై సర్పంచ్ కక్ష్యపూరితంగా కేసుపెట్టారని ఆరోపించారు. వార్తలు రాసినందుకు విలేకరినే లక్ష్యంగా చేసుకొని పోలీస్ కేసు నమోదు చేయడం చేయడం సరైందికాదని పేర్కొన్నారు.విలేకరులపై ఒత్తిళ్లు, బెదిరింపులకు పాల్పడకుండా స్వేచ్ఛగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారు ఎస్సైని కోరారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/జనగామ:** పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ దేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరవడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని, జనవోలు మండలం వెంకటాపూర్, గర్మిళ్ల గ్రామాలకు సంబంధించిన 42 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ.42లక్షల 4వేల విలువగల చెక్కులను, 32 మంది సీఎం సహాయ నిధి లబ్ధిదారులకు రూ.13లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలయ్య, తహశీల్దార్, ఎంపీడీవో, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## పోరాటంలో మహిళలది వీరోచిత పాత్ర



ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

**ప్రజాపక్షం/జనగామ:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మహిళలు చూపిన వీరోచిత పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. భూస్వామ్య, దొరల దోపిడీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో మహిళలు పురుషులతో సమానంగా పాల్గొని అణచివేతను ఎదురు నిలిచారని తెలిపారు. మంగళవారం జనగామ ఆర్టీసి చౌరస్తాలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఐద్వా జనగామ పట్టణ కార్యదర్శి పందిళ్ల కళ్యాణి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో మహిళలకు చైతన్యవంతమైన పోరాట పంథాలో ముందుకు నడిపించిన చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం వంటి వీరనారుల త్యాగాలు మరువలేనివన్నారు. నాటి పోరాట స్ఫూర్తితో నేడు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

## కంటి చూపే ప్రధానం

'విటమిన్-ఎ'తో కంటిచూపు మెరుగు: డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్ రావు



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హైదరాబాద్ ఆదేశాల మేరకు జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో చల్వాయి గ్రామంలోని తెలంగాణ ప్రభుత్వ బాలికల మోడల్ స్కూల్‌లో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్‌రావు మాట్లాడుతూ ములుగు జిల్లాలోని 29,512మంది బాలబాలికలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 14,604 మంది బాలురు 14,908 మంది బాలికలు ఉన్నారని చెప్పారు. జిల్లాలో పనిచేస్తున్న ఆరు ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా కంటి పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. క్యారెట్, గుడ్లు, పాలు, ఆకుకూరలు, పసుపు రంగు కలిగిన పండ్లను అధికంగా తీసుకోవడం వల్ల కంటి ఆరోగ్యంతో పాటు వ్యాధి నిరోధక శక్తి కూడా పెరుగుతుందని విద్యార్థులకు వివరించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగ అనేష్ మాట్లాడుతూ పాఠశాలలోని సుమారు 250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి సంపత్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం డాక్టర్లు శ్రీవాణి, డాక్టర్ జయప్రద , అప్తాల్మిక్ ఆఫీసర్ తిరుపతి, టీజీ గర్ల్స్ మోడల్ స్కూల్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రామ్ చందర్, ఆర్‌బీఎస్‌కే బృంద సభ్యులు పాల్గొన్నారు.

# టిజిఎన్‌పిడిసిఎల్‌కు రెండు జాతీయ అవార్డులు

అవార్డులు సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డికి అందజేసిన అధికారులు



**ప్రజాపక్షం/హనుమకొండ :** విద్యుత్ పంపిణీలో స్మార్ట్‌గా, సురక్షితంగా, మెరుగ్గా కృత్రిమ మేధస్సు (ఎఐ), డ్రోన్ టెక్నాలజీ, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగిస్తున్నందుకు అలాగే వినియోగదారులకు అందించే మెరుగైన సేవలు, ఆపరేషనల్ ఎక్సలెన్స్‌లో ఉత్తమ పనితీరు కనబరుస్తున్నందుకు టిజిఎన్పీడీసీఎల్‌కు రెండు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా హన్మకొండ నక్కలగుట్ట ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం సంస్థ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డికి ఈ రెండు అవార్డులు డైరెక్టర్లు, సీజీఎం, సి.ఎస్ అందచేశారు. ఈ నెల 9వ తేదీన టైమ్స్ అస్పైర్ ఆధ్వర్యంలో 'సౌత్ ఇండియా పీఎస్ యూ, గవర్నెన్స్ ఎక్సలెన్స్ అవార్డు'ను బెంగళూరు లో కంపెనీ తరపున కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం అందుకున్నారు. ఈ నెల 10న ది ఎకనామిక్స్ టైమ్స్ ఆధ్వర్యంలో 'అడాప్టింగ్ కృత్రిమ మేధస్సు ఇన్ ఎనర్జీ' అవార్డు సి.ఈ సురేందర్ అందుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ టిజిఎన్పీడీసీఎల్‌లో అమలు చేస్తున్న కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఫీడర్ విద్యుత్ అంతరాయాల ముందస్తు అంచనా, డ్రోన్ ఆధారిత విద్యుత్ ఆస్తుల పర్యవేక్షణ, రియల్ టైం ఫీడర్ నిర్వహణ వ్యవస్థ , జిఐఎస్ ఆధారిత పర్యవేక్షణ, 24/7 ఏఐ వాట్సాప్ చాట్‌బాట్, సబ్‌స్టేషన్ లోడింగ్ అనలిటిక్స్, ఉద్యోగుల కోసం ఏఐ సహాయకుడు వంటివి అమలు చేస్తున్నందుకు అడాప్టింగ్ ఏఐ ఇన్ ఎనర్జీ అవార్డు దక్కాయని అన్నారు. అలాగే సంస్థలో సాంకేతికతను అందిపుచ్చుకొని వినియోగదారులకు అందిస్తున్న మెరుగైన సేవలకు గాను సౌత్ ఇండియా పీఎస్‌యూ, గవర్నెన్స్ ఎక్సలెన్స్ అవార్డు వరించిందని పేర్కొన్నారు. నెట్‌వర్క్ మౌలిక వసతుల విస్తరణ, ఇంటర్ లింకింగ్ లైన్లు, విపత్తు సన్నద్ధత ప్రణాళిక, కవర్డ్ కండక్టర్ పనులు, ఫీడర్ అవుటేజ్ ప్రిడిక్షన్ మోడల్, భద్రత, వినియోగదారుల సేవల్లో మెరుగుదల, సౌర విద్యుత్ ప్రోత్సాహం, డిజిటల్ సాంకేతికత, ప్రతిభకు గాను సౌత్ ఇండియా పీఎస్యూ & గవర్నెన్స్ ఎక్సలెన్స్ అవార్డు వచ్చిందని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులు టిజిఎన్పీడీసీఎల్‌కు జాతీయ స్థాయిలో లభిస్తున్న గుర్తింపును మరింత బలోపేతం చేయడంతో పాటు, సంస్థను సాంకేతికత, ఆవిష్కరణలు, డిజిటల్ పరివర్తనలో ముందంజలో ఉన్న విద్యుత్ పంపిణీ సంస్థగా నిలబెడుతున్నాయని అన్నారు. సంస్థకు లభిస్తున్న జాతీయ స్థాయి అవార్డులు టిజిఎన్పీడీసీఎల్ అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది సమష్టి కృషికి నిదర్శనమని సీఎండీ వ్యక్తం చేశారు.భవిష్యత్తులోనూ సాంకేతికతను మరింత విస్తృతంగా వినియోగిస్తూ వినియోగదారులకు నాణ్యమైన మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సిఈ సురేందర్, సి.ఎస్ వెంకటేశం పాల్గొన్నారు.

## చరిత్ర నేటి తరానికి తెలియజేయాలి

కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షులు ఏడునూతుల నిశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపి డిఆర్ఓ వసంతకుమారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఏడునూతుల నిశీధర్ రెడ్డి మాట్లాడుతూ, సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో అత్యంత ప్రాధాన్యత కలిగిన చారిత్రక దినమని అన్నారు. ప్రజల చారిత్రక ఆకాంక్షను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దీపావళికి సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ వైద్యసేవలు

వరంగల్ ఎంపి కడియం కావ్య చొరవతో వేగంగా వెల్‌నెస్ సెంటర్ పనులు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ నగరంలో సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు ప్రక్రియ వేగవంతమైంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య చేసిన నిరంతర కృషికి అనుగుణంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం సీజీహెచ్ఎస్ కేంద్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ పర్వీన్ బాలా, సీజీహెచ్ఎస్ వైద్య బృందంతో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేయూ క్రాస్ సమీపంలోని ఆకాశవాణి రేడియో స్టేషన్ ప్రాంగణంలోని ప్రతిపాదిత భవనాలను పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు అనువైన వసతులు, భవన పరిస్థితి, అవసరమైన మౌలిక సదుపాయాలను పరిశీలించారు.వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన ఆర్థిక అనుమతి కోసం కేంద్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న విషయాన్ని గుర్తించిన ఎంపీ, ఇటీవల మరోసారి ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసి విజ్ఞప్తి చేశారు.. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతిని త్వరితగతిన మంజూరు చేసి, మిగిలిన ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అందులో భాగంగానే నేడు కేంద్ర బృందంతో కలిసి ఎంపీ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించడం జరిగింది. తాజాగా అధికారుల బృందంతో కలిసి భవనాలను పరిశీలించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, దీపావళి నాటికి సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

# పకడ్బందీగా ధాన్యం తరలింపు ప్రక్రియ

హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్.రవి

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియ పకడ్బందీగా ఉండేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి పౌర సరఫరాలు, సహకార శాఖల అధికారులు, ధాన్యం కొనుగోలు కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన దాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియపై జిల్లా పౌర సరఫరాల శాఖ, ధాన్యం కాంట్రాక్టర్లతో సమావేశాన్ని అదనపు కలెక్టర్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తరలించే వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ ను ఏర్పాటు చేయాలన్నారు.

ధాన్యం తరలింపులో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. స్టోరేజ్ పాయింట్లలో ధాన్యం నిల్వ అవసరాలకు ఉపయోగపడే స్థలాలను సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. వాహనాల డ్రైవర్ల సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపయోగంలో లేని ఫంక్షన్ హాళ్లు, సినిమా హాళ్ళను స్టోరేజ్ పాయింట్లుగా వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి మహేందర్, జిల్లా సహకార అధికారి మోహన్, సివిల్ సప్లై డీటీలు భద్రు నాయక్, నాగేంద్ర ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, ధాన్యం కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



## రహదారి మరమ్మతులు

ప్రయాణికుల ఇబ్బందులపై వరుస కథనాల ప్రభావం

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు, నారాయణగిరి గ్రామాల మధ్య అధ్వాన్నంగా మారిన రహదారి, ప్రయాణీకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రజాపక్షం దినపత్రికలో వెలువడిన వరుస వార్తా కథనాలు, ఎట్టకేలకు స్పందనకు దారితీశాయి. ఈమార్గంలో ఏర్పడిన భారీ గుంతలు, వర్షం కురిసినప్పుడు రహదారిపై నీరు నిలిచిపోవడం, రాత్రివేళల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారడం వంటి సమస్యలను ప్రజాపక్షం దినపత్రిక వరుస కథనాల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చింది. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, వ్యాపారులు నిత్యం ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని కథనాల్లో ప్రస్తావించింది. మూలమలుపులు, వంకలు ఉన్న ప్రాంతాలలో గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కూడా ప్రజాపక్షం దినపత్రిక వరుస కథనాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాయి. నేపథ్యంలో నారాయణగిరి సర్పంచ్ పుట్ట రేణుక కుమార్ మంగళవారం ప్రజారవాణపై ఆధారపడే ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రహదారి మరమ్మతులు చేపట్టి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటూ రహదారిపై ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేపట్టిన నారాయణగిరి సర్పంచ్ పుట్ట రేణుక కుమార్ గ్రామపంచాయితీ పాలక వర్గానికి, గ్రామశాఖ అధ్యక్షుడు రంజిత్‌రెడ్డిని, తదితరులకు ప్రయాణీకులు, వాహనదారులు, బస్ డ్రైవర్లకు కృతజ్ఞతలు తెలపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియా కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జయశంకర్ జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ జోడు ప్రదీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్‌లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలాగే భూపాలపల్లి నియోజకవర్గంలోని సోషల్ మీడియా 9 మండలాల సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, గ్రామ శాఖల సోషల్ మీడియా అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియా కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాట్ల శ్రీనివాస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్ సోషల్ మీడియా నియోజకవర్గ ఇంచార్జ్ మంకెన కార్తీక్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి తోట రజిత్ నాయకులు తోట సంతోష్, ఉడుత మహేందర్, బౌతు విజయ్, పృధ్వి, నాగపురి శ్రీధర్, గణపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి భాస్కర్ రావు, చిట్యాల మండల అధ్యక్షుడు దబ్బేట అనిల్, మొగుళ్లపల్లి అధ్యక్షులు ఎండి రఫిక్, రేగొండ మండల అధ్యక్షుడు పున్నం రవి, కొత్తపల్లి గోరి మండల అధ్యక్షులు సూదనబోయిన ఓం ప్రకాష్ గణపురం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల వెంకటేష్ ముదిరాజ్, దుర్గం అంజి, సమీర్, మహేష్, నాగరాజు, చిలువేరు రాజు, గ్రామ స్థాయి సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## వారోత్సవాలు అధికారికంగా నిర్వహించాలి



సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన సెప్టెంబర్ 17 తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి చిహ్నం మూడు కోట్ల జంక్షన్లో ప్రభుత్వం అధికారులు సెప్టెంబర్ 17న తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా నిర్వహించాలని బి.అజయ్ సారథి రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ మహబూబాబాద్ పట్టణ మండల ముఖ్య నేతల సమావేశం వెలుగు శ్రావణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు సెప్టెంబర్ 17న అధికారికంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ నిర్మించిన సాయుధ పోరాట స్ఫూర్తి చిహ్నం వద్ద అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సాయుధ పోరాటాలు జిల్లాలో నిర్వహించామని 17వ తేదీన ముగింపు కార్యక్రమంలో సిపిఐ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ నేతలు పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగ చారి, తండా సందీప్, వీరవెల్లి రవి, నర్ర శ్రావణ్, బానోతు లింగ్య నాయక్ పాల్గొన్నారు.

# భూ రీసర్వేపై రైతులకు కలెక్టర్ అవగాహన



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలోని వసంతపూర్ గ్రామంలో మంగళవారం భూ రీ సర్వే ప్రక్రియపై గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని రైతులకు రీసర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ద్వారా భూ హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పక్కాగా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. రీసర్వే ప్రక్రియలో రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రీసర్వే సమయంలో రైతులు అధికారులకు సహకరించాలని, భూ వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా క్షేత్రస్తాయిలో సమగ్రంగా పరిశీలన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు రీసర్వేకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అనంతరం వరంగల్ మండలంలోని కొత్తపేట గ్రామంలో నిర్వహిస్తున్న ఫీల్డ్ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద క్షేత్రస్తాయిలో పరిశీలించారు. రైతులతో కలిసి రీసర్వే ప్రక్రియను పరిశీలించి, భూముల సరిహద్దులు, సర్వే వివరాల నమోదు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె కిషోర్‌కుమార్, ఆర్‌డిఓ సుమ, ఏడి సర్వే, రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, వరంగల్, ఖిలా వరంగల్ తహసీల్దార్లు శ్రీకాంత్, ఇక్బాల్‌తోపాటు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# పారదర్శకంగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఎన్నికలు

అక్టోబర్ 4న జిల్లా మేనేజింగ్ కమిటీ ఎన్నికలు

కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ప్రజాపక్షం/ములుగు :** భారత రెడ్‌క్రాస్ సొసైటీ ములుగు జిల్లా మేనేజింగ్ కమిటీ ఎన్నికలను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ ఆదేశాల మేరకు ములుగు జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలను అక్టోబర్ 4న నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా, నిర్ణీత కాలపట్టిక ప్రకారం నిర్వహించాలని సూచించారు. అర్హులైన సభ్యులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ ఓటర్ల జాబితా పరిశీలన, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు ఫలితాల ప్రకటన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల అధికారిగా ఎస్పి కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ధర్మనాయక్‌ను, ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం సంపత్‌రావును నియమించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 19న తుది ఓటర్ల జాబితాలో పాటు ఎన్నికల ప్రకటన విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 24 ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, ఒక్కో నామినేషన్‌కు తిరిగి చెల్లించని డిపాజిట్‌గా రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన, 26న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 3గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారని వెల్లడించారు. అవసరమైతే అక్టోబర్ 4న ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు పోలింగ్ నిర్వహించి, సాయంత్రం 4గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు. అనంతరం కమిటీ సభ్యుడి ఎన్నికను అదేరోజు నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

## వైన్స్ ముందు దంపతుల ఆత్మహత్యాయత్నం




**ప్రజాపక్షం/నర్సింహులపేట :** మద్యం స్వాధీనం పేరుతో అబ్కారి సిబ్బంది తమ ఇంట్లోకి చొరబడి సోదాలు చేశారని ఆరోపిస్తూ బొజ్జన్నపేటకు చెందిన చింతమల్ల యాకయ్య, స్వాతి దంపతులు మండలంలోని మధుర వైన్స్ షాపు ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తమ వద్ద ఉన్న 40వేల విలువైన మద్యాన్ని సిబ్బంది తీసుకెళ్లారని ఆరోపించారు. బీరువాలు, గిన్నేలు, బియ్యం బస్తాలను సైతం తనిఖీ చేశారన్నారు. తమ అనుమతి లేకుండా ఇంట్లోకి ఎలా ప్రవేశిస్తారని ప్రశ్నించారు. మూడు గంటలకు పైగా వైన్స్ షాపు ఎదుట ఆందోళన చేసినా అధికారలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా దంపతులు గ్రామంలో చిన్న బెల్టుషాపు నిర్వహిస్తూన్నారు. గతంలో కూడా వైన్స్ సిబ్బంది రైడింగ్ పేరుతో ఇండ్లలోకి చొరబడి మహిళలు, చిన్న పిల్లలు ఉన్నరనే కనికరం లేకుండా నానా భూతులు తిట్టేతూ అసభ్యకరంగా వ్యవహరించేవారని చెప్పారు. దీనిపై అధికారుల సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు, బాధితులు కోరుతున్నారు.

# పెద్దాసుపత్రి అడ్డాగా..'సదరం' పేరుతో వసూళ్లు!

ఫిజియోథెరపి వైద్యురాలి నిర్వాహకం
అర్హత లేకున్నా ధ్రువీకరణ చేస్తామని
రూ.లక్షల్లో వసూళ్లు?
ధ్రువీకరణ పత్రాలు రాకపోవడంతో
ఆవేదనలో బాధితులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పెద్దాసుపత్రి అక్రమ వసూళ్లకు అడ్డాగా మారుతుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వందలాది మంది అనర్హులకు అర్హత లేకున్నా 40 శాతానికి పైబడి అంగవైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. దీనిపై పలు ఫిర్యాదులు ఉన్నా ఉలుకు పలుకు లేదు. ఇప్పటికే చాలా మంది వద్ద ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తామని అర్హత వ్యవహారం మీద మరిచిపోండి అంటూ పెద్ద మొత్తంలో వసూళ్లు చేశారు. ధ్రువీకరణ పత్రాలు రాకపోవడంతో కనీసం మేము ఇచ్చిన డబ్బులైనా ఇవ్వండి అంటే దానికి కూడా స్పందించకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిజియోథెరపి వైద్యురాలు సదరం సెక్షన్‌లో పనిచేసే మరి కొంత మంది వైద్యులతో కలిసి ఒంటరి మహిళలు, వికలాంగ ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తానని ఈ వసూళ్ల కార్యక్రమం చేపట్టారు. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 30 వేల నుంచి రూ. 40వేల వరకు వసూలు చేశారు. సత్తుపల్లి మండలంలో ఒక గ్రామం లోనే 50 మంది అనర్హులకు వికలాంగ ధ్రువీకరణ పత్రాలు భారీ మొత్తంలో వసూళ్లు చేశారు. ఇప్పుడు అదే గ్రామానికి చెందిన కొందరి వ్యక్తుల వద్ద నగదు తీసుకుని పని చేయకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఫిజియోథెరపి వైద్యురాలితో పాటు మరి కొందరు కలిసి జిల్లా వ్యాప్తంగా భారీగా వసూళ్లు చేశారు. గడిచిన ఐదారు నెలలుగా సదరం ధ్రువపత్రాలకు సంబంధించి వసూళ్ల వ్యవహారం బయటపడుతున్న జిల్లాకు చెందిన మంత్రులు కానీ ఉన్నతాధికారులు కానీ కనీసం స్పందించకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమ వసూళ్ల వెనుక ఎవరైనా పెద్దలు ఉన్నారా లేకపోతే ఎందుకు ఈ అక్రమార్కులను వెనకేసుకొస్తున్నారన్న చర్చ సాగుతుంది. ఫోన్ పే ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. బాధితులు ప్రజాపక్షం దినపత్రికను ఆశ్రయించడంతో ఈ విషయమై ఫిజియోథెరపి వైద్యురాలిని ప్రజాపక్షం ప్రశ్నించగా అవును డబ్బులు తీసుకున్నాను ఇప్పుడు పని కావడం లేదని కొంత ఇచ్చేశాను. గతంలో పనిచేసి పెట్టినప్పుడు ఎవరు మాట్లాడలేదు. నాకు అనారోగ్యంగా ఉండి పని కాకపోవడంతో ఇప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. అవసరమైతే మీపై కేసు పెడతా మా లాయర్‌తో మాట్లాడండి అంటూ సమాధానమిచ్చారు. సదరం సర్టిఫికెట్లకు సంబంధించి మీరు ఫోన్ పే ద్వారా డబ్బులు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించగా పని చేద్దామనుకున్నాను. పేదలని సాయం చేద్దామని ఆశించాను. కానీ కుదరలేదంటూ సమాధానం ఇచ్చారు. తొలుత నాకు డబ్బులు ఎవరు ఇచ్చారంటూ ప్రశ్నించినప్పుడు ఫోన్ ద్వారా ఇచ్చిన స్క్రీన్ షాట్ చూపించడంతో మౌనం వహించారు. ఇది కేవలం ఒక గ్రామానికి సంబంధించిన విషయం మాత్రమే. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి వసూళ్లు భారీగా జరిగాయి. వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.4వేలు చెల్లిస్తుండడంతో అర్హత ఉన్నా లేకపోయినా వికలాంగ ధ్రువీకరణ కోసం సదరం క్యాంపుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామాల్లో సదరం సర్టిఫికెట్లు ఒంటరి మహిళలకు సంబంధించిన ధ్రువీకరణలు ఇస్తామని చెప్పి రూ. 40వేల నుంచి రూ. 50వేల వరకు పైరవీకారులు వసూలు చేస్తున్నారు. వైరా, బోనకల్, సత్తుపల్లి, కల్లూరు, చింతకాని మండలంలో ఈ వసూళ్ల కార్యక్రమం జోరుగా సాగింది. ఇప్పటికే అనేక మంది అనర్హులు వికలాంగ ధ్రువీకరణ పత్రాలతో పింఛన్ పొందుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే ఈ అక్రమ వసూళ్ల వెనుక ఉన్న వైద్యులెవరు, కేవలం ఫిజియోథెరపిస్టు మాత్రమే వసూళ్లకు పాల్పడిందా ఇంకా ఎవరు సహకరించారనే విషయం వెలుగులోకి వస్తుంది. ప్రజాప్రతినిధులు సైతం ఆ అక్రమ వ్యవహారాలపై దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ధ్రువీకరణలు ఇప్పిస్తామని వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

## యూరియా కోసం రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/పెనుబల్లి:** యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. పెనుబల్లి మండల సహకార పరపతి సంఘం ఎదుట మంగళవారం పెనుబల్లి మండలానికి చెందిన రైతులు యూరియా సరఫరా నిలిపివేశారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్య యాప్ లో బుక్ చేసుకున్నా యూరియా ఇవ్వడం లేదని రైతులు వాపోయారు. యూరియా నిల్వలు అయిపోయాయని సిబ్బంది తెలపడంతో రైతులు సొసైటీ యూరియా గోడౌన్ వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు.

## ఖమ్మంలో ఎఐకెఎంఎస్ బహిరంగ సభ



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఖమ్మంలో 28,29,30 తేదీల్లో జరిగే అఖిల భారత రైతుకూలీ సంఘం(ఎఐకెఎంఎస్)నాలుగో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కూసుమంచి మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ఎఐకెఎంఎస్ మండల అధ్యక్షుడు మాతంగి రామస్వామి అధ్యక్షత వహించారు. ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు వెంకన్న, ఎఐకెఎంఎస్ మండల ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి వీరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతోందని ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధర, ఆదాయ భద్రత కల్పించడంతో పాటు వ్యవసాయ విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై భవిష్యత్ పోరాట కార్యాచరణకు ఖమ్మం మహాసభలు వేదిక కానున్నాయని తెలిపారు. ఈనెల 28న ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాలలో జరిగే భారీ బహిరంగ సభకు రైతులు, కూలీలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సాయుధ పోరాట చరిత్ర వక్రీకరించొద్దు

టిజిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వీర తెలంగాణ సాయిధ రైతాంగ పోరాటాన్ని చరిత్రను ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు హృదయాల్లో నుంచి చెరిపేయలేదని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శేషగిరి భవన్‌లో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహత్తరపోరాటం భూమి కోసం భుక్తి కోసం సాగిందే తప్ప మతాల మధ్య ఘర్షణ కాదన్నారు. సెప్టెంబర్ 17ను మత విద్వేషాలకు వాడుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా విలీన దినోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల నేతృత్వంలో ప్రజలు సాగించిన ఉద్యమ వారసత్వాన్ని తుడిచిపెట్టే యత్నాలను తిప్పికొట్టాలని పీడిత ప్రజల హక్కుల సాధనకు ఆనాటి పోరాట స్ఫూర్తితో ఐక్యకంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య ముఖ్యనాయకులు బానోత్ వెంకట్ గోవింద్ ఉపేందర్ హాతీరామ్ హరి రమేష్ సురేష్‌బాబు బావ్‌సింగ్ మోహన్ రవి రాంప్రసాద్ చందర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పంటలు పరిశీలించి నమోదు చేయాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** డిజిటల్ క్రాప్ సర్వేలో ప్రతి పంట క్షేత్రాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని చిమ్మపుడి, పాపటపల్లి గ్రామాల్లో గ్రామ వాలంటీర్ల ద్వారా నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే పంటల నమోదు ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంట క్షేత్రాన్ని గ్రామ వాలంటీర్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించి అక్కడ సాగులో ఉన్న పంటను నిర్ధారించి వాటిని ఫోటో తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. రైతు చెప్పిన సమాచారంతో పాటు వాస్తవంగా క్షేత్రంలో ఉన్న పంటను పరిశీలించి నమోదు చేయడం ద్వారా సర్వేలో ఖచ్చితత్వం ఉంటుందన్నారు. ప్రస్తుతం వరి సాగుకు సంబంధించి సన్న రకాలు, లావు రకాలు గుర్తించి నమోదు చేయాలని వాలంటీర్లకు సూచించారు. రైతు సాగు చేస్తున్న వరి విత్తన రకాన్ని కూడా గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంట వివరాలు, విస్తీర్ణం, విత్తన రకం తదితర వివరాలు ఎటువంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. ఏడు సన్న వరి రకాల నమోదుకు రైతులు సహకరించాలన్నారు. ప్రభుత్వం సూచించిన సన్న వరి రకం విత్తనాలు కొనుగోలు చేసి వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు షాపుల వద్ద బిల్లు తీసుకుని భద్రపర్చుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదైతే ప్రభుత్వం పంట కొనుగోలు చేసే సమయంలో ఇబ్బందులు ఉండవన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి శిక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్యాయత్నం కేసులో నిందితుడు మరుపల్లి రాంబాబుకు ఐదేండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.41,500 జరిమానా విధిస్తూ మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు, ఖమ్మం న్యాయమూర్తి శివ రంజని తీర్పునిచ్చారు. ఖమ్మం వన్‌టౌన్‌లో చెరువు బజార్‌కు చెందిన మరుపల్లి రాంబాబుపై నమోదైన కేసులో దర్యాప్తు అనంతరం పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం పైవిధంగా తీర్పునిచ్చింది. ఎస్ఐలు కె. వెంకటేష్, యయాతిరాజ్ ఆధ్వర్యంలో దర్యాప్తు పూర్తి చేశారు. కేసు విచారణలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పావని, స్వప్నలు న్యాయస్థానంలో వాదనలు వినిపించారు.

## సాయుధ పోరాటంలో బ్రాహ్మణపల్లి చారిత్రక కేంద్రం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏనుగు గాంధీ



**ప్రజాపక్షం/ బోనకల్ :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో బోనకల్ మండలంలోని బ్రాహ్మణపల్లి చారిత్రక పాత్ర పోషించిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏనుగు గాంధీ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బ్రాహ్మణపల్లి, రాపల్లి గ్రామాల్లోని అమరులు కొంగర అప్పయ్య, నల్లమల్ల సత్యం స్థూపాల వద్ద సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా సాయుధ పోరాట యోధుడు, సిపిఐ సీనియర్ నాయకుడు పారుపల్లి రాఘవులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అగ్ర నాయకులు నడయాడిన బ్రాహ్మణపల్లి ఉద్యమానికి నాయకులు, కార్యకర్తలను అందించిన కేంద్రంగా నిలిచిందన్నారు. రావెళ్ల జానకిరామయ్య వద్ద శిక్షణ పొందిన గాదె మాధవరెడ్డి, పారుపల్లి పుల్లయ్యలు బ్రాహ్మణపల్లిని కేంద్రంగా చేసుకుని పరిసర గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు. గ్రామ ప్రజలు దళసభ్యులకు ఆశ్రయం, ఆహారం అందిస్తూ ఉద్యమాన్కి అండగా నిలిచారని, అందుకే బ్రాహ్మణపల్లికి ప్రతి కుటుంబంలో ఒక యోధుడు అనే గుర్తింపు వచ్చిందన్నారు. 1948లో కలకోటలో జరిగిన దాడిలో గాదె మాధవరెడ్డి అమరుడయ్యాడని, ఆయన త్యాగం నేటికీ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తోందని అన్నారు. నాటి యోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఏలూరి రమేష్, సిపిఐ నాయకులు పారుపల్లి నర్సింహారావు, గుడిద కృష్ణ, మడుపల్లి వెంకటేశ్వర్లు, చావా నాగయ్య, కొంగర కృష్ణయ్య, వంగల హనుమంతరావు, రావుల వీరస్వామి, ఏనుగు రామకృష్ణ, చావా గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఎఎం నిధులతో పినపాకకు మహర్దశ



**ప్రజాపక్షం/అశ్వాపురం:** పినపాక నియోజకవర్గంలోని బిటి రహదారులు, వంతెనల అభివృద్ధికి హెచ్ఎఎం నిధుల నుంచి సుమారు రూ. 186 కోట్లు మంజూరు చేయించడంపై అశ్వాపురం మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో నిధులు మంజూరయ్యాయని పేర్కొం టూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. నిధులతో గ్రామీణ రహదారులు, వంతెనలు అభివృద్ధి చెంది రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల మధ్య అనుసంధానం బలోపేతమవుతుందని పేర్కొన్నారు. దసరాలోపే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. హెచ్ఎఎం విధానంలో పనులు పూర్తయిన తర్వాత సుమారు 15ఏళ్ల నిర్వహణ బాధ్యత సంబంధిత సంస్థలదే ఉండటంతో నాణ్యతకు భరోసా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, స ర్పంచ్‌లు ఇర్పా కవిత, ఎనిక ఉషారాణి, మచ్చ నరసింహారావు, కుంజా జాను, ఉప సర్పంచ్ ధరావత్ హర్షనాయక్, నాయకులు ఆవుల రవి, మట్టా వీరభద్ర రెడ్డి, ఎనిక రవి, తెలం వీరభద్రం, సమకూరు వెంకన్న, లంకమల్ల కొండలరావు, బచ్చు వెంకట రమణ, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్లు గొల్లపల్లి నరేష్ కుమార్, వేముల విజయ్, జనరల్ సెక్రటరీ కంటెం నవీన్, బట్టి వెంకన్న, అండెం గంగ రాజు, గొడ్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

## సుడా పార్కు పరిశీలించిన చైర్మన్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల కేంద్రమైన రఘునాథపాలెంలో స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్కును సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పరిశీలించారు. మంగళవారం సుడా వైస్ చైర్మన్, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సుడా పార్కును పరిశీలించారు. పార్కులో మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ, సందర్శకులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సుడా పార్కులో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేలా పార్కులో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్‌బాబా, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, రఘునాథపాలెం సర్పంచ్ కృష్ణారావు, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, నాయకులు కమర్తపు మురళీ, శేఖర్ గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, గౌస్, వెంకటయ్య పాల్గొన్నారు.

## క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు

మేయర్ మూడ్ గణేష్



**ప్రజాపక్షం/పాల్వంచ :** చిన్ననాటి నుంచే విద్యార్థులు చదువుతో పాటుగా తమకిష్టమైన క్రీడలను ఎంచుకొని సాధన చేసి రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. అంతర్జాతీయ వేదికపై అద్భుత ప్రతిభ కనభరిచి ప్రపంచ రికార్డుతో పాల్వంచ ఖ్యాతిని చాటిన విద్యార్థులు అబ్దుల్ నుమాన్, దీక్షితలను మంగళవారం ఆయన అభినంధించారు. వెంగళరావు కాలనీ, లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు మేయర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచ రికార్డు సృష్టించిన అబ్దుల్ నుమాన్, రావుల దీక్షితలను శాలువాలతో సత్కరించి మెమొంటోలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్లోబల్ వేదికపై మన ప్రాంత విద్యార్థులు ఉత్తమమైన ప్రతిభ చాటడం మనకందరికి గర్వకారణమని చెప్పారు.నేటి పోటీ ప్రపంచంలో చదువుతో పాటు శారీరక, మానసి ఉల్లాసానికి , కెరీర్ ఎదుగుదలకు క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకం తోడైతే విద్యార్థులు ఏ రంగంలోనైనా అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో రాణించిన విద్యార్థులు రాబోయే రోజుల్లో జరిగే క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించి తల్లిదండ్రులకు, చదువుకొనే పాఠశాలకు, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అడుసుమిల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు విశ్వేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కీర్తి, జయలక్ష్మి, శ్రీను, నాయకులు కాసర్ల రామారావు, గౌతమి క్రిష్ణ, వల్లపు యాకయ్య, గొర్లె నరేష్, నామా పండు, నునావత్ దినేష్, ఆలపాటి ప్రసాద్, తులసీరామ్, కిరణ్, వాంకుడోత్ రవి, బిక్కూలాల్, అల్లి వెంకటేశ్వర్లు, పేరెంట్స్ అబ్దుల్ రహమాన్, ఆయేషా ఫిర్దోస్, రావుల శ్రీనివాస్, సుమలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి

విధుల్లో నిర్లక్ష్యంపై ఆర్ఐ, ఎంపిడిఒపై చర్యలు

కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం మల్కానపల్లి, చిన్నబండిరేవు గ్రామాల్లో అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం, సరైన సమాచారం అందించడంలో వైఫల్యంపై సంబంధిత ఆర్ఐపై చర్యలకు, ఎంపిడిఒ వివేక్ రామ్‌కు చార్జ్‌మెమో జారీ చేసి 24గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. మల్కానపల్లిలో సుమారు రెండు కిలోమీటర్లు అటవీ ప్రాంతం గుండా నడిచి భూరీ సర్వేను పరిశీలించిన కలెక్టర్, పాత రికార్డులు, మ్యాప్‌లు, క్షేత్రస్థాయి కొలతలను సమన్వయం చేసి భూ రికార్డుల్లో పూర్తి స్పష్టత తీసుకురావాలని సూచించారు. మండలంలోని ఎనిమిది గ్రామాల్లో రీ సర్వే జరుగుతుండగా, ఐదు గ్రామాల సరిహద్దుల నిర్ధారణ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందించాలని, గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల వివరాలను సేకరించాలని సూచించారు. చిన్నబండిరేవులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించి, నా ణ్యతా ప్రమానాలు పాటిస్తూ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. పర్యటనలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృ ణాల్ శ్రేష్ఠ, తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపిడిఒ వివేక్ రా మ్, రెవెన్యూ సర్వే, గృహ నిర్మాణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇబ్బందులకు లేకుండా మిర్చి కొనుగోళ్లు

మార్కెట్ చైర్మన్ బోళ్ల గంగారావు



**ప్రజాపక్షం/వైరా:** వైరా వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి క్రయవిక్రయాలపై మార్కెట్ చైర్మన్ బోళ్ల గంగారావు అధ్యక్షతన సోమవారం ట్రేడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కొనుగోళ్ల ప్రక్రియ, ధరలు, భద్రత, మార్కెట్‌లో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలపై చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మిర్చి కొనుగోళ్లు పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని చైర్మన్ సూచించారు. రైతులకు తగిన గిట్టుబాటు ధర లభించేలా వ్యాపారులు సహకరించాలని, మార్కెట్‌లో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులకు తావు లేకుండాఅధికారులు, వ్యాపారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతులు తమ పంటను మార్కెట్‌కు తీసుకొచ్చిన సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాపా సుధాకర్, డైరెక్టర్లు మోత్కూరు వెంకటేశ్వరరావు, షేక్ మౌలాలి, ఖమ్మం జిల్లా మార్కెటింగ్ అధికారి ఆర్.సంతోష్ కుమార్, మిర్చి ఇన్‌స్పెక్షన్ టీం జె.నరేందర్, వీరాంజనేయులు, సుమన్, పృధ్వీరాజ్, డి.నిర్మల, సెక్రటరీ ఏన్కూరు, ఇంచార్జి సెక్రటరీ వైరా వి.వెంకటేశ్వర్లు కోల్డ్ స్టోరేజ్ యజమానులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకం

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు
భావితరాలకు స్ఫూర్తిదాయకం

ఏరియా జనరల్ మేనేజర్
దుర్గం రామచందర్



**ప్రజాపక్షం/మణుగూరు:** దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకం అని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. భారతదేశ ప్రఖ్యాత ఇంజినీర్, దార్శనికుడు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165వ జయంతిని పురస్కరించుకొని మంగర్గం రామచందర్ హాజరై విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సాంకేతిక ప్రగతిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. దేశంలోని అనేక ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ ప్రాజెక్టుల రూపకల్పన, అభివృద్ధిలో విశ్వేశ్వరయ్య కీలక పాత్ర పోషించారని, ఆయన సాంకేతిక నైపుణ్యం,దూరదృష్టి నేటి ఇంజినీర్లకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన జీవితం, కృషి, వి లువలు నేటి తరానికి, ముఖ్యంగా యువ ఇంజినీర్లకు ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఇంజినీర్స్ డేను కేవలం ఒక వేడుకగా నిర్వహించకుండా, విశ్వేశ్వరయ్య ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని సంస్థ అభివృద్ధికి, సాంకేతిక పురోగతికి, దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒటు జిఎం డి.వెంకట రామారావు, ఎజిఎం (ఐఇడి) రాంబాబు, ఎజిఎం(పర్సనల్) రమేశ్ , డిజిఎం(సివిల్) శివ ప్రసాద్, ఏరియా సర్వే అధికారి దయాకర్, ఏరియా సేఫ్టీ అధికారి జి. నాగేశ్వరరావు, పర్యావరణ అధికారి శ్రీనివాసరావు, క్వాలిటీ విభాగం (హెచ్‌డి) నాగరమేష్, ఏరియా సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, ఎస్ఇ(పర్చేస్) సుదర్శన్ రెడ్డి, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేశ్ , డివైఎస్ఇ(సివిల్) కె. రాజేంద్ర ప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారులు కె. శ్రీనివాస్, వి. రామేశ్వర రావు పాల్గొన్నారు.

## మధిర ప్రాంతీయ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత



**ప్రజాపక్షమ/మధిర:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవల తీరును మెరుగుపరిచేలా దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఇచ్చిన ఆదేశాల మేరకు మధిరలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ముందస్తు సమాచారం లేకుండా ఆమె ఆసుత్రికి రావడంతో సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. తనిఖీల్లో భాగంగా చైర్‌పర్సన్ నేరుగా వివిధ వివిధ వార్డులకు వెళ్లి రోగులను పలకరించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యం, డాక్టర్ల పనితీరు, మందుల పంపిణీ తీరుపై ఆరాతీశారు. రోగులకు అందిస్తున్న భోజన వసతుల నాణ్యతను స్వయంగా పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పిడి యాట్రిక్( చిన్న పిల్లలు) వార్డును సందర్శించి చిన్నారులకు అందుతున్న వైద్యసేవలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అనంతరం ఆసుపత్రి రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను క్షుణ్ణంగా పరిశీలించారు. విధులకు గైర్హాజరైన వారి వివరాలను ఆసుపత్రి సూపరిండెంట్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని అన్నారు. వైద్యులు, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోను సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. విధుల్లో ఎవరి నిర్లక్ష్యాన్ని లేదా అలసత్వాన్ని సహించేది లేదని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శామ్యూల్‌పాల్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిరియాల వెంకటరమణగుప్త, వైస్ చైర్మన్ కోన ధనికుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ రమణనాయక్, నాయకులు సూర్యదేవర కోటేశ్వరరావు, దోర్నాల వెంకట రవి ఉన్నారు.

## అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

### నిందితుడిని అదుపులోకి తీసుకున్న సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు





**ప్రజాపక్షం/సిద్దిపేట:** కుటుంబ కలహాలకు తోడు, భార్య పై అనుమానంతో కట్టుకున్న భర్త హత్య చేసిన సంఘటన సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సిఐ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం కు చెందిన రోజి పర్వీన్ (19) 15 సంవత్సరాల క్రితం బ్రతుకుతెరువు కోసం తన ముగ్గురు అక్కలతో కలిసి సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ కు వచ్చి నివాసం ఉంటున్నారు. కాగా చదువుకునే రోజుల్లో గజ్వేల్ లోని భరత్ నగర్ కు చెందిన మద్దూరి బాల లింగం అలియాస్ రాకేష్ ను ఆమె ప్రేమించగా, 6 నెలల క్రితం అతన్ని ప్రేమ వివాహం చేసుకొని, చిన్నకోడూరు మండల కేంద్రంలోని ఎమ్మార్వో ఆఫీస్ ముందు టీ టైం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. కాగా మద్యానికి బానిస అయిన రాకేష్ ప్రతిరోజు మద్యం తాగి వచ్చి పర్వీన్ ను కొట్టడంతో విసిగిపోయిన ఆమె, 20 రోజుల క్రితం ప్రజ్ఞాపూర్ లోని తన అక్క రౌనక్ పర్వీన్ వద్దకు వెళ్లి అక్కడే ఉంది. వారం రోజుల క్రితం తిరిగి సిద్దిపేటకు వచ్చిన ఆమె ఓ ఉడిపి హోటల్లో పనికి వెళ్తుంది. కాగా ఈనెల 11వ తేదీన సాయంత్రం తన భర్త రాకేష్ ఫోన్ చేసి తనను రమ్మంటున్నాడని, అతడి వద్దకు వెళుతున్నట్టుగా తన అక్క రౌనక్ చెప్పిన ఆమె, 14వ తేదీన సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు అనుమానాస్పద స్థితిలో నాగదేవత ఆలయం సమీపంలో చనిపోయి కనిపించడంతో, ఆమె భర్త రాకేష్ పైనే అనుమానం ఉందని మృతురాలి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా, అతను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని, అతన్ని జ్యూడీషియల్ రిమాండ్ కు పంపినట్లు సీఐ తెలిపారు.

## పీజీ సీటు రాలేదనే మనోవేదనతో డాక్టర్ ఆత్మహత్య



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** పీజీ సీటు రాలేదననే మనో వేదనతో ఎంబిబిఎస్ డాక్టర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లి న్యూ సరస్వతినగర్‌కు చెందిన పసుల గౌతమ్(39) ఎంబిబిఎస్ కోర్సు పూర్తి చేసి గత నాలుగు సంవత్సరాలుగా కాంట్రాక్ట్ బేసిస్‌పై ధర్మారం మండలంలోని నంది మేడారం, చొప్పదండి మండలంలోని కటికనపల్లి గ్రామాల్లోని పిహెచ్‌సిల్లో వైద్యుడిగా విధులు నిర్వహించాడు. సుమారు నెల రోజుల క్రితం తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. గౌతమ్ గతంలో రెండుసార్లు పీజీ ప్రవేశ పరీక్ష రాసినా మెరిట్ మార్కులు రాకపోవడంతో పీజీ సీటు రాలేదు. దీంతో కొంతకాలంగా తీవ్ర మనోవేదనకు గురవుతూ శనివారం రాత్రి గౌతమ్ తన తల్లిదండ్రులు సులోచన, మొగులయ్యలతో మాట్లాడి బాధపడుతూ తన బెడ్‌రూమ్‌లోకి వెళ్లి నింద్రించాడు. తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో తల్లి లేచి చూడగా గౌతమ్ బెడ్‌రూమ్‌లో ఉరి వేసుకొని కనిపించాడు. వెంటనే తల్లిదండ్రులు చుట్టుపక్కల వారిని పిలిచి అతడిని కిందికి దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గౌతమ్ తండ్రి పసుల రాజమొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు గౌతమ్ తండ్రి ఇరిగేషన్ శాఖలో పని చేసి పదవీ విరమణ పొందారు. గౌతమ్ అన్న బ్యాంక్ మేనేజర్‌గా చెల్లెలు జగిత్యాలలో ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తున్నారు.

## కాంగ్రెస్ నాయకుని కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొన్నం



**ప్రజాపక్షం/గన్నేరువరం:** కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి తండ్రి ధర్మారెడ్డి ఇటీవల అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి మంగళవారం పరామర్శించారు. గన్నేరువరం మండలంలోని మాదాపూర్ గ్రామంలోని రవీందర్ రెడ్డి నివాసానికి వెళ్లిన మంత్రి ఆయన తండ్రి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రవీందర్ రెడ్డి కుటుంబానికి తన సానుభూతిని తెలియజేస్తూ పార్టీ పరంగా వ్యక్తిగతంగా ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ సర్పంచ్ మాదరి శ్రీనివాస్, పులి కృష్ణ, చింతల శ్రీధర్ రెడ్డి, ముసుకు ఉపేందర్ రెడ్డి, కటకం తిరుపతి, బుర్ర మల్లేశం గౌడ్, బుర్ర శ్రీకాంత్ గౌడ్, కూన చంద్రశేఖర్, కల్లెం మల్లారెడ్డి, మాతంగి అనిల్, దేశరాజ్ అనిల్, రాపుల్ నవీన్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరీంనగర్ టౌన్ ఏసిపి కార్యాలయం తనిఖీ



**ప్రజాపక్షం/కరీంనగర్:** వార్షిక తనిఖీల్లో భాగంగా కరీంనగర్ టౌన్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) కార్యాలయాన్ని మంగళవారం సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ, రాజన్న జోన్–3 డిఐజీ సన్‌ప్రీత్ సింగ్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తో కలిసి తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న ఉన్నతాధికారులకు పోలీస్ అధికారులు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ తనిఖీల్లో భాగంగా కార్యాలయ పరిధిలోని నేరాల రికార్డులు, పెండింగ్ కేసులు, సిసిటిఎన్ఎస్ నిర్వహణ, శాంతిభద్రతల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. అలాగే రానున్న వినాయక చవితి (గణేష్ చతుర్థి) వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అత్యంత ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ సి.హెచ్. వెంకటస్వామి, టౌన్ ఇన్‌స్పెక్టర్లు రామచందర్ రావు, తిరుమల్, పుల్లయ్యలతో పాటు డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'నేడు' సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

### హాజరుకానున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాదపక్ష/కరీంనగర్:** పాఠశాల విద్యార్థులకు పోషకాహారంతో కూడిన అల్పాహారాన్ని అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, హాజరు, విద్యా సామర్థ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్టనర్ గా చేపట్టి స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్ ను కరీంనగర్ జిల్లాలో విస్తరిస్తోంది. ఇందులో




భాగంగా కరీంనగర్ మార్కెట్ యార్డులోసుమారు రూ.8 కోట్ల వ్యయంతో, రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యంతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను నేడు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. కరీంనగర్‌లోని ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లోని 17 మండలాల పరిధిలో 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన మొత్తం 49,025 మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా అమలు చేయనుంది.

**రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ:** కోడంగల్‌లో పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని సుమారు 17,72,291 మంది విద్యార్థులు, 23,106 ప్రభుత్వ పాఠశాలలు, 31 జిల్లాల్లో 31 కేంద్రీకృత మెగా/కమ్యూనిటీ కిచెన్లు,1,400 పంపిణీ వాహనాలు, సుమారు 5,000 మంది సిబ్బంది ప్రయోజనం పొందేలా ప్రతిపాదిత అమలు నమూనాను రూపొందించారు.



**కరీంనగర్‌లో విద్యార్థులకు అందించే వారపు మెనూ**
విద్యార్థులు సాధారణంగా ఇళ్లలో తినే ఆహార పదార్థాలను ఆధారంగా చేసుకుని మెనూను రూపొందించారు. దీంతో విద్యార్థులు సులభంగా స్వీకరించడంతో పాటు ఆహార వృథాను తగ్గించవచ్చు. సోమవారం ఇడ్లీ – సాంబార్, మంగళవారం పూరీ – ఆలూ కుర్మా,బుధవారం దోశ – చట్నీ,గురువారం ఉప్మా – చట్నీ, శుక్రవారం మిల్లెట్ ఇడ్లీ – సాంబార్,శనివారం బోండా – చట్నీ విద్యార్థులకు రోజు విడిచి రోజు పాలు కూడా అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పోషక సమతుల్యత కోసం ఆహారంలో అవసరమైన పోషకాలను చేర్చడంతో పాటు, విద్యార్థుల వయస్సుకు తగిన మోతాదులో, వారికి సుపరిచితమైన ఆహార పదార్థాలతో మెనూను రూపొందించారు. ఈ మెనూ రూపకల్పనలో ఎన్ఐఎన్ సహకారం తీసుకున్నారు. కరీంనగర్ జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం 49,025 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ అల్పాహారం అందనుంది.

## పేదల పక్షపాతి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం: ఎమ్మెల్యే సంజయ్



**ప్రజాపక్షం/జగిత్యాల:** పేదల పక్షపాతి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల అర్బన్ మండలంతిప్పన్న పెట్ గ్రామానికి చెందిన చింతకుంట రాజా నర్సయ్య ఇటీవల విద్యుత్ షాక్ తో మరణించాడు. మృతుని భార్యకి మంజూరైన విద్యుత్ ప్రమాద చెక్కు 50వేలు, 4లక్షల 50వేల బాండ్ ను,జగిత్యాల పట్టణ బుడిగజంగాల కాలని కి చెందిన సిరిగిరీ ఎల్లవ్వ విద్యుత్ షాక్ తో మరణించగా భర్త వెంకటయ్యకు తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన 50వేలు చెక్కు, 4లక్షల 50వేల బాండ్ ను జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేసారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విమర్శలు చేయడమే కొంత మంది నాయకులు పని కట్టుకుని మాట్లాడుతున్నారని, అభివృద్ధి చూసి మాట్లాడాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో నందయ్య, తదితరులు ఉన్నారు.

## 'ఆల్ఫోర్స్' ఇ–టెక్నోలో ఘనంగా గణనాధునికి పూజలు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** గణనాధుడు అంటే సకల బాధల నుంచి విముక్తి కల్పించేవాడని విఘ్నాలను తొలగించి చక్కని విద్యను అందించేవాడని ఉజ్వల భవిష్యత్‌ను ప్రసాదించే దేవుడని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.వనజా నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో శ్రీ విఘ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రెండో రోజు శ్రీ మహా గణపతికి సుమారు 108 రకాల ప్రసాదాలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా వనజా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం భక్తుల్లో నూతన ఉత్సాహాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం గణనాధుని కార్యక్రమం చేపట్టడం పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. గణనాధునికి ఇష్టమైన ఉండ్రాళ్లు, మోదకాలు, గారెలు, పులిహోర, పెరుగన్నం, సిరా, పొంగలి, పాయసం తదితర ప్రసాదాలను తయారు చేసి పలు పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

### ర్యాకల్ దేవ్‌పల్లి, సుల్తానాబాద్‌లో పాఠశాలలు, 'సర్' ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** ఎలిగేడు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం ఎలిగేడు మండలం ర్యాకల్ దేవ్‌పల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను, సుల్తానాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సుల్తానాబాద్ 5వ వార్డులోని శ్రీ వాణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**యంగ్ ఇండియా పాఠశాల పనులు వేగవంతం చేయాలి :** ర్యాకల్ దేవ్‌పల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు.అదనపు తరగతి గదులను రెండు నెలల్లో పూర్తి చేయాలి. సుల్తానాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు సకాలంలో అందేలా పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు.



**ఎస్ఐఆర్ విచారణను మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలి :** సుల్తానాబాద్ 5వ వార్డులోని శ్రీ వాణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఐఆర్ విచారణను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు సంబంధించిన ఆధార పత్రాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, సమర్పించిన ప్రతి పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఈ పర్యటనలోటీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, తహసీల్దార్ ఉయాకన్న, బషీరోద్దీన్, డిప్యూటీ ఈఈ బాబు రెడ్డి, మారుతి, పాఠశాలప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ నవీకరణ ప్రక్రియ వేగవంతం: కలెక్టర్

### సత్యప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల:** జిల్లాలో ఆధార్ నమోదు, ఆధార్ వివరాల నవీకరణ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరి ఆధార్ వివరాలు సక్రమంగా నమోదు అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆధార్ నమోదు, నవీకరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో 0–5 సంవత్సరాల వయస్సు గల 49,413 మంది , 6–17 సంవత్సరాల వయస్సు గల 2,34,451 మంది ఆధార్ వివరాలను నమోదు చేయడం , అవసరమైన మేరకు నవీకరించడం పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు.వయస్సుల వారీగా ఆధార్ నమోదు, నవీకరణకు సంబంధించిన వివరాలను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ నమోదు కాని వారు, ఆధార్ వివరాలు నవీకరించాల్సిన వారు ఎవరూ మిగలకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని సూచించారు. 0–5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు ఆధార్ నమోదు సమయంలో ఫొటోగ్రాఫ్ మాత్రమే తీసుకుంటారని, బయోమెట్రిక్ వివరాలు నమోదు చేయరని జిల్లా కలెక్టర్ తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో గత ఆరు నెలల్లో జరిగిన ప్రసవాల వివరాలను సేకరించి జన్మించిన ప్రతి శిశువుకు ఆధార్ నమోదు జరిగిందా లేదా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర విద్యా సంస్థల్లో చదువుతున్న ప్రతి చిన్నారి ఆధార్ కార్డు వివరాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల ఆధార్ నమోదు స్థితి, ఆధార్ వివరాల నవీకరణ, ముఖ్యంగా 6 సంవత్సరాలు నిండిన పిల్లల బయోమెట్రిక్ నవీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాసంస్థల్లో పిల్లలకు అనుకూలంగా శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లత,రాజ గౌడ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు మధుసూదన్, దివాకర్ రెడ్డి, నరసింహారావు, తదితరులు ఉన్నారు.

## చేయూత పెన్షన్ దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలి

### నేటి నుంచి ఈనెల 25 వరకు దరఖాస్తుల పరిశీలన
### కలెక్టర్ గరిమా అగర్వాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** చేయూత సామాజిక భద్రత పెన్షన్ పథకం కింద కొత్తగా ధరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా, పారదర్శకంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. చేయూత పెన్షన్లకు సంబంధించి ధరఖాస్తు చేసుకున్న వారి ధరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పకడ్బందీగా చేపట్టడం, తదితర అంశాలపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మంగళవారం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం నుంచి ఈనెల 25 వరకు పెన్షన్ ధరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అర్హత ఉన్న ధరఖాస్తులను స్పష్టంగా గుర్తించడంతోపాటు అనర్హత ఉన్న ధరఖాస్తులకు నిర్దిష్ట కారణాన్ని చేయూత వెరిఫికేషన్ మొబైల్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. వితంతు మహిళల కోసం భర్త మరణ ధృవీకరణ పత్రం, ఒంటరి మహిళలు అయితే గ్రామాల్లో 30 ఏండ్ల వయసు, పట్టణాల్లో అయితే 35 ఏండ్ల వయసు ఉండాలని స్పష్టం చేశారు. వీరికి సంబంధించిన పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు ధృవీకరణ చేయాల్సి ఉంటుందని తెలిపారు. గీత కార్మికులు 50 ఏండ్ల వయసు ఉండాలని ఎక్సైజ్ శాఖ అధికారుల ధృవీకరణ పత్రంతో పాటు గీత కార్మికుల సొసైటీ సభ్యులుగా ఉండాలని స్పష్టం చేశారు. నేత కార్మికులు 50 ఏండ్ల వయసు ఉండాలని, హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ శాఖ గుర్తింపు పత్రం ఉండాలని తెలిపారు. ఫైలేరియా బాధితులు వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ధృవీకరణ పత్రం ఉండాలని, డయాలసిస్ బాధితులు ఆరోగ్య శ్రీ కింద చికిత్స పొందుతున్న వివరాలు ఉండాలని సూచించారు. దివ్యాంగులకు సదరం శిబిరం ద్వారా మంజూరు అయిన 40 శాతం వైకల్య ధృవీకరణ యూడీఐడీ పత్రం, చెవిటి వారికి 51 శాతం వైకల్య ధృవీకరణ యూడిఐడీ పత్రం ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ సూపరిటెండెంట్ హిమశ్రీ, ఏడీ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ సంతోష్, డిఎంహెచ్‌వో ఏంజెలా ఆల్ఫ్రెడ్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గయ్య సేవలు మరువలేనివి: ఎల్లా గౌడ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణిలో కార్మిక వర్గ శ్రేయస్సు కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహానేత అమరజీవి కామ్రేడ్ చందా దుర్గయ్య అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు అన్నారు. మంగళవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన దుర్గయ్య గారి 43వ వర్ధంతి సభలో ముందుగా వారు దుర్గయ్య చిత్రపటానికి వారి కుమారుడు రఘుతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు దుర్గయ్య గారి సేవలను కొనియాడుతూ ప్రసంగించారు. ఏఐటీయూసీ ఆర్జీ1 బ్రాంచి ఉపాధ్యక్షులు బోగ సతీష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్జీ1 బ్రాంచి సహాయ కార్యదర్శి మాదన మహేష్, ఉపాధ్యక్షులు సంకె అశోక్, కోశాధికారి ఎస్. వెంకట్ రెడ్డి, జి.ఎం.కమిటీ సభ్యులు గండి ప్రసాద్, ఎం.ఏ. గౌస్, నాయకులు పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్, దుర్గయ్య భార్య లక్ష్మి , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి నూతన పాలకవర్గం కృషి


### ప్రభుత్వ విప్‌కు కృతజ్ఞతలు తెలిపిన మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్(ఎలిగేడు):** రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గం పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గానికి సూచించారు. ఎలిగేడు మండల నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పొట్యాల రమేష్, వైస్ చైర్మన్ గా కోరుకంటి వెంకటేశ్వరరావు తో పాటు నూతన పాలక మండలి సభ్యులు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావును శివపల్లి గ్రామంలో గల నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తమపై నమ్మకం ఉంచి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా, డైరెక్టర్లుగా బాధ్యతలుఅప్పగించినందు గాను కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు పాలకమండలి సభ్యులు పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయ రమణారావు నూతన చైర్మన్, వైస్ చైర్మన్, పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా మార్కెట్ కమిటీని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. పాలక మండలి సభ్యులు, ఎస్ పరశురాములు, కే.సంపత్ రావు, పి స్వామి, ఏ శ్రీనివాస్, పి మల్లేశం, హే హరీష్, జి మహేందర్, కే రమేష్, పి. మల్లారెడ్డి, ఆంజనేయరావు, రాజేశ్వర్ రెడ్డి, సంతోష్ రావు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## సికింద్లపూర్ ఎల్లమ్మ పోచమ్మ దేవాలయానికి ఆర్థిక సహాయం

### మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట:** చిన్నకోడూరు మండలం సికింద్ల పూర్ గ్రామం లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎల్లమ్మ పోచమ్మ దేవాలయానికి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రామానికి చెందిన గౌడ సంఘం వారు గ్రామం లో ఎల్లమ్మ పోచమ్మ దేవాలయం నిర్మాణం చేస్తున్నాము మీ సహాయం కావాలని ఇటీవల కలసి కోరారు, ఈ సందర్భంగా ఈరోజు సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో గౌడ సంఘం వారిని పిలిచి దేవాలయ నిర్మాణంకు తన వంతు సహాయంగా అందించారు. దేవాలయానికి అవసరం అయిన గ్రానెట్‌ను కుడా అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఎల్లమ్మ పోచమ్మ దేవాలయంకు హరీష్‌రావుగారిని మేము అడగగానే సహాయం చేసినందుకు మా సంఘం ఎప్పుడు రుణపడి ఉంటుందని ఈ సందర్భం గా హరీష్ రావుకి సంఘం తరుపున, గ్రామ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

## దీర్ఘ విరామం తర్వాత వాణిజ్యంపై
# భారత్–చైనా చర్చలు ప్రారంభం



**న్యూఢిల్లీ:** చాలా విరామం తర్వాత వాణిజ్యంపై భారత్–చైనా చర్చలు ప్రారంభించాయి. భారత్ వాణిజ్య లోటు విపరీతంగా పెరగడం ఆందోళనకరంగా మారింది. ఈ చర్చల్లో భారత్ ప్రధానంగా దీనిపైనే దృష్టి సారిస్తుంది. చర్చల ప్రక్రియ కొనసాగుతుందని, తదుపరి కొనసాగింపుగా మరిన్ని చర్చలు జరుగుతాయని, రెండు దేశాలు ఈ రంగంలో ఉన్న సమస్యలను మెల్లిగా అర్థం చేసుకుని పరిష్కరించుకుంటాయని కేంద్ర వాణిజ్యశాఖ కార్యాదర్శి రాజేశ్ అగర్వాల్ మంగళవారం చెప్పారు. రెండు దేశాలమధ్యా వాణిజ్యానికి సంబంధించిన ఆందోళనలను పరిష్కరించుకోవడం, ఇరు దేశాలమధ్యా ఉన్న వాణజ్య అసమతౌల్య సమస్యలు పరిష్కరించుకోవడం, సరఫరా గొలుసు వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దుకోవడం వంటి అనేక విషయాలను వరుస సమావేశాలలో చర్చిస్తారు. బ్రిక్స్ 18వ సదస్సు సందర్భంగా రెండు దేశాల అగ్రనాయకులు మోదీ–జీ జిన్‌పింగ్ సమావేశంలో ఈ చర్చల ప్రారంభం గురించి కూడా ప్రధాన ప్రస్తావన వచ్చింది. దానికి అనుగుణంగా ఈ చర్చలు మొదలయ్యాయి. బీజింగ్ నుండి ఢిల్లీకి, గ్వాంగ్ జౌ నుండి ఢిల్లీకి ప్రత్యక్ష విమాన సర్వీసులు రాకపోకలు చేస్తూ ఉండటంతో రెండు దేశాలమధ్య ఏడాదికాలంగా సంబంధాలు మెరుగుపడ్డాయని, ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయని రాజేశ్ అగర్వాల్ చెప్పారు.

భారతదేశానికి చైనా రెండవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతోంది.ఇరు దేశాలమధ్యా ద్వైపాక్షిక వాణిజ్యం 2025–26 ఆర్థిక సంవత్సరంలో 127.7 బిలియన్ డాలర్లకు చేరింది. అంతకుముందు 2024–25 ఆర్థిక సంవత్సరంలో 118.39 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్య ఒక్క ఏడాదిలోనే 7.9 శాతం పెరిగింది. రెండు దేశాల మంత్రులమధ్య ఈనెల 12వ తేదీన బ్రిక్స్ సదస్సు సందర్భంగా జరిగిన సమావేశానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.రెండు దేశాలూ పరస్పరం వాణిజ్యానికీ,సరఫరా గొలుసు వ్యవస్థలకు సంబంధించిన ప్రశ్నలు లేవదీస్తాయి. వాటిని మెల్లిగా పరిష్కరించుకోవాలి, ఒకరికొకరు సమాధానాలు చెప్పుకోవాలి,అవగాహన పెంచుకోవాలి,బ్రిక్స్ దేశాలమధ్య వాణిజ్య కార్యకలాపాలను ముమ్మరం చేయాలని మొన్న ముగిసన సదస్సులో ప్రధానంగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీనికి అనుగుణంగా ఆసియా అగ్రదేశాలు రెండు ముందడుగు వేయాల్సి ఉంది. గడచిన ఆర్థిక సంవత్సరంలో భారత్ నుండి చైనాకు చేసిన ఎగుమతులు 36.62శాతానికి పెరిగి 19.47 బిలియన్ డాలర్లుగా నమోదుకాగా, ఏడాదిక్రితం ఎగుమతులు 14.25 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అదేసమయంలో దిగుమతులు కూడా చైనా నుండి 16 శాతం పెరిగి 131.62 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. కాగా, రెండు దేశాలమధ్య వాణిజ్య లోటు గడచిన ఆర్థిక సంవత్సరంలో 99.19 బిలియన్లకు విస్తరించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఈ వాణిజ్యలోటు 85 బిలియన్ డాలర్లుగా ఉండేది. ఇది భారతదేశానికి తీవ్ర ఆందోళనకరంగా మారింది.

# లైంగిక వేధింపుల కంటెంట్ ఇస్తాం

## చిన్నరుల లైంగిక వేధింపులపై పూర్తి సమాచారం దర్యాప్తు సంస్థలకు రిపోర్ట్ చేసేందుకు ‘మెటా’ఒకే

**న్యూఢిల్లీ :** ఆన్‌లైన్‌లో బాలల లైంగిక వేధింపుల మెటీరియల్, ఇతర హానికరమైన కంటెంట్‌పై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను పటిష్టమైన భద్రతా చర్యలు, అధిక జవాబుదారీతనం కోసం ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్న కారణంగా, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ యజమాని ‘మెటా’ బాలల భద్రతకు సంబంధించిన విషయాలను నేరుగా ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ (I 4C) నిర్వహించే సైబర్ క్రైమ్ పోర్టల్‌కు నివేదించడానికి అంగీకరించింది. ప్లాట్‌ఫారమ్‌లపై పిల్లలను రక్షించడం కంపెనీకి ప్రాధాన్యత అని ‘మెటా’ ప్రతినిధి తెలిపారు.ఈ నేరాలను పాల్పడిన వారిని బాధ్యులను చేసేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి మేం కట్టుబడి ఉన్నాం’ అని ఆయన అన్నారు.‘ఈ హానిని ఎదుర్కోవడానికి, మా ప్రయత్నాలను సమష్టిగా బలోపేతం చేసేందుకు, ‘మెటా’ ఇకపై పిల్లల భద్రతా విషయాలను నేరుగా I 4C నిర్వహించే సైబర్ క్రైమ్ పోర్టల్‌కు నివేదిస్తుంది’అని అధికార ప్రతినిధి తెలిపారు.అమెరికాలో ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉన్న ‘మెటా’, భారతీయ చట్ట అమలు సంస్థలకు నేరుగా సమాచారం అందించే వ్యవస్థను ఏర్పాటు చేయడానికి కట్టుబడిన మొట్టమొదటి ప్రధాన టెక్ మధ్యవర్తి సంస్థ. ఇప్పటివరకు, ‘మెటా’ పిల్లల భద్రతకు సంబంధించిన కేసులను అమెరికాలోని ‘నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయ్‌టెడ్ చిల్డ్రన్ ’కు నివేదిస్తూ వచ్చింది. మంగళవారం పిల్లల భద్రతకు సంబంధించిన విషయాలను సంబంధిత చట్ట అమలు సంస్థలకు వినేదించడానికి ‘మెటా’ అంగీకరించిందని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. భారతదేశంలో పనిచేస్తున్న ఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌కైనా పిల్లల ఆన్‌లైన భద్రత ఒక ‘ప్రాథమిక సూత్రం’ అని, దానిపై ఎట్టిపరిస్థితుల్లోనూ ‘బేరసారాలు’ ఉండవని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఆన్‌లైన్‌లో పిల్లల భద్రతను నిర్ధారించడానికి చురుకైన చర్యలు తీసుకోని ప్లాట్‌ఫారమ్‌లపై ప్రభుత్వమే చర్యలు తీసుకుంటుందని, హానికరమైన కంటెంట్, కార్యకలాపాల నుంచి మైనర్లను రక్షించడానికి ప్లాట్‌ఫారమ్‌ల బాధ్యతపై తన కఠినవైఖరిని నొక్కిచెబుతూ వర్గాలు తెలిపాయి.అటువంటి కంటెంట్‌ను చురుకుగా గుర్తించి, తొలగించేలా చూసేందుకు ప్రభుత్వం ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లతో కూడా సంప్రదింపులు జరుపుతోందని ఆ వర్గాలు జోడించాయి. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం..పిల్లలపై లైంగిక వేధింపులకు




సంబంధించిన కేసులను చట్ట అమలు సంస్థలకు నివేదిస్తామని ‘మెటా’ చేసిన వాగ్దానం ఒక మొదటి అడుగు. పిల్లలకు ప్లాట్‌ఫారమ్‌లను మరింత సురక్షితంగా మార్చడంతో పాటు, ఇంకా ఎన్నో చేయాల్సి ఉంది. హానికరమైన కంటెంట్‌ను అరికట్టడానికి ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది.అన్ని ప్లాట్‌ఫారమ్‌లు అటువంటి కంటెంట్‌ను ముందుగానే గుర్తించి, తొలగించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆ వర్గాలు తెలిపాయి. బాలల లైంగిక వేధింపుల మెటీరియల్, డీప్ ఫేక్‌లతో సహా హానికరమైన చట్ట విరుద్ధమైన ఆన్‌లైన్ కంటెంట్‌పై ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై నిఘాను ముమ్మరం చేసింది. ఇటువంటి కంటెంట్‌లను నిర్వహించడంలో ‘మెటా’ వ్యవహరించిన తీరుపై ఆ సంస్థకు నోటీసులు జారీచేయడంతో పాటు, ఇటీవల ఆ కంపెనీ గ్లోబల్ ఎగ్జిక్యూటివ్‌లను భారతదేశానికి పిలిపించింది.హానికరమైన కంటెంట్‌ను వేగంగా తొలగించాలని, పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, జవాబుదారీతనం పెంచాలని ప్లాట్‌ఫారమ్‌లపై కేంద్రం ఒత్తిడి తెచ్చింది. భారత చట్టాలను పాటించడంలో విఫలమైతే సహించబోమని హెచ్చరించింది.జులైలో, ఇన్‌స్టాగ్రామ్‌ల చెల్లింపుల ప్రకటనలో బాలల లైంగిక దోపిడీ, దుర్వినియోగ సామగ్రి (సిఎస్ఇఎఎం) సంబంధించి ప్రభుత్వం ‘మెటా’కు నోటీసు జారీ చేసింది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఇఐటివై), సిఎస్ఇఎఎంను ప్రోత్సహించే, దాని ప్రాప్యతను సులభతరం చేసే అన్ని ప్రకటనలు, కంటెంట్‌ను నిలిపివేయాలని ఇన్‌స్టాగ్రామ్‌ను ఆదేశించి, వివరణాత్మక వివరణ కోరింది. దీనితర్వాత , మెటా ఉన్నతాధికారులతో ప్రభుత్వం పలు దఫాలుగా చర్చలు జరిపింది. ఈ చర్చల్లో ఐటి మంత్రిత్వ శాఖ అటువంటి కంటెంట్ ఉల్లంఘన కిందకు వస్తుందని, దానికి సేఫ్ హార్బర్ రక్షణ వర్తించదని స్పష్టం చేసింది.

## గర్భాన్ని కొనసాగించాలని అత్యాచార
# బాధితురాలిని బలవంతం చేయొద్దు

**న్యూఢిల్లీ :** అత్యాచార బాధితురాలు గర్భం దాల్చడంపై ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రేప్ కారణంగా గర్భం దాల్చిన బాధితురాలిని ఆ గర్భాన్ని కొనసాగించమని బలవంతం చేయడమనేది ఆమె గౌరవంగా జీవించే హక్కును తీవ్రంగా దెబ్బతీయడమే అవుతుందని అభిప్రాయపడింది. బాధితురాలి ఇష్టానికి వ్యతిరేకంగా మాతృత్వ బాధ్యతను ఆమెపై మోపడం సరికాదని పేర్కొంది. 30 వారాలు దాటిన తన గర్భాన్ని తొలగించుకోవడానికి అనుమతి కోరుతూ 15 ఏళ్ల అత్యాచార బాధితురాలి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధితురాలు తన గర్భాన్ని తొలగించుకునేందుకు అనుమతిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. ‘ఇదొక దురదృష్టకరమైన, బాధాకరమైన కేసు. బాధితురాలి గర్భం దాల్చిన కాలం చట్టపరమైన పరిమితిని దాటిందన్న వాస్తవాన్ని మాత్రమే విడిగా చూడలేం. అత్యాచారం కారణంగా గర్భం దాల్చిన బాధితురాలిని ఆ గర్భాన్ని కొనసాగించమని బలవంతం చేయడం, ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా మాతృత్వ బాధ్యతను మోపడమనేది గౌరవంగా జీవించే ఆమె హక్కుకు తీవ్రమైన భంగం కలిగించడమే అవుతుంది. ఒక మహిళకు తన శరీరంపై ఉన్న హక్కుల్లో తాను తల్లి కావాలనుకుంటుందా? లేదా? అని నిర్ణయించుకునే హక్కు కూడా తప్పనిసరిగా ఉంటుంది. అత్యాచారం కారణంగా గర్భం దాల్చిన బాధితురాలిని ప్రసవించమని బలవంతం చేయడం ఆమెను మరింత దీర్ఘకాలిక శారీరక, మానసిక క్షోభకు గురిచేయవచ్చు’ అని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. గర్భం దాల్చి ఎక్కువ వారాలు అయ్యిందనే ఒకే ఒక్క కారణంతో మైనర్ బాలికకు తన శారీరక స్వేచ్ఛ, గౌరవం, పునరుత్పత్తికి సంబంధించిన ఎంపిక హక్కులను నిరాకరించలేమని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. అదే సమయంలో ఏ వైద్య ప్రక్రియ అయినా తప్పనిసరిగా అత్యాచార బాధితురాలి శారీరక దృఢత్వం, వైద్యపరమైన సాధ్యత అంచనాకు, అవసరమైన అన్ని రక్షణ చర్యలకు లోబడి ఉండాలని అభిప్రాయపడింది. అత్యాచారం వల్ల గర్భం దాల్చిన ఇటువంటి కేసులు బాధితులకు తీరని వేదనను మిగులుస్తాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. పిటిషనర్ కేవలం 15 ఏళ్ల బాలిక అని, ఆమె ఇప్పటికే ఘోరమైన లైంగిక దాడికి గురై తీవ్ర మానసిక వేదనను అనుభవించిందని నొక్కి చెప్పింది. అంతేకాకుండా బాధితురాలు తన తల్లిదండ్రులిద్దరినీ కోల్పోవడం వల్ల మరింత దుర్భర స్థితిలో ఉందని చెప్పింది.

**బాధితురాలి మానసిన వేదనను**
**ఓ ఉత్తర్వు తొలగించలేదు**

‘రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద విచారణ జరిపేటప్పుడు న్యాయస్థానం ఎంటిసి చట్టం కింద ఉన్న శాసనపరమైన నిబంధనలను పరిగణనలోకి తీసుకుంటూనే, మైనర్ గర్భవతి ప్రయోజనాలకు, సంక్షేమానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. తల్లిదండ్రుల సంరక్షణలో క్షేమంగా, గౌరవంగా పెరగాల్సిన వయసులో బాధితురాలు ఎవరూ ఎదుర్కోకూడని పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. చట్టం పరిష్కారాలు, విధానాలను అందించవచ్చు. కానీ ఆ బాలిక అనుభవించిన మానసిక వేదనను ఏ కోర్టు ఉత్తర్వు కూడా తొలగించలేదు. అయితే అత్యంత దుర్భరమైన ఈ సమయంలో బాధితురాలికి సంరక్షణ, గౌరవం, చట్టపరమైన రక్షణ లభించేలా చూడటం మాత్రం కోర్టు చేయగల పని‘ అని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. మరోవైపు, 30 వారాలు దాటిన తన గర్భాన్ని తొలగించుకోవడానికి 15 ఏళ్ల అత్యాచార బాధితురాలు చేసిన విజ్ఞప్తిని ఢిల్లీ హైకోర్టు అంగీకరించింది. బాధితురాలి గర్భస్రావ ప్రక్రియను వీలైనంత త్వరగా చేపట్టేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, ఆ ప్రక్రియకు సంబంధించిన రికార్డును నిర్వహించాలని లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజ్, ఎస్‌కె ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌ను కోర్టు ఆదేశించింది. అత్యాచారానికి సంబంధించి నమోదైన ఈ క్రిమినల్ కేసులో డిఎన్‌ఎ గుర్తింపు, ఇతర అవసరాల కోసం కణజాలం లేదా పిండ పదార్థాన్ని భద్రపరచాలని వైద్యులకు సూచించింది. బాధితురాలి గర్భస్రావ ప్రక్రియ, మందులు, పరీక్షలు, ఆసుపత్రి ఖర్చులు, ఆహారం, ఇతర అనుబంధ వైద్య అవసరాలు సహా అన్ని ఖర్చులను ప్రభుత్వమే భరించాలని ఆదేశించింది.

అది ఆమె గౌరవించే హక్కును
దెబ్బతీయడమే
ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

# లేడీ బైకర్‌ను ఢీకొన్న కేసులో నిందితుడు అరెస్టు

**న్యూఢిల్లీ :** గురుగ్రామ్‌లో బైక్‌పై వెళ్తున్న ఓ మహిళ రైడర్‌ను.. కారుతో ఓ వ్యక్తి ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఆ కేసులో నిందితుడు, కారు డ్రైవర్ కళ్యాణ్ బైన్స్వాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని దౌసాలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. సిసిటివి దృశ్యాల ఆధారంగా గురుగ్రామ్ పోలీసులు ఈ కేసులో చర్యలు తీసుకున్నారు. నిందిత డ్రైవర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. గురుగ్రామ్‌లో ఆదివారం గోల్ఫ్ కోర్సు రోడ్డులో ఓ తెలుపు రంగు సెడాన్ కారు .. బైక్ నడుపుతున్న రైడర్ సియాను ఢీకొట్టింది. కారు ఢీకొన్న తర్వాత ఆ లేడీ బైకర్ కింద పడిపోయింది. ఏప్రిల్లా ఆర్‌ఎస్ 457 స్పోర్ట్స్ బైక్‌లో వెళ్తున్న సియాను కారు డ్రైవర్ కళ్యాణ్ వెంబడించి మరీ ఢీకొట్టాడు. కారు, బైక్ ఢీకొన్న సిసిటివి దృశ్యాలు వైరల్ అయ్యాయి. రాజ్‌ఘర్‌లో నిందిత కారు డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు గురుగ్రామ్ సిపి సిబాశ్ కబిరాజ్ తెలిపారు. బిఎన్‌ఎస్ సెక్షన్ 109 కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. గోల్ఫ్ కోర్సు రోడ్డుపై మహిళా బైకర్‌ను కారు ఢీకొట్టిన ఘటనను సుమోటోగా స్వీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. సెక్టార్56 పోలీసు స్టేషన్‌లో కేసు రిజిస్టర్ చేశారు. లోతైన దర్యాప్తు, సిసిటివి ఫుటేజీ విశ్లేషణ తర్వాత హత్యాయత్నం కేసు బుక్ చేసినట్లు పోలీసులు చెప్పారు. దక్షిణ ఢిల్లీలోని కాల్‌కాజీలో ఉన్న బాధితురాలి ఇంటిని పోలీసు అధికారి మనోజ్ కుమార్ విజిట్ చేశారు. లేడీ బైకర్‌ను ఢీకొట్టిన ఘటనకు చెందిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమయంలో.. సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ పసికట్టినట్లు అధికారి చెప్పారు. కారులో ఉన్న వ్యక్తి తనను వెంబడించాడని, చేతులతో బెదిరింపు సంకేతాలు చేశాడని, పారిపోవడానికి ముందు కారుతో టూవీలర్‌ను ఢీకొట్టినట్లు బాధితురాలు సియా తెలిపింది.

## సహాయక, రక్షణ చర్యలను
# అత్యంత వేగంగా చేపట్టండి

### బిహార్ ప్రభుత్వానికి రాహుల్‌గాంధీ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** బిహార్‌లో భారీ వరదలు సంభవించిన నేపథ్యంలో సహాయక, రక్షణ చర్యలను అత్యంత వేగంగా చేపట్టాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మంగళవారం ప్రభుత్వం, యంత్రాంగాన్ని కోరారు. అలాగే బాధితులకు వీలైనంత త్వరగా అత్యవసర సహాయం అందేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకు వచ్చి బాధితులకు సాధ్యమైనంత సహాయం అందించాలని కూడా పిలుపునిచ్చారు. బిహార్‌లో సంభవించిన భారీ వరదల వల్ల ప్రాణనష్టం జరగడం అత్యంత బాధాకరమని, ఈ విపత్తులో తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. ఈ విషాదం బారిన పడిన వారందరికీ సంఘీభావం వ్యక్తం చేస్తున్నట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు.

గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇప్పటికే ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్న నదుల నీటిమట్టం మరింత పెరగడంతో, బిహార్‌లోని 15 జిల్లాల్లో దాదాపు 50 లక్షల మంది ప్రజలు వరదల బారిన పడ్డారని అధికారులు సోమవారం తెలిపారు. సెప్టెంబర్ నెలలో ఇప్పటివరకు రాష్ట్రంలో 112.7 మి.మీ వర్షపాతం నమోదైందని, ఇది సాధారణం కంటే సుమారు ఆరు శాతం ఎక్కువ అని స్థానిక వాతావరణ శాఖ కార్యాలయం పేర్కొంది. నేపాల్ నుండి బిహార్‌లోకి ప్రవహించే నదుల పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలు, భారీ వర్షపాతం కారణంగా అనేక నదులు, వాగులు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయని ఒక అధికారి తెలిపారు. విపత్తు నిర్వహణ శాఖ ప్రకారం, 15 జిల్లాల్లో 49.67 లక్షల మంది ప్రజలు వరదల వల్ల ప్రభావితమయ్యారు. వరద ప్రభావిత జిల్లాల్లో పాట్నా, భోజ్‌పూర్, సరన్, వైశాలి, భాగల్‌పూర్, బేగుసరాయ్, బక్సర్, సమస్తిపూర్, ముంగేర్, కతిహార్, లఖీసరాయ్, ఖగారియా, పూర్నియా, మాధేపురా. అరారియా ఉన్నాయి.

## 2047 దార్శనికతకు...
# రక్షణ రంగమే ‘మూలస్తంభం’


### కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆశాభావం

**న్యూఢిల్లీ :** భవిష్యత్తు యుద్ధాలలో సాంకేతిక ఆధిక్యతే వ్యూహాత్మక ప్రయోజనాన్ని నిర్ణయిస్తుందని, ‘ఈనాటి మన ఊహలే , రేపటి సైనిక సామర్థ్యాలుగా మారతాయి’ అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం అన్నారు. ఇక్కడ డిఆర్‌డిఓ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, 2047 నాటికి ‘వికసిత్ భారత్’ దార్శనికత కేవలం ఆర్థికంగా బలమైన భారతదేశాన్ని నిర్మించడం మాత్రమే కాదని, సాంకేతికంగా స్వయం సమృది, సామిజిక సమ్మిళితం, పర్యావరణ సుస్థిరం, వ్యూహాత్మకంగా సురక్షితమైన భారతదేశాన్ని నిర్మించడమేనని ఆయన అన్నారు. ఈ దార్శనికతకు రక్షణ రంగమే ‘మూలస్తంభం’ అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ‘2047 సంవత్సరం నాటికి కీలక సాంకేతికతలలో మనం స్వావలంభన సాధించాలి. స్వదేశీ పరిజ్ఞానాన్ని గణనీయంగా పెంచుకోవాలి. రక్షణ రంగ ఎగుమతులలో అనేక రెట్లు వృద్ధిని సాధించాలి. అలాగే ప్రపంచ సరఫరా గొలుసులో భారతదేశానికి సంబంధించి బలమైన ఉనికిని నిర్ధారించుకోవాలి’ అని ఆయన చెప్పారు. సహకారం లేకుండా ఇవన్నీ సాధించలేమని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ రంగంలోని భాగస్వాములందరి మధ్య మరింత భాగస్వామ్యం ఉండాలని రక్షణమంత్రి ఆకాంక్షించారు. డిఆర్‌డిఓ పరిశ్రమల సమన్వయ సమావేశం—‘విమర్శ 2026’ ఇక్కడ డిఆర్‌డిఓ భవన్‌లో నిర్వహించబడింది. డిఆర్‌డిఓ, పరిశ్రమల మధ్య భాగస్వామ్యం కేవలం ఉత్పత్తికే పరిమితం కాకుండా పరిశోధన, అభివృద్ధి పరీక్షలు, ధృవీకరణ, మొత్తం తయారీ విలువ గొలుసు వరకూ విస్తరించాలని సింగ్ అన్నారు. పెద్ద పరిశ్రమలతో పాటు ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లను కూడా విలువ గొలుసులో అంతర్భాగం చేయాలని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ముఖ్యంగా కృత్రిమ మేథ, డ్రోన్‌లు కీలక పాత్ర పోషిస్తాయని, సాంకేతిక ఆవిష్కరణలను వేగవంతం చేయాలని ఈ రంగాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. ‘ఈ రోజుల్లో 80వ దశకానికి సంబంధించినదిగా కనిపించే చిత్రాన్ని రూపొందించడానికి కృత్రిమ మేథ (ఎఇ)ని ఎలా ఉపయోగించవచ్చో మనం చూస్తున్నాం. 40–50 ఏళ్ల తర్వాత భవిష్యత్తులో ఎలా ఉంటుందో ఒక చిత్రాన్ని ప్రదర్శించగలిగినప్పుడు అది నిజమైన ఆనందం’ అని సింగ్ చెప్పారు.

# దొడ్డిదారిన యుసిసి అమలు చేయొద్దు

- బిల్లు ఆమోదానికి సంఖ్యాబలం ఉంటే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి
- కేవలం కొన్ని రాష్ట్రాల ద్వారా అమలుకు యత్నించొద్దు
- జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్ :** యూనిఫాం సివిల్ కోడ్ (యుసిసి) బిల్లును ఆమోదించడానికి అవసరమైన సంఖ్యాబలం ఉంటే బిజెపి దానిని పార్లమెంటులో ప్రవేశపెట్టాలని, కేవలం కొన్ని రాష్ట్రాల ద్వారా అమలు చేయడానికి ప్రయత్నించకూడదని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. మీ దగ్గర సంఖ్యాబలం ఉంటే, దానిని పార్లమెంటుకు తీసుకురండి. వివిధ రాష్ట్రాల ద్వారా ఎందుకు చేస్తున్నారు అని ప్రశ్నించారు. పైగా, వారి సొంత కూటమి (ఎన్‌డిఎ)లో కూడా దీనిపై అందరికీ ఏకాభిప్రాయం లేదన్నారు. బిహార్‌ల జనతాదళ్ (యునైటెడ్) దీనిని వ్యతిరేకిస్తూ, రాష్ట్రంలో అమల చేసేందుకు అనుమతించబోమని స్పష్టం చేసినట్లు వార్తలొస్తున్నాయన్నారు. దొడ్డిదారిన యుసిసిని తీసుకురావద్దని బిజెపిపై అబ్దుల్లా మండిపడ్డారు. సొంత మిత్రపక్షాలే దీనికి అనుకూలంగా లేనప్పుడు, పార్లమెంటులో దీనిని ఆమోదింపజేయగలరని తాను అనుకోనని, బహుశా అందుకే వారు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారేమో అని అబ్దుల్లా పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ బిజెపి అధికారంలో లేదు కాబట్టి, కేవలం బిజెపి పాలిత రాష్ట్రాల్లో మాత్రమే యుసిసిని అమలు చేస్తే అది సార్వత్రికం కాదని అబ్దుల్లా అన్నారు. ‘దేశమంతా బిజెపి పాలిత ప్రాంతం కాదు. ఆ పార్టీ అధికారంలో లేని అనేక రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. కాబట్టి, కేవలం బిజెపి రాష్ట్రాల్లోనే దీనిని అమలు చేస్తే, అది సార్వత్రిక చట్టం అనిపించుకోదు. ఇలాంటి స్వభావం కలిగిన అంశాలపై నిర్ణయం వ్యక్తిగత రాష్ట్రాలు తీసుకోకూడదు; దేశం మొత్తం కలిసి నిర్ణయం తీసుకోవాలి. దేశానికి ప్రాతినిధ్యం వహించే వేదిక రాష్ట్రాలు కాదు, పార్లమెంటు’ అని ఆయన అన్నారు. తాము గొప్పగా ప్రచారం చేసుకున్న కొన్ని కీలక చట్టాలను బిజెపి పార్లమెంటులో ప్రవేశపెట్టలేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.



‘ఇప్పటివరకు వారు మాట్లాడిన చట్టాలు ‘ఒకే దేశం, ఒకే ఎన్నిక’ కావచ్చు లేదా రిజర్వేషన్ల అంశం కావచ్చు, వాటిని వారు పార్లమెంటుకు తీసుకురాలేదు. ఇప్పుడు దీని విషయంలో కూడా, రాష్ట్రాల ద్వారా తీసుకురావాలని మాట్లాడుతున్నారు’ అని ఆయన అన్నారు. వాస్తవాధీన రేఖ (ఎల్ఎసి) వెంబడి ఉద్రిక్తతల తగ్గింపు చర్యలపై స్పందిస్తూ, అది స్వాగతించదగిన పరిణామమని అబ్దుల్లా అన్నారు. ‘నియంత్రణ రేఖ (ఎల్ఓసి) లేదా వాస్తవాధీన రేఖ (ఎల్ఎసి) వద్ద ఉద్రిక్తతలను తగ్గించే ఏ చర్య అయినా మంచిదే. ముఖ్యంగా ఆ ప్రాంతాలకు దగ్గరగా నివసించే ప్రజలకు ఇది ఎంతో మేలు చేస్తుంది; ఎల్ఓసి లేదా ఎల్ఎసి సమీపంలో నివసించడం ఎంత కష్టమో మనకు తెలుసు. అదేవిధంగా, కాలక్రమేణా నియంత్రణ రేఖ వెంబడి కూడా పరిస్థితులు మెరుగుపడతాయని మేము ఆశిస్తున్నాము’ అని ఆయన అన్నారు. భారత విదేశాంగ విధానాన్ని చైనా ప్రశంసించడంపై అబ్దుల్లా స్పందిస్తూ, న్యూఢిల్లీ విదేశాంగ విధానం ఎప్పుడూ స్వతంత్రంగానే ఉందని, ఇతర దేశాల ఆమోదం లేదా ధృవీకరణ కోరాల్సిన అవసరం లేదని అన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిని బ్రిక్స్ సదస్సు ఖండించడం భారత విదేశాంగ విధానం సాధించిన విజయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆ సమావేశ గదిలో పాకిస్థాన్ మిత్రదేశాలు ఎన్ని ఉన్నాయో ఒకసారి గమనించండని, పహల్గామ్ పేరును ప్రస్తావించడం కూడా మన విదేశాంగ విధానం సాధించిన విజయమే అని ఆయన అన్నారు.

# చెత్త విక్రయం ద్వారా రూ. 5 వేల కోట్లు ఆదాయం

**న్యూఢిల్లీ :** ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా, గత ఐదేళ్లలో పనికి రాని సామాగ్రి (స్క్రాప్) విక్రయం ద్వారా రూ. 5,100 కోట్లకు పైగా ఆదాయం సమకూరిందని కేంద్రం మంగళవారం తెలిపింది. ఈ కార్యక్రమాలు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ‘స్వచ్ఛత’ను ఒక విధానంగా లేదా అలవాటుగా మార్చడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి. సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, 2021 నుండి జరిగిన ఐదు వార్షిక కార్యక్రమాలు, నెలవారీ సచివాలయ సంస్కరణల పర్యవేక్షణ (జులై 2026 వరకు) ద్వారా 24.20 లక్షలకు పైగా ప్రదేశాలను పరిశీలించారు, 180.48 లక్షలకు పైగా ఫైళ్లను తొలగించడం లేదా మూసివేయడం జరిగింది, అలాగే స్క్రాప్ విక్రయం ద్వారా రూ. 5,102.91 కోట్ల ఆదాయం సమకూరింది. కేవలం ‘క్యాంపెయిన్ 5’లోనే 11.6 లక్షల ప్రదేశాలను పరిశీలించడం, 29.52 లక్షల ఫైళ్లను తొలగించడం, 233.75 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని ఖాళీ చేయడం, స్క్రాప్ విక్రయం ద్వారా సుమారు రూ. 833.92 కోట్లు ఆర్జించడం జరిగిందని ఆ ప్రకటన పేర్కొంది. అక్టోబర్ 2 నుండి అక్టోబర్ 31 వరకు జరగనున్న ‘క్యాంపెయిన్ 6’ పురోగతిని పర్యవేక్షించడానికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం ఒక ఆన్‌లైన్ పోర్టల్‌ను పారంభించనున్నారు. దీనికి ముందు సెప్టెంబర్ 16 నుండి సెప్టెంబర్ 30 వరకు సన్నాహక దశ ఉంటుంది. ఈ సన్నాహక దశలో, వివిధ మంత్రిత్వ శాఖలు మరియు విభాగాలు ఎంపిక చేసిన విభాగాలలో పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించడం, క్షేత్రస్థాయి సిబ్బందిని సమీకరించడం, కార్యక్రమ ప్రదేశాలను ఖరారు చేయడం, రికార్డులను సమీక్షించడం, అలాగే స్థల నిర్వహణ ప్రణాళిక, గుర్తించిన స్క్రాప్ తొలగింపు వంటి చర్యలను చేపడతాయి. డిసెంబర్ 19 నుండి డిసెంబర్ 25 వరకు జరిగే ‘సుపరిపాలన వారోత్సవాల’ సందర్భంగా ఉత్తమ విధానాలను ప్రదర్శిస్తారు. బుధవారం నాటి కార్యక్రమంలో, కేంద్రంలోని మొత్తం 84 మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన ‘క్యాంపెయిన్ 6’ నోడల్ అధికారులు, ప్రజా ఫిర్యాదుల నోడల్ అధికారులు, అప్పీలేట్ అధికారుల సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డిఎఆర్‌పిజి), తపాలా, బొగ్గు, గనులు, పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగాల కార్యదర్శులు ప్రసంగిస్తారని ఆ ప్రకటన తెలిపింది. ‘స్వచ్ఛత’ను సంస్థాగతం చేయడానికి, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్‌ను తగ్గించడానికి ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రత్యేక ప్రచారాలను సమన్వయం చేయడానికి, నడిపించడానికి డిఎఆర్‌పిజి నోడల్ విభాగంగా పనిచేస్తుంది.

# ధరాపురం నుంచి లక్ష్మణన్
# మదురాంతకం నుంచి పి. సుగంధి

- తమిళనాడు ‘ఉప’ ఎన్నికల్లో అభ్యర్థులను ప్రకటించిన వామపక్షాలు
- ‘పంచముఖ పోటీ’ తో రసవత్తరం

**చెన్నై :** తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీ ఉప ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఆ రాష్ట్రంలో, అక్టోబరు 6న అసెంబ్లీ ఉప ఎన్నికలు జరగబోతున్నాయి. మంగళవారం మదురాంతకం, ధరాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు వామపక్షాలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో అక్టోబరు 6న జరుగనున్న శాసనసభ ఉప ఎన్నికల్లో పంచముఖ పోటీ నెలకొననుంది. వామపక్షాలైన సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీల నిర్ణయం ఉప ఎన్నికల పోరాటాన్ని అత్యంత ఉత్కంఠభరితమైన, ఆసక్తికరంగా గమనించే పోటీగా మార్చేసింది. ఈ పార్టీలు బయటి నుంచి మద్దతు ఇస్తున్న తమ ఒకప్పటి మిత్రపక్షమైన ద్రవిడ మున్నేట్ర కజగం(డిఎంకె), అధికార తమిళగ వెట్రి కజగం (టివికె)తో ఈ పార్టీలు తలపడనున్నాయి. ఆసక్తికరంగా, మే నెలలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది రోజులకే ఏఐడిఎంకె నుంచి ఫిరాయించి టివికెలో చేరిన మాజీ ఎమ్మెల్యే మరకతం కుమారవేల్, పి.సత్యభామల పేర్లను ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం ప్రకటించింది. ఎస్‌సిలకు రిజర్వ్ చేయబడిన రెండు నియోజకవర్గాలలో తమ బలాన్ని పరీక్షించుకోవడానికి టివికె, డిఎంకె, ఏఐడిఎంకెలకు వ్యతిరేకంగా సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలు తమ కూటమి నుంచి విడిపోయి, స్వతంత్రంగా పోటీచేయడం, బ్యాలెట్ కోసం జరిగే పోరాటాన్ని మరింత ఆసక్తికరంగా మారుస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.సాంప్రదాయ ఎన్నికల కూటముల నుంచి విడిపోయి, స్వతంత్ర వామపక్ష కూటమిగా పోటీ చేస్తామని సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలు ప్రకటించాయి. రెండు సీట్లలో వామపక్ష పార్టీలు చెరొక స్థానం నుంచి తమ పార్టీ అభ్యర్థులను ఉప ఎన్నికల బరిలోకి దించుతున్నాయి. ధరాపురం (ఎస్‌సి) అసెంబ్లీ నియోజకవర్గానికి అభ్యర్థిగా సిపిఐ తన అభ్యర్థిగా లక్ష్మణన్‌ను నామినేట్ చేయగా, మదురాంతకం (ఎస్‌సి) స్థానం నుంచి సిపిఐ(ఎం) తన అభ్యర్థిని పి.సుగంధి పేరును ప్రకటించింది. మదురాంతకంలో నటుడు–రాజకీయవేత్త సీమాన్ యొక్క నామ్ తమిళర్ కచ్చి (ఎన్‌టికె) అభ్యర్థులు కె.జానకి రామన్ (మదురాంతకం), ఎం.కార్తీకను ధరాపురం నుంచి బరిలోకి దించడంతో ఉప ఎన్నికల పోటీ ఐదుగురు అభ్యర్థుల మధ్య పంచముఖ పోటీగా మారనుంది. తమ ఎన్నికల బలాన్ని ప్రదర్శించుకోవాలనే ఆకాంక్ష నుంచే ఈ ఉప ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీచేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు వామ పక్ష నాయకులు తెలిపారు.

SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS24 2368 | Mohammad Rehana | JOHN DEERE 5310 HARVESTER | 2016 |
| 2 | TS36G 0823 | Raju Satla | JOHN DEERE 5310 HARVESTER | 2020 |
| 3 | TG24A 6727 | Yadamma Reddaboina | EICHER 551 PRIMA G3 | 2025 |
| 4 | TS23F 6985 | Ganesh Kumar Rasamatla | JOHN DEERE W70 COMBINE HARVESTER | 2021 |
| 5 | TS19T 3598 | Srinu Alluri | SONALIKA DI 47 RX | 2018 |
| 6 | TS24T 2282 | Lunavath Padma | SWARAJ 843 XM | 2017 |
| 7 | TG24B 4566 | Raju Kumar Bhukya | SONALIKA DI 35 | 2025 |
| 8 | TS03UB 0208 | Praveen Vajja | TATA ACE MEGA | 2015 |
| 9 | TS21T 0125 | Ande Nagaraju | TATA ZEST DIESEL - P | 2016 |

AUCTION DATE : 19-09-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No:4-61/A/1, 1st floor, Above More Super Market, Beside Jayalaxmi Center Narsampet 506132 Cell : 9000230006 & 9652764787

# ఎఐ భద్రతపై భయాలన్నీ బూటకం

- రాడికల్ లెఫ్ట్ దుష్ప్రచారంగా కొట్టిపారేసిన ట్రంప్
- చైనా ముందజతో అమెరికాలో భయాలు:నిపుణులు

**వాషింగ్టన్:**ఎ.ఐ భద్రతపై ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్న భయాలన్నీ 'వట్టి బూటకం''అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొట్టిపారేశారు. ఒక తెలివైన అధ్యక్షుడే ఎఐకి ఒక రక్షణ కవచంగా ఉంటారని తనను తాను ప్రముఖంగా హైలైట్ చేసుకునే ప్రయత్నం చేశారు. ఎఐ విస్తృతిపై పెరుగుతున్న భయాలను ట్రంప్ నవంబరులో అమెరికాలో జరిగే ద్వైవార్షిక ఎన్నికలకు ముడిపెట్టారు.ఈ భయాలన్నీ రాడికల్ లెఫ్ట్ డెమోక్రాట్లు ప్రచారం చేస్తున్నారని ట్రంప్ విరుచుకుపడ్డారు. రాబోయేకాలంలో అమెరికాలో కమ్యూనిస్టులు,రాడికల్ లెఫ్ట్ డెమోక్రాట్ల వల్ల పెద్ద ప్రమాదం ముంచుకువస్తుందని ట్రంప్ ఇటీవలికాలంలో పలుసార్లు వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రతిపక్షంగా ఉన్న డెమొక్రటిక్‌పార్టీలో కమ్యూనిస్టులు ప్రాబల్యస్థానంలో ఉన్నారని ట్రంప్ విమర్శలు చేస్తున్నారు. ఎఐపై వస్తున్న భయాలను 'గ్లోబల్ వార్మింగ్' స్కామ్‌తో ఆయన పోల్చారు. ఈ స్కామ్‌ను డెమొక్రాట్స్‌లో ఉన్న రాడికల్ లెఫ్ట్ విభాగం ప్రచారం చేస్తోందన్నారు.ఎఐ, డేటా సెంటర్లకు వ్యతిరేకంగా ఒక నీచమైన కుట్ర జరుగుతోందని, ఈ విషయంలో చైనా దేశమే చాలా సంతోషంగా ఉందని ఆరోపించారు.ఐతే దీనిపై చైనా నిపుణులు కూడా తీవ్రంగా స్పందించారు. కృత్రిమ మేధ విషయంలో చైనా ముందంజలో ఉండటంతో అమెరికాలో భయాలు పెరిగాయని విమర్శించారు. ''చైనా ఒక పెద్ద పోటీదారుగా మారిందని వారికి(అమెరికాకు) తెలుసు,ఎఐపై నిబంధనలు కఠినతరం చేసినా,అభివృద్ధిని మందగింపజేసినాగానీ చైనా వారిని అధిగమించగలదని వారికి తెలుసుఅందుకే ఆందోళన చెందుతున్నారు'' అని ఫుడాన్ విశ్వవిద్యాలయంలో అమెరికా వ్యవహారాల అధ్యయన ప్రొఫెసర్ జినికి యాంగ్ చైనా అధికార పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.ప్రపంచ ఇంటర్నెట్ వ్యవస్థను కృత్రిమ మేధ తన అధీనంలోకి తెచ్చుకుంటుందని, దీనివల్ల మానవ వాళి సమీప భవిష్యత్తులోనే అంతరించిపోయే ప్రమాదం ఉందని వస్తున్న భయాలపై ట్రంప్ పైవిధంగా స్పందించారు.ఎఐ రోజు రోజుకూ ఖచ్చితంగా బలపడుతోందని, దీనివల్ల మానవాళి అంతంకాకుండా ''ఒక ఎఐ కిల్ స్విచ్'' ఉండాలని, దీనిని తృతీయపక్షం నిర్వహించాలని ఎఐ దిగ్గజం ''ఆంత్రోపిక్స్'' సహవ్యవస్థాపకుడు జాక్ క్లార్క్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.ఎఐ సాఫ్ట్‌వేర్ ప్రమాదకరంగా మారితే అనేక మార్గాలున్నాయని,దీనికి చట్టసభ సభ్యులు పూనుకోవాలన్నారు. ఆ తర్వాత సర్వత్రా అనేక వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ భయాలకు ముగింపుగా ట్రంప్ స్పందించారు.ఈ ఆధునిక సాంకేతికత మానవాళి అంతానికి దారితీస్తుందని ఎఐ సంస్థలలో పనిచేసే పలువురు అధికారులు,ఉద్యోగులు,పరిశోధకులు హెచ్చరికలు చేసిన తర్వాత జాక్ కిర్క్ ఎఐను అంతం చేసేందుకు ''ఒక కిల్ స్విచ్'' ఉండాలని ప్రతిపాదించారు. రాబోయేకాలమంతా ఎఐదే కావడంతో, ఇటీవలికాలంలో ఉద్యోగుల లే ఆఫ్‌లు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఎఐ సంస్థల వేగంలో మందగమనం రాబోయేకాలంలో ఉంటుందని పెట్టుబడిదారులు అంచనాలు వేసిన తర్వాత టెక్ సంస్థల షేర్లు అమ్మకాలకు దారితీశాయి.

**భయంతో ఆంత్రోపిక్స్ ఉద్యోగి రాజీనామా**

పరిశోధనల్లో స్పీడును అడ్డుకోకపోతే సమీప భవిష్యత్తులోనే మానవాళి అంతరించిపోయే ప్రమాదం ఉందని ఎ.ఐ సంస్థ పరిశోధకుడు, ''ఆంత్రోపిక్'' సంస్థ మాజీ ఉద్యోగి జాకబ్ కాక్సన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన భయంతో ఆంత్రోపిక్స్‌కు రాజీనామా చేశారు. మానవాళి భవిష్యత్తు గురించి ఎఐ ఉద్యోగులు భయపడుతున్నారని అన్నారు. ఎఐ పరిశోధనల్లో హోరాహోరీగా జరుగుతున్న అంతర్జాతీయ పోటీని నిలిపివేయాలన్నారు. ఈ విషయంలో చైనాతో ఒక సమన్వయపూర్వకంగా ఉండాలన్నారు. ''ఆంత్రోపిక్స్ ఉద్యోగులు పూర్తిగా భయపడుతున్నారు,ఎఐ ఫలితాలపట్ల వారు భయాందోళనతో ఉన్నారు,చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నారు అని ''సండే విత్ లారా కున్స్‌బెర్గ్'' కార్యక్రమంలో జాకబ్ కాక్సన్ చెప్పారు.ఈ పరిశోధనల సమయంలో భద్రతాపరమైన ఆందోళనలు తీవ్రంగా పెరుగుతున్నాయి.దీంతో ఆయన భయపడి తన పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆ వార్త వైరల్‌గా మారింది.ఎఐ పరిశోధనలు చేసేటప్పుడు అది చూపిస్తున్నవేగాన్ని చూసి ఉద్యోగులు తీవ్రంగా భయపడుతున్నారన్నది ఒక వాస్తవమని, ఎ.ఐ పరిశోధనలను,వాటి స్పీడును అడ్డుకోకపోతే సమీప భవిష్యత్తులో మానవాళి అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు.ఎ.ఐ ఒక సూపర్ కంప్యూటర్‌లాగా పనిచేస్తూ, మానవాళి ప్రమేయం లేకుండానే యావత్ ప్రపంచ ఇంటర్నెట్ వ్యవస్థను తన నియంత్రణలోకి తీసుకోగల శక్తిసామర్థ్యాలను చాట్ బాట్ల సమూహం సమకూర్చుకుంటుందని డారియో ఆమోడెయ్ హెచ్చరించారు.

## సుప్రీంకోర్టులో ట్రంప్‌నకు ఎదురు దెబ్బ

**వాషింగ్టన్:**ఆన్‌ఓటింగ్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. నవంబరు ఎన్నికలకు ముందుగానే మెయిల్ ద్వారా జరిగే ఓటింగ్‌ను పరిమితం చేయాలన్న ట్రంప్ ప్రణాళికను అమెరికా సుప్రీంకోర్టు తిరస్కరించింది.కొత్త నిబంధనలతో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ముందుకు వెళ్ళకుండా అమెరికా పోస్టల్ సర్వీసెస్‌ను నిరోధిస్తూ ఫెడరల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వును సుప్రీంకోర్టు మంగళవారం సమర్థించింది.ఐతే ఈ విషయంలో ఇదే తుది తీర్పు కాదు. ఈ కేసులో ఒక న్యాయమూర్తి కిందికోర్టు ఉత్తర్వును సమర్థించారు. విచారణ కొనసాగుతోంది.ఈ నిబంధనలు ఎన్నికల మోసాలను అరికడతాయని ట్రంప్ వాదిస్తున్నారు.ఓటర్ల జాబితాలో ఉన్న వారికి మాత్రమే బ్యాలెట్లు అందజేయాలని పోస్టల్ సర్వీసెస్‌ను ఆదేశిస్తూ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వును కోర్టు తిరస్కరించింది. ట్రంప్ ఉత్తర్వు రాష్ట్రాలకు ఉన్న రాజ్యాంగ హక్కును ఉల్లంఘిస్తోందని కోర్టులో సవాలు చేసిన పిటిషనర్లు వాదించారు. ఐతే ట్రంప్‌కు వ్యతిరేకంగా సవాలు చేసినవారి విజయం తాత్కాలికమేనని, పోస్టల్ సర్వీసెస్‌కు విస్తారమైన అధికారాలు ఉన్నాయని సంప్రదాయవాదులైన న్యాయమూర్తులు పేర్కొన్నారు.రెండోసారి వైట్‌హౌస్‌లో అధికారం చేపట్టినప్పటినుండీ ట్రంప్ మెయిల్ ఓటింగ్‌ను నియంత్రించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.విస్తృతమైన ఎన్నికల మోసం కారణంగానే 2020 ఎన్నికల్లో తాను ఓడిపోయానని గతంలో ట్రంప్ తప్పుడు ఆరోపణలు చేశారు.



## జెన్ జెడ్–జెన్ ఆల్ఫా తరాలు దేశ నాయకత్వ బాధ్యతలు మోయాలి

### ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పిలుపు

**చెన్నై:**జనరేషన్ జెడ్ (యువతరం),జనరేషన్ ఆల్ఫా (బాలల తరం) తరాలే దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ అన్నారు.వారే దేశ నాయకత్వాన్ని స్వీకరించి,బాధ్యతలు భుజాన మోయాలని పిలుపు ఇచ్చారు. చెన్నైలో డాక్టర్ ఎంజిఆర్ ఎడ్యుకేషనల్–రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 36వ వార్షికోత్సవంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ,''దేశం మాకు ఏం ఇచ్చిందని ప్రశ్నించడానికి బదులుగా,దేశానికి మనం ఏం చేయగలం'' అని ప్రశ్నించుకోవాలని,యువ గ్రాడ్యుయేట్లు దేశాన్ని ప్రథమస్థానంలో నిలబెట్టే బాధ్యతలు తీసుకోవాలని కోరారు.''మీరు ముందు నిలబడండి,నాయకత్వం వహించండి,బాధ్యతలు తీసుకోండి,దేశాన్ని ప్రథమస్థానంలో నిలబెట్టండి,దేశం సురక్షితంగా,బలంగా ఉంటేనే మనకు ఒక నివాసం,ఒక ఇల్లు ఉంటుంది అని గుర్తుంచుకోవాలి''అన్నారు. అనేక దేశాలలో ప్రజలు తమ తమ భూభాగాల నుండి వెళ్ళిపోయి నిరాశ్రయులవుతున్న తీవ్ర పరిస్థితులను గుర్తుచేశారు. తమిళనాడులో అత్యంత పురాతనమైన ప్రసిద్ధ గ్రంథం ''తిరుక్కురళ్''లో ఉన్న పద్యాలను నిర్మలాసీతారామన్ ఉటంకిస్తూ, విద్య గొప్ప శాశ్వత సంపద అనీ,ప్రణాళికాబద్ధమైన చర్యలు పాటించాలన్నారు. విద్యార్థులు,యువతరం అహకారం విడిచిపెట్టాలని,వినయ విధేయతలతో మెలగాలని,మేం బాధితులం అని భావించకుండా సవాళ్ళను ధైర్యంగా ఎదుర్కోవాలని హితవు చెప్పారు. ''మిమ్మల్ని జనరేషన్ జెడ్ అని పిలిచినా,జనరేషన్ అల్ఫా అని పిలిచినాగానీ మీరే చెప్పే విషయాలన్నింటిని వినడానికి భారతదేశం సిద్ధంగా ఉంది, ఐతే మీ చుట్టూ ఏం జరుగుతోందనే విషయాన్ని మీరు ప్రతిబింబించాలి,మీ పాత్ర ఏమిటో తెలుసుకోవాలి,మీ ద్వారా దేశం సాధించాల్సింది ఏమిటి అనే విషయాలను మీరు గ్రహించాలి'' అని మంత్రి చెప్పారు. దేశానికి మనం ఏం చేశాం అనే ప్రముఖ నినాదాన్ని ఆమె బాగా అర్థమయ్యేలా చెప్పేందుకు ప్రయత్నించారు.దేశం ఆర్థిక ఒడిదొడుకులను తట్టుకుని నిలబడేస్థాయిలో ఉందని నిర్మలాసీతారామన్ ప్రముఖంగా చెబుతూ, పశ్చిమాసియాలో యుద్ధం,ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు, సరఫరా వ్యవస్థల్లో తీవ్ర ఆటంకాలు ఏర్పడినప్పటికీ,దేశం ఆర్థికంగా స్థిరంగా నిలబడిందని చెప్పారు. దేశం 7.8 శాతం వృద్ధిరేటు సాధించిందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో బలమైన రాజకీయ నాయకత్వం ద్వారా మాత్రమే ఈ స్థిరత్వాన్ని దేశం సాధించగలిగిందని చెప్పారు.

## వచ్చేనెల 27న ఇజ్రాయెల్ ఎన్నికలు



**జెరూసలెం:**వచ్చేనెల 27వ తేదీన ఇజ్రాయెల్ పార్లమెంటుకు ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో 38 పార్టీలు పోటీ చేస్తున్నాయి. ఈ పార్టీలు ఇప్పటికే తమ తమ అభ్యర్థుల వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించాయి. వామపక్ష డెమొక్రటిక్‌పార్టీ ఎన్నికల సంఘానికి మితవాదుల అరాచకాలపై ఫిర్యాదు చేసింది. మితవాదులు దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తున్నారని, దేశం ప్రజాస్వామ్య విధానాలు పాటిస్తోందని విస్మరించారని, జాత్యాహంకారాన్ని ప్రోత్సహిస్తున్నారని, వారిని ఎన్నికలకు దూరంగా ఉంచాలని కోరింది.ఇటామర్ బెన్‌గ్విర్‌కు చెందిన పచ్చిమితవాద ఓట్జ్మా ఎహుదిత్ ప్యానెల్‌ను ఎన్నికల బరి నుండి నిషేధించాలని విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా అధికార లికుడ్‌పార్టీ అగ్రశ్రేణి 30 మంది అభ్యర్థులలో కేవలం నలగురు మహిళలను మాత్రమే పోటీకి నిలబెట్టింది. ఈ క్షణంలో ఎన్నికలు జరిగితే నెతన్యాహూ వ్యతిరేక కూటమి అధికారంలోకి వస్తుందని పోల్ సర్వేలు ప్రకటించాయి. 120 స్థానాలున్న పార్లమెంటు కెన్సెట్‌లో 61 సీట్లు గెలుచుకున్న పార్టీ,లేదా కూటమి అధికారం చెలాయిస్తుంది.ఇంతకుముందు 2022 నవంబరు 1వ తేదీన జరిగిన ఎన్నికల్లో నెతన్యాహూ నాయకత్వంలో ఆరు పార్టీల మితవాద కూటమి అధికారపగ్గాలు చేపట్టింది.

## ఇంధన వనరులపై దాడులు లేకుండా ఉక్రేన్–రష్యా అంగీకారం: ట్రంప్

- వీళ్ళవల్లే చమురు ధరలు పెరిగాయ్



**వాషింగ్టన్:**ఇంధన వనరులపై దాడులు చేసుకోకూడదని రష్యా–ఉక్రేన్ దేశాలు ఒక అంగీకారానికి వచ్చాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరు దేశాలు ఈ మేరకు ఒక అంగీకారానికి వచ్చాయని ఆయన చెప్పినప్పటికీ, ఎప్పటినుండీ ఈ ఒప్పందం అమలులోకి వస్తుంది? ఎంతకాలం దీనిని ఈ రెండు దేశాలు వర్తింపజేస్తాయి? వంటి వివరాలు మాత్రం ఆయన తెలియజేయలేదు.రష్యా ఇంధన సదుపాయాలపై దాడులు చేయకూడదని ఉక్రేన్ అంగీకరించిందని ఒక సోషల్ మీడియా పోస్టులో ట్రంప్ పేర్కొన్నారు.అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా చమురు ధరల పెరుగుదల ఇరాన్ యుద్ధంవల్ల జరగలేదని, రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం కారణంగానే ముడి చమురు ధరలు పెరిగాయని ట్రంప్ నిస్సిగ్గుగా ప్రకటించారు. ముడి చమురు ధరల పెరుగుదలకు ఇరాన్‌లో యుద్ధానికి ఎలాంటి సంబంధం లేదని ట్రంప్ చెప్పడంతో అందరూ అవాక్కయ్యారు. నవంబరులో అమెరికాలో జరిగే ద్వైవార్షిక ఎన్నికలు పూర్తయ్యేవరకూ చమురు ధరలు తగ్గబోవని, ఇదేవిధంగా కొనసాగుతాయని ట్రంప్ ప్రకటించిన మూడు రోజులకే మాటమార్చి ఈ ధరల పెరుగుదలను రష్యా–ఉక్రేన్ యుద్ధానికి ఆపాదించారు. కాగా, తమ ఇంధన మౌలిక సదుపాయాలపై ఉక్రేన్ దాడులు చేయబోదని ట్రంప్ చేసిన ప్రకటనను రష్యా స్వాగతించింది. క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ మాట్లాడుతూ, ఉక్రేన్‌పై ప్రభావం చూపించగల దేశాలు మరింత సౌలభ్యం కోసం ఆ దేశాన్నిప్రోత్సహించాలన్నారు.ఉక్రేన్ కీలక మౌలిక సదుపాయాలపై దాడులు నిలిపివేయాలని తమ మిత్రదేశాలు రష్యా నుండి హామీ పొందితే తాము కూడా ఇంధన వనరులపై దాడులు నిలిపివేస్తామని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తొలుత వ్యాఖ్యానించారు.

**222 డ్రోన్లు ధ్వంసం చేసిన రష్యా**

రష్యాపై రాత్రికిరాత్రే వందల డ్రోన్లతో ఉక్రేన్ దాడులు చేసింది.మంగళవారం తెల్లవారకముందే జరిగిన ఈ దాడులలో 222 డ్రోన్లను రష్యా వైమానిక దళం ధ్వంసం చేసిందని టాస్ వార్తాసంస్థ పేర్కొంది.ఈ దాడులవల్ల సమారా ప్రాంతంలో అనేక నివాసిత భవనాలు,పారిశ్రామిక సముదాయం ధ్వంసమయ్యాయి. దీనికి అదనంగా క్షిపణి దాడుల్లో రోస్టోవ్ ప్రాంతంలోని టాగన్‌రోగ్‌లో ఓజోన్ కంపెనీకి,వ్యవసాయ సంస్థలకు చెందిన గిడ్డంగులతోపాటు నివాసిత భవనాలు,ఒక విద్యాసంస్థ భవనం కూడా దెబ్బతిన్నాయి.తొమ్మిది జిల్లాలలో 30కిపైగా డ్రోన్లు,క్షిపణులను రష్యా దళాలు ధ్వంసం చేశాయని ఆ ప్రాంత గవర్నర్ యూరీ స్లూసర్ చెప్పారు.

## 'చేయూత' దరఖాస్తులకు నేటి సాయంత్రం వరకు గడువు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**'చేయూత నూతన పెన్షన్ల' దరఖాస్తు గడువు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సాయంత్రం 5 గంటల వరకు పొడిగించింది. వరుసగా మూడు రోజుల పాటు సెలవులు వచ్చిన నేపథ్యంలో మరో రోజు గడువు పొడగించినట్టు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం వెల్లడించారు.చేయూత పెన్షన్ కోసం ఇప్పటి వరకు 5.78 లక్షల దరఖాస్తులు అందాయి. షెడ్యూల్ ప్రకారం మంగళవారంతో గడువు ముగిసింది. బుధవారం సాయంత్రం వరకు గడువు పెంచినట్టు జిల్లా అధికారులకు ఎస్ ఇఆర్ పి సిఇఒ దివ్య దేవరాజన్ ఆదేశాలు జారీ చేశారు.

## ఎప్పుడూ సిద్ధమే

(మొదటి పేజీ తరువాయి)

వామపక్ష ప్రజాతంత్ర ఐక్య వేదిక నేత జస్టిస్ బి.చంద్రకుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సిపిఐ రాష్ట్ర న్యాయకత్వంతో సమావేశమైంది. సమావేశంలో పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్‌పాషా పాల్గొన్నారు. ఈసందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ వామపక్ష పార్టీల ఐక్య ఉద్యమ కార్యచరణతో పాటు ఎన్నికల్లో ఒకే గుర్తుపై పోటీ చేసే రోజులు రావాలని ఎప్పటి నుంచో సిపిఐ కోరుకుంటున్నదని చెప్పారు. కూనంనేనిసాంబశివ రావు మాట్లాడుతూ ఇప్పటికే అనేక వేదికల ద్వారా కమ్యూనిస్టులంతా ఐక్యం కావాలని, కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమై ఎర్రకోటపై అరుణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపును ఇచ్చామని అన్నారు. కమ్యూనిస్టుల ఐక్య కార్యాచరణతో పాటు ఐక్యమయ్యేందుకు సిపిఐ ఎప్పుడూ సిద్ధమేనని తెలిపారు. వామపక్ష పార్టీలన్ని ఐక్య కార్యాచరణతో ముందుకు సాగుతాయని, ఎన్నికల సమయంలో మాత్రం కలిసి పోటీ చేయలేక పోతున్నాయన్నారు. వామపక్షాలు ఏకం కావాలని వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక లక్ష్యానికి అనుగుణంగా సిపిఐ అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తుందని ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. సమావేశంలో వామపక్ష ప్రజా తంత్ర ఐక్య వేదిక నాయకులు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## ఫామ్‌హౌస్ శుద్ధీకరణ ఘటనలో ఏడుగురు అరెస్ట్

**ప్రజాపక్షం/ సిద్ధిపేట :** ఎర్రవల్లి ఫామ్‌హౌస్ శుద్ధీకరణ పేరిట దళితులను అవమానించిన ఘటనలో వరదరాజ్‌పూర్ గ్రామానికి చెందిన ఏడు మందిని ందితులను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ మహమ్మద్ యూసుఫ్ అలీ తెలిపారు. ఈనెల 8న మర్కూక్ మండలం వరదారాజ్ జంక్షన్ శుద్ధీకరణ పేరుతో పసుపు నీటిని చల్లిన ఘటనపై కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మర్కుక్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఘటనకు సంబంధించిన సాక్షుల వాంగ్మూలాలు, ఫోటోలు, వీడియో దృశ్యాలు, ఇతర అందుబాటులో ఆధారాలను పరిశీలించిన ఆనంతరం ఘటనలో పాల్గొన్నట్లు గుర్తించిన వరదరాజ్‌పూర్ గ్రామానికి చెందిన ఏడుగురు నిందితు లు అప్పాల ప్రవీణ్, రెడ్డబోయిన అమరేందర్, శ్రీపతి రాజు, ముచ్చపతి హి మవంత్, అంతని ఐలయ్య, అరికేల రాజు, అంతని మల్లేశ్‌ను ఈనెల 14న సోమవారం తెల్లవారు జామున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో అ దుపులోకి తీసుకొని , ఆనంతరం అరెస్టు చేసి గజ్వేల్ న్యాయస్థానంలో హా జరుపర్చినట్లు తెలిపారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## పునరుద్ధరించాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్–5 ఆసక్తి కనబరిచారు. ఫ్యూచర్ సిటీని ఎక్కడ నిర్మిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని సిఎం తెలిపారు. ఇందుకోసం సింగపూర్ కంపెనీ మా స్టర్ ప్లాన్ రూపొందిస్తోందని వివరించారు. ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో సిటీగా ఏ ర్పాటు చేస్తామని, దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఉంటుందని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5కు తెలిపారు. ఇప్పటికే అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు ఫ్యూచర్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయని సిఎం వెల్లడించారు.

**మూసీ పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి**

మూసీ పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5కు సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసా, మూసా నదుల సంగమంగా ఏర్పడిన మూసీ ఆక్రమణలకు గురికావడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. మూసీని పునరుజ్జీవింపజేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని సిఎం కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం**

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశ జిడిపిలో తెలంగాణ వాటా ప్రస్తుతం 2.5 శాతం ఉందని, దాన్ని 10 శాతానికి పెంచుతామని తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5కు సిఎం తెలిపారు. సమ్మిట్‌కు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5 సిఎం ఆహ్వానించారు. సమ్మిట్‌లో 100కు పైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటారని, వ్యాపార అవకాశాల కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని సిఎం వివరించారు.

## చెల్లింపు ఛార్జీలు

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించే సమయంలో కూడా ఇదే విధానం వర్తిస్తుంది. పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ ఛార్జీలను ఖరారు చేసింది. అక్టోబరు 15వ తేదీ నుండి ఈ ఛార్జీలు అమలులోకి వస్తాయని ఎన్.పి.సి.ఐ తెలియజేసింది. వ్యక్తులమధ్య జరిగే సాధారణ బదిలీలకు ఈ ఎండిఆర్ నుండి పూర్తిగా మినహాయింపు ఉంది.అదేవిధంగా రోజువారీ వ్యవస్థలో కోట్లాదిమంది ప్రజలు ఈ యుపిఐని ఉపయోగిస్తూ ఉన్నందువల్ల చాలా జాగ్రత్తగా ఈ విధానాన్ని అమలులోకి తెస్తున్నట్లు పేమెంట్ కార్పొరేషన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రూ.2000 లోపు యుపిఐ ద్వారా ఎలాంటి లావాదేవీలు చేసినా చార్జీలు వర్తించవు. రూ.2000 దాటి లావాదేవీలు చేస్తే వ్యాపారులు సంబంధిత బ్యాంకులకు రూ.12లు చెల్లించాలి. రూ.50 వేలు గనుక మర్చంట్‌కు వినియోగదారుల నుండి చెల్లింపులు జరిగితే సదరు బ్యాంకులకు వ్యాపారులు రూ.200లు, రూ.75000 లు లేదా అంతకంటే ఎక్కువ చెల్లిస్తే నికరంగా రూ.300లు వ్యాపారులు ఎండిఆర్ ఇవ్వాలి. చిరువ్యాపారులకు పూర్తిగా మినహాయింపు అమలులో ఉంటుంది. ఎందుకంటే వినియోగదారుల నుండి చిరువ్యాపారులకు సాధారణంగా 95 శాతం చెల్లింపులు రూ.2000 లోపే ఉండటంవల్ల వారికి ఎలాంటి ఎండిఆర్ ఛార్జీలు వర్తించవు.మ్యూచ్యువల్ ఫండ్స్,సెక్యూరిటీస్,స్టాక్ బ్రోకర్లు,డీలర్లకు గరిష్టంగా 0.02 శాతం ఎండిఆర్ వసూలు చేస్తారు. అంటే గరిష్టస్థాయిలో వారు రూ.200లు మాత్రమే చెల్లించాల్సి ఉంటుం ది. రైల్వే, టెలికాం, బీమా, ఇంధనం,వ్యవసాయ ఉపకరణాలకు సంబంధించిన ఎండిఆర్ రూ.2000లు దాటితే ఐదు రూపాయలు చెల్లించాలి. ప్రభుత్వపరంగా విద్యుత్, నీరు, పైపుల ద్వారా గ్యాస్ సరఫరా బిల్లులకు కూడా పేమెంటు రూ .2000లు దాటితే ఐదు రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది.

## పరిచేందుకేనా?

(మొదటి పేజీ తరువాయి)

విధించేందుకు మోదీ ప్రభుత్వం రహస్యంగా మార్గం సుగమం చేసిందని మంగళవారం ఎక్స్‌లో రాహుల్ గాంధీ పోస్టు చేశారు. 'ఇప్పుడు, రూ. 2,000 పైబడిన మర్చంట్ యుపిఐ లావాదేవీలపై ఎండిఆర్ విధించవచ్చు. ఈ లావాదేవీలు మొత్తం లావాదేవీల పరిమాణంలో కేవలం 5 శాతం ఉన్నప్పటికీ, అవి యుపిఐ మొత్తం లావాదేవీల విలువలో దాదాపు 65 శాతం వాటాను కలిగి ఉన్నాయి' అని రాహుల్ అన్నారు. వినియోగదారుల నుండి ఎలాంటి రుసుములు వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతోందని, కానీ దుకాణదారులపై విధించే రుసుములు చివరికి ఎక్కడి నుంచి వస్తాయి? ధరలకు అదనంగా, నేరుగా వినియోగదారుడి జేబులో నుంచి అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. భారతదేశం జీరోఎండిఆర్ విధానాన్ని అమెరికన్ చెల్లింపుల కంపెనీలు చాలా కాలంగా వ్యతిరేకిస్తున్నాయని రాహుల్‌గాంధీ అన్నారు. ఇప్పుడు, మోదీ ప్రభుత్వం సరిగ్గా అదే దిశలో విధానాన్ని మార్చడానికి మార్గం సుగమం చేసిందని పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య ఒప్పందం విషయంలో మాదిరిగానే, రాజీపడిన ప్రధాని మోదీ మరోసారి అమెరికా ఒత్తిడికి లొంగిపోతున్నారు అని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. ప్రభుత్వం మరోసారి పూర్తి నిజాయితీ, పారదర్శకత లోపాన్ని ప్రదర్శించి, వినియోగదారుల నమ్మకాన్ని దెబ్బతీసిందని కాంగ్రెస్ ఆరోపించింది. రూ. 2,000 వరకు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) లావాదేవీలపై లేదా రూపే డెబిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులపై ఛార్జీలు విధించవద్దని బ్యాంకులు, చెల్లింపుల వ్యవస్థ ప్రొవైడర్లను ప్రభుత్వం ఆదేశించిన తర్వాత ప్రతిపక్ష పార్టీ ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే, రూ. 2,000 కంటే ఎక్కువ లావాదేవీలపై ఛార్జీలు వర్తిస్తాయా లేదా అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయలేదు, ఈ ఛార్జీలను వ్యాపారులే చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు, మొత్తం ఎంత ఉన్నప్పటికీ యుపిఐ లావాదేవీలపై ఎటువంటి ఛార్జీ విధించబడలేదు. దీనిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందిస్తూ 'ఆగస్టు 6, 2026న మేము హెచ్చరించినట్లే, ఆర్థిక మంత్రి స్వయంగా స్పందించారు, ఇప్పుడు మోదీ ప్రభుత్వం పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేసిన కొత్త చట్టాలను ఉపయోగించి యుపిఐకి ఛార్జీలు విధించే ప్రక్రియను ప్రారంభిస్తోంది. సవరించిన చెల్లింపులు, పరిష్కార వ్యవస్థల చట్టం, 2007 కింద ఇప్పుడే ఒక నోటిఫికేషన్ జారీ చేయబడింది. ఇది బ్యాంకులు, ప్రొవైడర్లు కేవలం రూ. 2000 లోపు యుపిఐ లావాదేవీలకు మాత్రమే ఛార్జీలు విధించకుండా నిషేధిస్తుంది. కానీ ఈ పరిమితికి మించిన ఏ లావాదేవీకి స్పష్టమైన రక్షణ లేదు అని రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. యుపిఐ లావాదేవీలకు మనమందరం రుసుము చెల్లించేలా స్పష్టంగా రంగం సిద్ధం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 14 నాటి గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం, రూ. 2,000 వరకు రూపే డెబిట్ కార్డ్ లేదా యుపిఐ లావాదేవీ ద్వారా చెల్లింపు చేసే లేదా స్వీకరించే వ్యక్తిపై ఏ బ్యాంకు లేదా సిస్టమ్ ప్రొవైడర్ అయినా ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి ఛార్జీ విధించరాదు.

## తొలి విడత సాయం

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిదారులకు స్వయం ఉపాధి యూనిట్ల కోసం తొలి విడతగా రూ.లక్ష వరకు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 19న రాజీవ్ యువ వికాసం యూనిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని, రూ.లక్షలోపు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తొలి విడతలో యూనిట్లు మంజూరు చేయాలని సూచించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను కార్యాలయాల్లోనే స్వీకరించాలని, ఎంపిక ప్రక్రియను కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలు, గురుకులాల నిర్వహణ, విద్యా మౌలిక వసతులు, స్వయం ఉపాధి, స్కాలర్‌షిప్‌లు, స్టడీ సర్కిళ్లు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సిఎం తెలిపారు. గత పదేళ్లలో అధికారంలో ఉన్న ప్రభుత్వం యువశక్తిని నిర్వీర్యం చేసిందని, సంక్షేమ శాఖల కార్పొరేషన్ల ద్వారా యువతకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, రాజీవ్ యువ వికాసం పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామని చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టే అంశాన్ని అధ్యయనం చేయాలని అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. అవసరమైతే వివిధ కోర్సులను స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 26 ఏకలవ్య పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకువచ్చారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు అందించేలా పాఠశాలల నిర్మాణం, మౌలిక వసతులపై కూడా సమావేశంలో చర్చించారు.

**గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు**

రెసిడెన్షియల్ పాఠశాలల కోసం కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రతిపాదనపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని ఎస్‌సి రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిత్యం శుభ్రమైన, నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్‌సి గురుకుల పాఠశాలల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఆధునిక వంటశాలల నిర్వహణ, యంత్రాల కొనుగోలు కోసం బడ్జెట్‌లో ఇప్పటికే రూ.25 కోట్లను కేటాయించినట్లు గుర్తు చేశారు. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని ఎస్‌సి రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటు ఏ విధంగా పూర్తి చేస్తారనే దానిపై పక్కా కార్యాచరణ, స్పష్టమైన ప్రణాళికతో తమ ముందుకు రావాలని అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. పాఠశాలల్లో ఆధునిక వంటశాలల నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు విద్యార్థుల భోజన వసతికి ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. అప్పటివరకు విద్యార్థులందరికీ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని క్రమం తప్పకుండా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత బ్రేక్ ఫాస్ట్ పథకం అమలుకు వాడుతున్న కేంద్రీకృత యంత్రాల వంటశాలల నమూనాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్, రాష్ట్రంలోని వివిధ నివాస, సంక్షేమ విద్యాసంస్థల్లో పదేళ్ల నుండి చదువు పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల సమగ్ర డేటాబేస్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత దశాబ్ద కాలంగా ఈ పాఠశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల విద్య పూర్తి చేసుకున్న అనంతరం విద్యార్థులు ఉన్నత చదువుల్లో స్థిరపడ్డారా? ప్రతిష్టాత్మక ఉద్యోగాలు సాధించారా? లేక ఆర్థిక, సామాజిక కారణాల వల్ల మధ్యలోనే చదువును ఆపేసి డ్రాపౌట్స్‌గా మిగిలిపోయారా? ఈ విద్యాసంస్థలు అందించిన విద్య, వసతుల ద్వారా విద్యార్థుల జీవితాల్లో వచ్చిన మార్పులను అంచనా వేయడానికి 'సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్' (సిఈఎస్‌ఎస్)తో అధ్యయనం చేయించి సమగ్ర నివేదికను తయారు చేయించాలని తెలిపారు. ఎస్‌సి స్టడీ సర్కిళ్లపై చేసిన వ్యయం, ఎంపికైన అభ్యర్థుల సంఖ్య, వారికి అందించిన శిక్షణ, సాధించిన ఫలితాలపై డిప్యూటీ సిఎం ఆరా తీశారు. స్టడీ సర్కిళ్ల ద్వారా వస్తున్న ఫలితాలు, పెట్టుబడికి అనుగుణంగా వస్తున్న ప్రయోజనాలపై వివరణాత్మక అంచనా నివేదికను సమర్పించాలని ఆదేశించారు. స్టడీ సర్కిళ్లలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా నాణ్యమైన కోచింగ్ అందించాలని సూచించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి విజయేంద్ర బోయి, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సంతోష్, ఎస్‌సి కార్పోరేషన్ వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య బట్టు తదితరులు పాల్గొన్నారు.

# అఫ్గాన్‌తో మ్యాచ్‌లో సంజూనే ఓపెనర్

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆఫ్గనిస్తాన్ జట్టుతో జరుగుతున్న రెండో టి20 మ్యాచ్ లో భారత జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్ లో టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కలేదు. టాస్ గెలిచిన అనంతరం టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. ఈ పిచ్‌పై మొదట బౌలింగ్ చేయడం వల్ల వికెట్ ప్రవర్తనపై ఓ స్పష్టమైన అవగాహన వస్తుందని.. అది బౌలర్లకు ప్రయోజనాన్ని చేకూరుస్తుందని వెల్లడించాడు. తొలి మ్యాచ్ లో విజయం సాధించినప్పటికీ.. ఇంకా మెరుగైన ప్రదర్శన చేసే అవకాశముందని, ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో మరిన్ని వికెట్లు తీయాల్సి ఉందని అభిప్రాయపడ్డాడు. గాయం కారణంగా వరుణ్ చక్రవర్తి ఈ మ్యాచ్కు దూరం కాగా.. అతని స్థానంలో లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ తుది జట్టులోకి వచ్చాడు.



మరోవైపు ఆఫ్గనిస్తాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ మాట్లాడుతూ.. తాము కూడా టాస్ గెలిస్తే బౌలింగే ఎంచుకోవాలని భావించినట్లు చెప్పాడు. గత మ్యాచ్‌లో ఆరంభంలో వికెట్లు కోల్పోయినప్పటికీ మిడిల్ ఓవర్లలో కోలుకున్నామని.. ఈ రోజు మ్యాచ్ లో మరింత సానుకూల దృక్పథంతో మెరుగైన ఆటతీరు ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తామని చెప్పుకొచ్చాడు. ఎలాంటి మార్పులు లేకుండా గత మ్యాచ్ ఆడిన తుది జట్టుతోనే బరిలోకి దిగుతున్నట్లు స్పష్టం చేశాడు. ఇక పిచ్ విషయానికి వస్తే.. ఉపరితలంపై స్వల్ప తేమ, పొడిదనం మిశ్రమంగా కనిపిస్తున్నాయని నిపుణులు వెల్లడించారు.

**భారత్:** సంజు శాంసన్(వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, శివం దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, రవి బిష్ణోయ్.

**ఆఫ్గనిస్తాన్ జట్టు:** రహ్మానుల్లా గుర్బాజ్(వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్(కెప్టెన్), సెడిఖుల్లా అటల్, గుల్బదీన్ నాయబ్, దార్విష్ రసూలీ, అజ్మతుల్లా ఒమర్జాయ్, మహమ్మద్ నబీ, రషీద్ ఖాన్, నూర్ అహ్మద్, ముజీబ్ ఉర్ రెహ్మాన్, ఫజల్ హక్ ఫారూఖీ.

## స్పిన్ మ్యాజిక్‌తో 800 పాయింట్లు..

# భారత తొలి బౌలర్‌గా చరణి రికార్డు

మహిళల ఆసియా కప్‌లో వికెట్ల వేటతో రెచ్చిపోయిన శ్రీచరణి మరో ఘనత సాధించింది. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక రేటింగ్ పాయింట్లతో చరిత్ర సృష్టించింది స్పిన్ సంచలనం. ఆ మధ్యే నంబర్ 1 టీ20 బౌలర్‌గా అవతరించిన ఈ తెలుగమ్మాయి తాజాగా 800 పాయింట్ల క్లబ్‌లో చేరింది. తద్వారా ఈ మైలురాయిని అందుకున్న టీమిండియా తొలి బౌలర్‌గా చరణి మరో రికార్డు సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఆమె 804 రేటింగ్‌తో టాప్‌లో కొనసాగుతుండగా.. భారత్‌కే చెందిన ఆల్‌రౌండర్ దీప్తి శర్మ 729 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఐసిసి మహిళల టి20 బౌలర్లలో అందరికంటే ముందున్న భారత స్పిన్నర్ శ్రీ చరణి తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఇటీవల దుబాయ్లో ముగిసిన మహిళల ఆసియా కప్‌లో 12 వికెట్లతో సత్తా చాటిన ఈ తెలుగమ్మాయి 800 రేటింగ్ పాయింట్లు సాధించింది. ఫైనల్లో నాలుగు వికెట్లతో భారతజట్టు ఎనిమిదో సారి ఆసియా కప్ గెలుపొందడంలో కీలకమైన





చరణి 804 పాయింట్లతో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచింది. రెండో ర్యాంకర్ దీప్తి శర్మకు ఆమెకు 75 పాయింట్ల తేడా ఉంది.

ఏడాది క్రితం అంతర్జాతీయ క్రికెట్లో అరంగేట్రం చేసిన శ్రీ చరణి నంబర్ 1 ర్యాంక్ పట్టేసింది. నిలకడగా రాణిస్తున్న ఈ తెలుగమ్మాయి అంతర్జాతీయ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం సొంతం చేసుకుంది. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న పొట్టి వరల్డ్ కప్ లో తిప్పేసిన ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ టాప్ ర్యాంక్‌కు ఎగబాకింది. 2025 జూన్ 28న ఇంగ్లండ్‌తో మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్‌లో అడుగుపెట్టిన చరణి.. తన స్పిన్ మ్యాజిక్‌తో టీమిండియా విజయాల్లో కీలకవుతూనే.. వ్యక్తిగతంగా తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకుంది. గతేడాది స్వదేశంలో 14 వికెట్లతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన తొలిసారి వన్డే ప్రపంచకప్ గెలవడంలో కీలకమైంది కడప బిడ్డ.

మహిళ

## మహిళలు, పిల్లల పోషణకు అండగా

# ‘పోషణ్ మా 2026’

దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లలు, కిశోరుల పోషణ, ఆరోగ్యం, సంరక్షణపై అవగాహన పెంచేందుకు కేంద్రం ప్రారంభించిన ‘రాష్ట్రీయ పోషణ్ మాహ్ 2026’ (నెలరోజుల పోషణ్) కార్యక్రమం మహిళలకు అనేక విధాలుగా ఉపయోగపడుతున్నది. ప్రయోగాత్మకంగా, సెప్టెంబర్‌లో నెలరోజుల పాటు కొనసాగిన కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రాలను పోషణ, ఆరోగ్యం, సంరక్షణ, చిన్నారుల ప్రాథమిక విద్యకు ప్రధాన కేంద్రాలుగా బలోపేతం చేయడంపై దృష్టి సారించడం జరిగింది. ‘హమారీ అంగన్వాడీ, హమారీ జిమ్మేదారీ’ అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో దశలవారీగా కొనసాగుతుంది. ఒక్కో ప్రాంతంలో నెలరోజులు జరిగే ఈ కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో స్థానిక సమాజం భాగస్వామ్యాన్ని పెంచుతారు. ప్రతి కేంద్రంలో అంగన్వాడీ మేనేజ్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించి సేవల నాణ్యతను సమీక్షిస్తారు. తల్లుల కమిటీలు కూడా పిల్లలకు అందించే ఆహారం నాణ్యతను పర్యవేక్షించే అవకాశం లభిస్తుంది. రోజువారీ ఆహార



మెనూ, లబ్ధిదారులకు అందాల్సిన పోషకాహార వివరాలను మెనూ బోర్డుల ద్వారా స్పష్టంగా ప్రదర్శిస్తారు. మహిళలకు ఈ కార్యక్రమం ప్రత్యేకంగా ప్రయోజనం చేకూర్చిన అంశాల్లో ప్రధానమైనది గర్భిణులు, బాలింతలకు అందే ప్రభుత్వ సహాయాన్ని విస్తరించడం. ప్రధానమంత్రి మాతృ వందన యోజన పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా అర్హులైన గర్భిణులు, బాలింతలందరినీ పథకంలో చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. వారికి నేరుగా ఆర్థిక సహాయం అందేలా చర్యలు వేగవంతం చేస్తున్నారు. దీంతో గర్భధారణ, ప్రసవానంతర దశలో మహిళలకు ఆర్థిక భరోసా లభించే అవకాశం పెరిగింది. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారంతో పాటు ప్రారంభదశలోనే అభివృద్ధి అవసరాలను గుర్తించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మూడు సంవత్సరాల లోపు పిల్లల ఎదుగుదల, అభివృద్ధి దశలను నమోదు చేసి, ప్రత్యేక జోక్యం అవసరమైన పిల్లలను త్వరగా వైద్య లేదా ఇతర సేవలకు పంపించే విధానం చేపట్టారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల కోసం తల్లిదండ్రులతో కలిసి విద్యా, ఆటల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా తల్లులకు పిల్లల పోషణ, ప్రారంభ విద్య, ఆరోగ్య సంరక్షణపై మరింత అవగాహన కలుగుతున్నది. సమాజం అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై బాధ్యత తీసుకోవడం వల్ల మహిళలు, పిల్లలకు అందే సేవల నాణ్యత మెరుగుపడే అవకాశం ఏర్పడింది. మొత్తం మీద ‘పోషణ్ మాహ్ 2026’ మహిళలను కేవలం పథకాల లబ్ధిదారులుగా చూడకుండా, కుటుంబ పోషణ మరియు బాలల ఆరోగ్య సంరక్షణలో కీలక భాగస్వాములుగా గుర్తించింది. అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడం, గర్భిణులు, బాలింతలను ప్రభుత్వ సహాయంతో అనుసంధానించడం, పిల్లల ప్రారంభ అభివృద్ధిపై దృష్టి పెట్టడం ద్వారా మహిళల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, తదుపరి తరాల పోషణకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతున్నది.

## నిర్ణయాల్లో మహిళల పాత్ర పెరగాలి

భారత సమాజంలో మహిళల పాత్ర గతంతో పోలిస్తే గణనీయంగా విస్తరించింది. కుటుంబ బాధ్యతలకే పరిమితమైన దృక్కోణం నుంచి బయటకు వచ్చి మహిళలు ప్రభుత్వ, ప్రైవేటు, సామాజిక, పరిపాలనా, రాజకీయ రంగాల్లో నాయకత్వ బాధ్యతలు చేపడుతున్నారు. దేశ నిర్మాణంలో మహిళల భాగస్వామ్యం ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తోంది. శాసన సభలు, పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు కానున్న నేపథ్యంలో భవిష్యత్తులో వారి ప్రాతినిధ్యం ఆ పరిమితిని కూడా దాటే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సంఖ్య పెరగడం కంటే నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మహిళలకు నిజమైన భాగస్వామ్యం లభించడం మరింత ముఖ్యమైన అంశం. మహిళలను ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా మాత్రమే చూడకుండా, విధానాలను రూపొందించే వ్యక్తులుగా చూడాల్సిన అవసరం ఉంది.



పరిపాలనా రంగంలోనూ మహిళల ప్రాతినిధ్యం పెరుగుతోంది. గతంలో ఐఎఎస్, ఐపిఎస్, అటవీ సేవలు వంటి రంగాల్లో మహిళల నాయకత్వం పరిమితంగా ఉండేది. ఇప్పుడు అనేక కీలక బాధ్యతల్లో మహిళలు ముందుకు వస్తున్నారు. రాబోయే దశాబ్దంలో ప్రభుత్వ సంస్థలు, రాష్ట్రాలు, జాతీయ స్థాయి వ్యవస్థల్లో మహిళల నాయకత్వం మరింత పెరిగే అవకాశం ఉంది. మహిళల పాలనా భాగస్వామ్యం పెరిగితే దాని ప్రభావం కేవలం మహిళలకు సంబంధించిన అంశాలకే పరిమితం కాదు. విద్య, ఆరోగ్యం, ఆర్థికవ్యవస్థ, సాంకేతికత, పర్యావరణం, మౌలిక వసతులు, డిజిటల్ భద్రత, సుపరిపాలన వంటి విస్తృత అంశాలపై మహిళల అనుభవాలు, ఆలోచనలు విధాన నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. ప్రజాస్వామ్యంలో చర్చ, అనుభవాల పంచుకోవడం, భిన్న దృక్కోణాలకు స్థానం కల్పించడం ద్వారా మెరుగైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. అందుకే మహిళల రాజకీయ సామర్థ్యాన్ని పెంచే శిక్షణ, విధాన అవగాహన, నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరగాలి. మహిళల సాధికారత అంటే వారికి అవకాశాలు కల్పించడం మాత్రమే కాదు. ఆ అవకాశాలను ఉపయోగించుకుని వారు విధానాలను రూపొందించే స్థాయికి చేరడం. రాబోయే కాలంలో మహిళల నాయకత్వం పెరగడం భారత ప్రజాస్వామ్యాన్ని మరింత సమగ్రంగా, సమానత్వంతో కూడినదిగా మార్చే కీలక పరిణామంగా నిలుస్తుంది.

# నాటి రైతాంగ సాయుధ పోరాట ఫలితమే నేటి తెలంగాణ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

### ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరుల పోరాట ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్రం అని, వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం హుస్నాబాద్ సిపిఐ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్, హన్మకొండ, జిల్లాల కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, కర్రె బిక్షపతి, హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీరు సత్యనారాయణ, సిరిసిల్ల కార్యదర్శి మంద సుదర్శన్, నాయకులు ఆందే స్వామి, కోహెడ సృజన్‌కుమార్, బోయిని ఆశోక్, నాగెల్లి లక్ష్మ రెడ్డి, ఆదిరి రమేశ్, ఆందే ఆశోక్, వుల్పులు శ్రీనివాస్, బోనగిరి రూపేశ్, లంక దాసరి కళ్యాన్, న్యాల రాజు, బత్తుల బాబు, గూడ పద్మ, జనగాం రాజ్‌కుమార్, పిట్టల మొగిలి, ప్రసాదు, మౌటం బాలయ్య, సుధాకర్, ఐలేని మల్లారెడ్డి, నర్సింహచారి పాల్గొన్నారు.

**ఖమ్మం అర్బన్ :** వీర తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని, బిజెపి చరిత్రను వక్రీకరించాలని చూస్తే ఊరుకునేది లేదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు తెలిపారు. సెప్టెంబర్ 17న సాయుధ పోరాట దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.



హుస్నాబాద్‌లో...

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల పరిధిలోని చిమ్మపుడి, పాపటపల్లి గ్రామాల్లో సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే మహ్మద్ రజబ్ అలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతల రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు యర్రాబాబు, పగడాల మల్లేష్, బోడా వీరన్న, ప్రొద్దుటూరి వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ జులా వెంకటేశ్వర్లు, బానోత్ నాగేశ్వర రావు, నాదెండ్ల పుల్లయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, గుగులోత్ హరి, గుండ్ల అశోక్, యరగొర్ల మధు, గాడిచర్ల సత్యనారాయణ, వార్డు సభ్యులు ఉల్లేబోయిన విష్ణుమూర్తి, కాళంగి చిన్న పిచ్చయ్య, అల్లు చిన్న వెంకటరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. స్థానిక మెయిన్ చౌరస్తాలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సభ సిపిఐ రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోషిక మోహన్ అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ అధ్యక్షతన జరిగిన సభలో తాళ్లపల్లి మల్లయ్య, కార్పొరేటర్ మార్కాపూర్ సూర్య, మాటేటి శంకర్, శనిగరపు చంద్రశేఖర్, ఆసాల రమ, రేణుకుంట్ల ప్రీతం, ఆసాల నవీన్, పడాల కనకరాజు, బూడిద మల్లేష్, అబ్దుల్ కరీం, శనిగరపు తిరుమల, దుబాసి రేణుక, సుధీర్, గుంపుల కుమారస్వామి, కె.జగన్, జైపాల్‌రెడ్డి, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

**తుంగతుర్తి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల త్యాగం మరువలేనిదని సిపిఐ సూర్యపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని వెంపటి, అన్నారంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు దాయం రాజారెడ్డి, దొంగరి ముత్తిలింగం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాయం రాజిరెడ్డి మనవరాలు దాయం ఝాన్సీ, నాయకులు ఎల్లెంల యాదగిరి, బూర వెంకటేశ్వర్లు, నందూరి కరుణ కుమారి, గుగులోతు రాజారాం, ఎడెల్లి శ్రీకాంత్, వెంపటి సర్పంచ్ తప్పెట్ల ఎల్లయ్య, పాల్వాయి పున్నయ్య, నారాయణ, మల్లేష్, మురళి పాల్గొన్నారు.

**ఖానాపూర్ :** తెలంగాణ రైతాంగ మహత్తర సాయుధ పోరాట చరిత్రను బిజెపి వక్రీకరించడం ద్రోహమని సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని కొమురం భీం విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పిల్లి రమేష్, నాయకులు గంగన్న, గోవింద్ స్వామి, నర్సయ్య, హన్మంత్, తదితరులు పాల్గొన్నారు.

**కల్వకుర్తి :** కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి.ఫయాజ్, నాయకులు పులిజాల పరుశురాములు, గడ్డం శ్రీనివాసులు, ప్రేమ్‌కుమార్, సంతోష్, దేశం సైదులు, అమీర్, శివ, మహేష్, పరుశురాం గౌడ్, వెంకటయ్య, నాగరాజు, అంజినాయక్ పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో...

**మందమర్రి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మందమర్రి బస్టాండ్ వద్ద ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, దాగం మల్లేష్, భీమనాదుని సుదర్శన్, వనం సత్యనారాయణ, కామెర దుర్గారాజ్, తాళ్లపల్లి వీరయ్య, రొడ్డ నరేష్, ఎగేటి రాజేశ్వరరావు, ఆంతోని దినేష్, సాధనవేణి ప్రభాకర్, రేఖ, మంజుల, రెంటాల శ్యామ్, జూలవేణి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**మునుగోడు :** నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని పలివెల గ్రామంలో సాయుధ పోరాట అమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం, గోసుకొండ లింగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగూరి నర్సింహ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతి వెంకటేశ్వర్లు, నాయకులు చాపల శ్రీను, బొమ్మరబోయిన లాలయ్య, సురిగి చలపతి, చల్మెడ సర్పంచ్ బండమీది యాదయ్య, మాదగోని సత్తమ్మ, దుబ్బ వెంకన్న, వనం వెంకన్న, ఆనగంటి నర్సింహ, గోస్కొండ మల్లేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

**జనగామ:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలో తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, పోరాట యోధుడు నల్ల నరసింహులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి, నాయకులు ఆదిసాయన్న, ఆకుల శ్రీనివాస్, సొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, రావుల సదానందం, మోటె శ్రీశైలం, చామకూర యాకూబ్, భూమల్ల ఐలయ్య, పుప్పాల ఐలయ్య, సుదర్శన్, నగేష్, గుగులోతు సఖి, కందుకూరి మల్లేశం, గుండెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్ :** షాద్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. సభలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు, బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, సర్పంచ్ ఎం.శ్రీను నాయక్, నాయకులు టి.నర్సింహ్మారెడ్డి, ఎండి షకిల్, గోవింద్ నాయక్, ఎం.పవన్, ఆకాష్, మహ్మద్ హుస్సేన్, ప్రసాద్, మల్లేష్ పాల్గొన్నారు.



ఖమ్మంలో...



పెద్దపల్లిలో...



జనగామలో...



నల్లగొండ..మునుగోడులో...



రంగారెడ్డిలో...



సూర్యాపేట..తుంగతుర్తిలో...



మంచిర్యాలలో...



నిర్మల్‌లో...

# గ్రామీణ నిరుద్యోగానికి పరిశ్రమలు,యువత అనుసంధానమే పరిష్కారం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** గ్రామీణ ప్రాంతాల్లోని విద్యావంతులైన నిరుద్యోగ యువతకు, ప్రముఖ పారిశ్రామిక సంస్థలకు మధ్య బలమైన, నిరంతర అనుసంధానం ఏర్పడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గ్రామీణ యువతలో ప్రతిభకు కొదవ లేకపోయినా, సంఘటిత రంగంలోని ఉద్యోగావకాశాలను అందుకునేందుకు సరైన వేదిక లేకపోవడమే ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఈ అంతరాన్ని తొలగించేందుకు ప్రభుత్వం వ్యవస్థీకృత కార్యాచరణతో ముందుకు సాగుతోందని చెప్పారు. సెప్టెంబర్ 19న కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లపై మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొనే కంపెనీల ప్రతినిధులు, వందకు పైగా విద్యా సంస్థల ప్రతినిధులు, స్థానిక అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యావంతులైన యువతలో నిరుద్యోగం సమాజాన్ని వేధిస్తున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువత పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందన్నారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటిఐ, డిగ్రీతోపాటు వివిధ వృత్తి విద్యాకోర్సులు చదివించేందుకు తల్లిదండ్రులు తమ ఆర్థిక స్తోమతకు మించి ఖర్చు చేస్తున్నప్పటికి, చదువు పూర్తయిన తరువాత పిల్లలకు తగిన ఉద్యోగాలు లభించక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా, ఎంపిగా, మంత్రిగా, టిపిసిసి అధ్యక్షుడిగా తన సుదీర్ఘ ప్రజాజీవితంలో ఇటువంటి తల్లిదండ్రులను అనేక మందిని కలిశానని చెప్పారు. మునగాల వంటి గ్రామంలో చదివిన ఇంజనీరింగ్ లేదా వృత్తి విద్యా పట్టభద్రుడికి హైదరాబాద్‌లో నివసించే యువకుడితో సమానంగా ప్రముఖ కంపెనీలను సంప్రదించే అవకాశం ఉండదన్నారు. ఉద్యోగ ఖాళీల వివరాలు తెలుసుకోవడం, పేరొందిన సంస్థలను సంప్రదించడం, పదే పదే హైదరాబాద్‌కు ప్రయాణించడం, ఇంటర్వ్యూలకు హాజరుకావడం గ్రామీణ యువతకు ఆర్థికంగా, సామాజికంగా పెద్ద సవాల్‌గా మారుతోందన్నారు. గ్రామీణ యువత ప్రముఖ కంపెనీల వద్దకు సులభంగా చేరుకోలేకపోతే, ఆ కంపెనీలనే గ్రామీణ యువత ముంగిటకు తీసుకురావాలనేదే కోదాడ మెగా జాబ్‌మేళా ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో 200కు పైగా కంపెనీలు పాల్గొనగా, ఈసారి కోదాడ జాబ్‌మేళాకు సుమారు 300 కంపెనీలను ఆహ్వానించినట్లు వెల్లడించారు. జాబ్‌మేళా ద్వారా 3500 మందికి పైగా యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు సాధ్యమైనంత వరకు జాబ్‌మేళా ప్రాంగణంలోనే ఆఫర్ లెటర్లు అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందజేస్తారని వెల్లడించారు. జాబ్‌మేళాకు పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్, పార్కింగ్‌కు సంబంధించి పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు రవాణా, వసతి, భోజన సదుపాయాల సమన్వయ బాధ్యతలను కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట ఆర్‌డిఓలకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె. నరసింహాతోపాటు వివిధ శాఖల అధికారులు, విద్యాసంస్థలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలన

### దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/కోదాడ:** 19న కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై మంగళవారం కోదాడలోని సిసిరెడ్డి కాన్వెంట్‌లో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందిగా చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కంపెనీల ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, తాగునీరు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జాబ్‌మేళాకు పెద్ద సంఖ్యలో యువత హాజరయ్యే అవకాశం ఉన్నందున శాఖల వారిగా కేటాయించి సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు అందేలా జాబ్‌మేళాను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి

### బుడ్డోనితండాలో విషాదం.... కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం బుడ్డోని తండా గ్రామంలో మంగళవారం విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌కు గురై యువ రైతు నేనావత్ దస్రుమృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుడ్డోనితండాకు చెందిన నేనావత్ దస్రు తన వ్యవసాయ పొలంలో విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడంతో పక్కనే ఉన్న విద్యుత్ వైర్ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయి అక్కడికక్కడే దస్రు మృతి చెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో మృత దేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై చందంపేట ఎస్‌ఐ లోకేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన దస్రు కుటుంబాన్ని ఆదుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను, ప్రభుత్వాన్ని స్థానిక సర్పంచ్ లాలోసింగ్ విజ్ఞప్తి చేశారు. యువరైతు దస్రు మృతితో బుడ్డోని తండా గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబ రోదనలు కంటతడిని పెట్టించాయి.

## బావిలో పడి వివాహిత మృతి...



**ప్రజాపక్షం/డిండి:** డిండి మండలం కొత్త తండా(మూలతండా) గ్రామ శివారులో మంగళవారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో వారి వ్యవసాయ భూమిలోని బావిలో పడి నాగమణి(21) మృతి చెందింది. మృతురాలు నాగమణికు 18 నెలల క్రితం టేకితం ఆంజనేయులుతో ప్రేమ వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ. 5లక్షల నగదు, 6 తులాల బంగారం ఇచ్చినట్లు, గత రెండు నెలలుగా నాగమణికి ఆమె భర్త ఆంజనేయులు, అత్త యాదమ్మ, మామ వెంకటయ్య, నాయనమ్మ లక్ష్మమ్మలు అదనపు కట్నం కోసం వేధించినట్లుగా, అదనంగా ఒక ఎకరం వ్యవసాయ భూమి, 15 తులాల బంగారం, ఒక ప్లాట్, రూ.5లక్షల నగదు తీసుకురావాలని ఇటీవల నాగమణిని వేధించిన విషయమై పెద్దల సమక్షంలో ఇరువర్గాల మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం. అనంతరం నాగమణిని భర్త ఆంజనేయులు ఇంటికి తీసుకువెళ్లగా తర్వాత నాగమణి మనస్తాపం చెందిన మంగళవారం బావిలో పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె తండ్రి, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని వరకట్న వేధింపుల వల్లనే నాగమణి బావిలోకి దూకి మరణించినట్లు మృతురాలి తండ్రి అనిమోని వెంకటయ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మృతురాలిని పోస్ట్‌మార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆసుపత్రికి తరలించగా దేవరకొండ డిఎస్పి శ్రీనివాస్‌రావు, సిఐ బీసన్న, తహశీల్దార్ శ్రీనివాస్‌గౌడ్‌లు మార్చురిలో మృతదేహాన్ని పరిశీలించారు.

## నరేంద్రమోదీ పాలనలో సంక్షేమానికి ఆటంకం : శ్రీనివాస్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నరేంద్రమోదీ పాలనలో దేశ సంక్షేమానికి తూట్లు పడుతుందని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం కౌన్సిల్ సమావేశం గోవిందాపురంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్రానికి పూర్వమే సాధించుకున్న కార్మిక హక్కులను హరించే ప్రయత్నంలో భాగమే నరేంద్రమోదీ విధాలు ఉన్నాయని, ఆ విధానాలను వ్యతిరేకించాలని, దేశ జనాభాలో సగానికి పైగా కార్మికవర్గం ఉన్నదని, ఆ కార్మిక వర్గానికి చేయాల్సింది చేయకపోగా ఉన్న హక్కులను తీసివేస్తూ కార్పోరేట్ పెట్టుబడిదారి శక్తులకు నరేంద్రమోడి కొమ్ముకాస్తున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని వ్యవసాయ ఉత్తత్తుల కనీస మద్దతు ధర ఇవ్వాలని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరాలని ఇప్పుడు ఉన్న ప్రమాదబీమా 10 లక్షలు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు ఇందిరాల వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జెట్టి ప్రసాద్, ముడుసు పాపారావు, తాటికొండ జయరాజు, ఎల్. అనిల్, బొప్పన రాజు, బండి భాస్కర్, ఇట్టిమల్ల మట్టయ్య, రెంటాల రమేష్, మరుసకట్ల దాసు, రెంటాల నర్సింహారావు, తెలగమళ్ల మధు, తోకల ప్రభాకర్, దూళిపాళ నారి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమాజ మనుగడకు తోడ్పడాలి

**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** ఉపాధ్యాయులు సమాజ మనుగడకు తోడ్పడటంతో పాటు విద్యార్థుల భావి భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేయాలని గౌరవ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం అన్నారు. ఉపాధ్యాయుల సేవలు సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. మంగళవారం ఎస్‌టీయూటీఎస్ 80 వసంతాల వైభవోత్సవ పోస్టర్‌ను ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సేవలను, విద్యారంగ అభివృద్ధికి అవి చేస్తున్న కృషిని అభినందించారు. విద్యార్థులలో విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఇండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కల్లూరి రమేష్, రాష్ట్ర కార్యదర్శి బకనగారి జంగయ్య, ఏఐఎస్‌టీఎఫ్ కౌన్సిల్ మెంబర్ బొమ్మగాని నాగభూషణం, ఎస్‌టీయూ నాయకులు నరసింహ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




## బెల్టు షాపుల్లో మైనర్లకు మద్యం విక్రయించకుండా చర్యలు

### యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా పట్టణ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అవగాహన

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజలు, ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా పట్టణ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అవగాహన కల్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల నియంత్రణ సమన్వయ జిల్లా స్థాయి కమిటీ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మద్యం, సిగరెట్లు ఎక్కువగా వినియోగించే ప్రాంతాలను గుర్తించి కౌన్సిలర్ల ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. స్వయం సహాయక సంఘాల నెలవారీ గ్రామ సమాఖ్య సంఘ సమావేశాల్లో మాదక ద్రవ్యాల అంశాన్ని చర్చించి అవగాహన కల్పించాలని, అవసరమైన ప్రచార సామగ్రిని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల నల్లగొండ, నకిరేకల్, మిర్యాలగూడ తదితర ప్రాంతాల్లో డ్రగ్స్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన డిఅడిక్షన్ సెంటర్‌ను వెంటనే ప్రారంభించాలని, అన్ని పీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, జీజీహెచ్‌లో డ్రగ్ టెస్టింగ్ కిట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని వైద్యాధికారులను ఆదేశించారు. బెల్టు షాపుల్లో మైనర్లకు మద్యం విక్రయించకుండా చర్యలు కట్టుదిట్టం చేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ హాస్టళ్లలో విద్యార్థుల ప్రవర్తనను గమనిస్తూ కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ నిరంతరం కృషి చేస్తున్నా మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతోందని, చిన్న వయస్కులు మత్తుకు బానిసవుతున్నారని, ఈ ఏడాది 130 నేర కేసుల్లో మైనర్ల ప్రమేయం ఉందని తెలిపారు. అన్ని పీహెచ్‌సీల్లో డ్రగ్ టెస్టింగ్ కిట్లు ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లా అధికారికి రెండు మూడు సంస్థల్లో అవగాహన కల్పించే బాధ్యత అప్పగించాలని సూచించారు. సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ రెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి, డిఆర్‌ఓ దశరథ్, డీఎఫ్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

## తెలంగాణకు పట్టిన పీడ కాంగ్రెస్ దయ్యమే

### మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి విమర్శ




**ప్రజాపక్షం/సూర్యాపేట :** తెలంగాణకు పట్టిన పీడ కాంగ్రెస్ దయ్యమేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. రైతులపట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతూ మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. రేవంత్ అనే భూతం ఈ రాష్ట్రాన్ని నాశనం చేస్తుందని మండిపడ్డారు. అందుకే తెలంగాణలో నీళ్లు, అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజలు ఏమడిగినా ఎల్నినో సాకుతో కాంగ్రెస్ నాయకులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. కన్నెపల్లి పంపు హౌజ్ ఇవ్వాళ ప్రారంభించిన నీళ్లు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. సాగర్ ఎడుమ కాలువ ద్వారా 11వేల క్యూసెక్కుల నీళ్లు ఇచ్చే పరిస్థితి ఉన్నా కేవలం 7వేల క్యూసెక్కులు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. రైతులు పంటలు వేసుకోవాలా వద్దా అని స్పష్టంగా చెప్పమంటే సమాధానమే లేదన్నారు. మన నీళ్ళను దోచుకుపోతుంటే కెఆర్‌ఎంబికి ఉత్తరం రాయాలన్న సోయికూడా ఈ ప్రభుత్వానికి లేకపోవడం విచారకరమన్నారు. కెసిఆర్ హయాంలో ఇంతకన్నా తక్కువ నీళ్లున్న సమయంలోనే పంటలు బ్రహ్మాండంగా పండించుకున్నామని గుర్తు చేశారు. ఆనాడే వాళ్ల బాసులైనా చంద్రబాబు మెడలు వంచి తెలంగాణను సస్యశ్యామలం చేసుకున్నామని చెప్పారు. కృష్ణా, గోదావరి నీళ్లు పుష్కలంగా వచ్చినా పంటలు ఎండబెడుతుండ్రని ఆవేదన వ్యక్తం చేశారు.

## బిఆర్‌ఎఓయులో చదువుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

### మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు

### సెప్టెంబర్ 30 వరకు ప్రవేశాలు: డాక్టర్ బి. ధర్మ నాయక్



**ప్రజాపక్షం/నలగొండ :** విద్యను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాలను, ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బిఆర్‌ఎఓయు) ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు, విద్యా విధానాలను అమలు చేస్తోందని విశ్వవిద్యాలయ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి.ధర్మ నాయక్ తెలిపారు. మంగళవారం నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యయన కేంద్రంలో కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ధర్మ నాయక్ మాట్లాడారు. 2026 విద్యా సంవత్సరానికి యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని, అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో విద్యార్థులు తమకు అనుకూలమైన సమయంలో, సొంత వేగంతో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి ఆధ్వర్యంలో మారుతున్న కాలానికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నూతన కోర్సులను రూపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. మహిళా విద్యార్థుల్లో వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించి, వారిని భవిష్యత్ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు బిఆర్‌ఏఓయూడబ్ల్యూ ఈ హబ్ సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే టీసీఎస్, ఐకాన్, రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్, రాశి, విహబ్ వంటి సంస్థలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు గుర్తుచేశారు. ప్రతి విద్యా సంవత్సరంలో నల్లగొండ జిల్లా నుంచి యూజీ, పీజీ ప్రవేశాలు అత్యధికంగా ఉంటాయని, ఈ ఏడాది కూడా అడ్మిషన్లలో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే.శ్రీనివాసరాజు, రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ బొజ్జ, కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ భూక్యా వీరన్న, డాక్టర్ సుంకరి రాజారామ్, అధ్యయన కేంద్రం కౌన్సిలర్లు, నరేంద్ర, పద్మ, శంకర్, ఉస్మాన్ పాషా, నగేష్ బద్దం మహేష్, బద్దం శంకర్ పాల్గొన్నారు.

## దేశంలో అన్ని పోరాటాలకూ మార్గదర్శి తెలంగాణ రైతాంగ పోరాటం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుల ఆనాటి త్యాగాలు చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలల్లో భాగంగా అమరుల స్తూపాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో రైతు బిడ్డల ధైర్యం కమ్యూనిస్టు నాయకుల నాయకత్వంలో పోరాటం దేశానికి మంచి చరిత్రను ఇచ్చిందన్నారు. రాజ్యాధికారానికి వ్యతిరేకంగా దేశంలో జరిగిన తొలి సాయుధ పోరాటంగా రైతాంగ పోరాటం నిలిచిందన్నారు. జమీందారి విధానం, బానిసత్వం, వెట్టిచాకిరి లేకుండా చేసింది కమ్యూనిస్టుల పోరాటమే అన్నారు. రజాకార్ల దురగాతలను అడ్డుకుని దున్నేవాడికే భూమిపై హక్కును కల్పించింది, అణగారిన వర్గాలకు హక్కులు కల్పించి సమానత్వం వైపు మార్గాలు వేసింది. ఆనాటి సాయుధ పోరాట యోధుల త్యాగాలతో కూడిన జీవితమేనన్న విషయం మరువరాదన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, సిపిఐ నాయకులు మామిడి వెంకటేశ్వర్లు, పశ్య శ్రీనివాసరెడ్డి, కంబాల శ్రీనివాస్, నారాయణ, జడ శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరీ, దొంతగాని సత్యనారాయణ, రమేష్, చెనగాని సైదులు, జక్కుల రమేష్, ఇందిరాల వెంకటేశ్వర్లు, జడ వెంకన్న, ఉమా, సోమగాని కృష్ణ, చక్రాల స్టాలిన్ పాల్గొన్నారు.



**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్‌రెడ్డి ఇటివల అకాల మరణం చెందగా మంగళవారం వారి స్వగ్రామం పడమటిపల్లిలో సుధీర్‌రెడ్డికి జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబసభ్యులను పరామర్శించిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రమావత్ అంజయ్యనాయక్.**

## అప్పాజీపేటలో 2 వేల ఏళ్ల నాటి టెర్రకోట డాబర్ లభ్యం



**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** జిల్లాలో మరో అపురూప పురావస్తువు వెలుగు చూసింది. నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామ శివారులో 2 వేల ఏళ్ల నాటి టెర్రకోట డాబర్ లభించింది. గత పదేళ్లుగా చరిత్రపూర్వయుగం ఆనవాళ్లు, కాకతీయ ద్వికూటాలయం, శాసనం వెలుగుచూసిన అప్పాజీపేటలో మంగళవారం కొత్త తెలంగాణ చరిత్రబృందం సభ్యులు, సీనియర్ జర్నలిస్ట్ చిక్కుల యాదగిరి, మేక అశోక్ రెడ్డిలకు ఈ పురావస్తువు లభించింది. ఊరి చివర వడ్లవారిపాడులో దోమలపల్లి వెళ్లే రహదారి సమీపంలోని చెలకలో గుర్తించారు. దీనిపై కొత్త తెలంగాణ చరిత్ర బృందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ వివరిస్తూ.. కుండలు చేసేటప్పుడు లోపలివైపు పెట్టుకుని పైనుంచి చెక్కబద్దతో కొట్టి కుండకు ఆకారం ఇచ్చేందుకు ఈ కాల్చిన మట్టి డాబర్‌ను ఉపయోగిస్తారని, ఇది శాతవాహనుల పూర్వకాలానికి చెందినదని తెలిపారు. ఇటువంటి టెర్రకోట డాబర్లు ఇండోర్ ఖేరాలో లభించాయని, అవి క్రీ.పూ. 200 నుంచి క్రీ.శ.600 వరకు కాలానికి చెందినవని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో శాస్త్రీయ తవ్వకాలు జరిపితే మరిన్ని చారిత్రక ఆధారాలు లభించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.


## అమరుల ఆశయ సాధనకు పునరంకితమవుదాం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ సాయుధ పోరాటానికి అసలైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలోని అమరవీరుల స్థూపం వద్ద పార్టీ ఆధ్వర్యంలో వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నాడు తెలంగాణ రైతాంగం జరిపిన వీరోచిత సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే నిలిచిపోయిందని పేర్కొన్నారు. కొందరు స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను తీవ్రంగా వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. అమరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శులు అంజనపల్లి రామలింగం, పోలేపల్లి ఉదయకుమార్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి డి.లింగా నాయక్, మండల సమితి సభ్యులు గువ్వల మట్టయ్య, ఎస్కే షమీమ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## పేదలకు సిఎం రిలీఫ్‌ఫండ్ భరోసా

ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ గొప్ప భరోసా అని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో మంగళవారం సిఎం సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ నిర్వహించగా షబ్బీర్ అలీ ముఖ్యఅతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సిఎంఆర్ఎఫ్ వంటి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన ప్రతి కుటుంబానికి వాటి ప్ర యోజనాలు అందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల లలిత, నగేష్‌రెడ్డి, రామకృష్ణ, జావిద్ అక్రమ్, కరీం, రత్నాకర్, అహ్మద్, నయీమ్, పాపాఖాన్, జాఫర్ హుస్సేన్, వహీద్, ముజాహిద్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

## ఎఐఎస్ఎఫ్ 90వ.. వార్షికోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ఎఎస్ఎఫ్ 90 వ వార్షికోత్సవాల పోస్టర్‌ను ఏ.ఐ. యస్.యాఫ్. జిల్లా అధ్యక్షుడు ము న్సిఫ్ ఆవిష్కరించారుఈ సందర్భంగా మున్సిఫ్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో హనుమకొండలో ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం, విద్యారంగ పరిరక్షణ కోసం ఎఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలునిర్వహిస్తోందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను విజయవంతం చేయడానికి విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎప్ జిల్లా సంయుక్త కార్యదర్శి సంతోష్,ముక్రమ్,సమీర్,సాబీర్ పాల్గొన్నారు.

## గణేష్ మంటపాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ యూత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన నిత్యాన్నదాన కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి ప్రారంభించారు.ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంటపానికి విచ్చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కి యూత్ సభ్యులు సన్మానించారు. అన్నదాత కిషోర్‌ని, వార్డు సభ్యులు ప్రవీణ్ ని, ప్రతీ ఏటా విగ్రహ దాత లింగారెడ్డిని ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు.యువకులు ఎంతో ఉత్సాహంతో జరిపే వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా జరుపుకోవలన్నారు. అన్నదాన కార్యక్రమానికి ముందుకొచ్చిన కిషోర్‌కి ఆవిఘ్నేశ్వరుడు అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరుకున్నట్టు తెలిపారు. నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే.. పోస్టులు చేస్తే కఠిన చర్యలు

నిర్మల్ డిఎస్‌పి శ్రీనివాస్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాబోయే గణేష్ ఉత్సవాలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో, స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శా ఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందని నిర్మల్ డిఎస్‌పి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఎస్‌పి డా. జి. జానకి షర్మిల, ఐపిఎస్ ఆదేశాల మేరకు సోషల్ మీడియా వేదికలపై ప్ర త్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్ స్టాగ్రామ్, క్స్ (ట్విట్టర్), యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో మత వి ద్వేషాలను రెచ్చగొట్టేలా, ఇతర మతాల మనోభావాలను కించపరిచేలా లేదా ప్రజల మధ్య ఉద్రిక్తతలు సృష్టించేలా ఎలాంటి పోస్టులు, వీడియోలు, కామెంట్లు చే సినా చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా రెచ్చగొట్టే అభ్యంతరకరమైన సోషల్ మీడియా పోస్టులు కనిపిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

## గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** గర్భిణీ స్త్రీలపై డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం చేగుంటలోని పిహెచ్‌సి ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యం ఎలా అందుతుంది అని అడిగి తెలుసుకున్నారు. రూములు, మెడికల్ స్టోర్ ను, డాక్టర్ల సమయపాలన హాజరు పుస్తకాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ నెలలు నిండుతున్న గర్భిణీలపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హైరిస్కు కేసులను ఎలా పరిష్కరిస్తున్నారని, హైరిస్కు కేసుల విషయంలో జిల్లా ఆస్పత్రి నుంచి ట్యాగ్ చేయాలన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాలించాలని, ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట డాక్టర్లు వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పౌష్టికాహారంతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం



**ప్రజాపక్షం/మంచిర్యాల :** పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ ఎంతో ఆవశ్యకమని కార్పొరేటర్ శ్రీలక్ష్మి, సూపర్ వైజర్ జ్యోతి పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణంలోని గర్మిల్లా 2 అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహించారు.తల్లులు, సంరక్షకులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా లభిస్తున్న పౌష్టికాహార సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అంగన్వాడీ టీచర్ భూదేవి, గర్భిణులు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# 'చెన్నూర్' అభివృద్ధికి రూ.70 కోట్లు

రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్





**ప్రజాపక్షం/చెన్నూర్ :** చెన్నూర్ ను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని, 2027 గోదావరి పుష్కరాల కోసం పట్టణంలో రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. మంగళవారం చెన్నూర్‌లో పుష్కర ఘాట్ నిర్మాణానికి కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పుష్కరాల కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించిందని చెప్పారు. సుమారు రూ.8 కోట్లతో ఘాట్లు, స్నానపు గదులు, రహదారుల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. రూ.5.5 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని, షాపులు కోల్పోయిన పేదలకు ప్రత్యామ్నాయం కల్పిస్తామని తెలిపారు. అమృత్ పథకం కింద రూ.30 కోట్లు, పెద్ద చెరువు అభివృద్ధికి రూ.17 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. చెన్నూర్‌లో నిర్మించిన 100 పడకల ఆసుపత్రిని ఈ నెలలోనే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.బొక్కలగూడెంలో రూ.30 లక్షలతో నిర్మించే గౌడ సంఘం భవనానికి భూమిపూజ చేశారు.మండలం రామకృష్ణాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో విద్యార్థులకు కలెక్టర్‌తో కలిసి మంత్రి కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు డిఎంఎఫ్‌టి నిధుల ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్నామని, సోమనపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణం చేపట్టనున్నామని కలెక్టర్ తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారి విష్ణు, తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, చైర్ పర్సన్ పద్మ, సంస్థ ప్రతినిధి పి. నారాయణ పాల్గొన్నారు.

## ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు చదువు నేర్పాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువు నేర్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.మంగళవారం ముధోల్ కేజీబీవీను (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వసతి పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు.అన్ని తరగతులకు సంబంధించిన సిలబస్ ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ప్రతి రోజు విద్యార్థులు,ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల బోర్డు పరీక్షలకు ఇప్పటినుంచే ప్రణాళిక ప్రకారం వారిని సిద్ధం చేయాలన్నారు.ఈ తనిఖీలో డీఈవో భోజన్న,తహసిల్దార్ శ్రీలత, ఎంపీడీవో లవ కుమార్,ఇతర అధికారులు, సిబ్బంది,పాల్గొన్నారు.

## టిఎంసిపై బదిలీ వేటు




**ప్రజాపక్షం/చెన్నూరు :** చెన్నూరు టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ (టిఎంసి)పై ఎట్టకేలకు బదిలీ వేటు పడింది. మహిళల పట్ల వేధింపులకు పాల్పడుతూ అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు మహిళా సంఘాల సభ్యులు, ఆర్పీల సమాచారంతో ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికా ర యంత్రాంగం స్పందించింది. మంగళవారం సదరు టీఎంసీని లక్షెట్టిపేట ము న్సిపాలిటీకి బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీపై పలువురు హర్షం వ్యక్తం చేస్తుండగా మరికొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తి ంచినట్లు ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఉద్యోగం నుంచి తొలగించకుం కేవలం బదిలీ చేసి చేతులు దులుపుకున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని దాటింది

శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో మంగళవారం జిల్లా మంత్రి ధనసరిసీతక్క పర్యటించారు. మండల కేంద్రంలోని వీక్లి మార్కెట్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు. మహిళా సాధికారతపై మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అధికారంలోకి వచ్చి 1000 రోజుల మైలురాయిని విజయవంతంగా పూర్తి చేసుకుందన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ మండల కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ (సీతక్క) ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. మహిళలనుఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లాలో రూ.5 నుండి 7 కోట్లతో మహిళా భవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు (ఐకెపి) కేంద్రాల్లో 40 శాతం మహిళా సంఘాలకే కేటాయించడమే కాకుండా 8 ఇందిరా మహిళా శక్తి ద్వారా క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి బాధ్యతలను మహిళలకే అప్పగిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు రుణాల విషయంలో అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.70 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రతి గ్రూప్‌కు రూ.10 లక్షల వరకు అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఒంటరి మహిళలను గుర్తించే బాధ్యతను మహిళా సంఘాలకే ఇస్తూ పెన్షన్లు అందిస్తామన్నారు. ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రజ లు హర్షిస్తుంటే ప్రతిపక్షాలు కావలని ఉచిత బస్సు ల్లో మహిళలు గొడవ పడుతున్నారంటూ వీడియో లు తీసి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వారిపురోగతిని అడ్డుకోవడమే వారి విధానమని విమర్శించారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శం

సిపిఐ కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్‌రావు



**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటము నిస్వార్థంగా చేసిన పోరాటం అని సాయుధ పోరాట చరిత్రను పాఠ్యంశాలలో చేర్చి భావి తరాలకు అందించాల్సిన అవసరం ఉన్నదని తెలంగాణ రైతాంగ సా యుధ పోరాట నేటి తరానికి ఆదర్శమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులువి. ప్రకాశ్‌రావు అన్నారు. నైజాం నవాబ్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా భూమి కోసం ,భుక్తి కోసం, వెట్టిచాకరి నుండి విముక్తి కోసం 1946 నుండి 1961 వరకు చారిత్రాత్మకమైన పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిదని అన్నారు. 225 సంవత్సరాలు పాటు హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం నవాబు పరిపాలన చేసినారని మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలో హైదారాబాద్ సంస్థానంలోని ప్రజలపై వేదింపులు ,పన్నులపై ప న్ను లు వేసినారని మహిళలను చిత్ర హింసలకు గురి చేసినారని ఆయన అన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదని ఆయన అన్నారు. 4000 మంది కమ్యూనిస్టులు ఆ పోరాటంలో ప్రాణాలు కోల్పోయినారని ఆయన అన్నారు. 3వేల గ్రామాల్లో స్వయం పాలన ఏర్పాటు చేసుకున్నారని ,వెట్టి చాకరికి వ్యతిరేకంగా పోరాడినారని ఆయన అన్నారు.సిపిఐ కార్యదర్శి సయ్యద్ జలల్ రెహమాన్ ,తాజోద్దీన్ ,షఫీ, విష్ణు, శంకరప్ప, పాండు సాదిక్ అలీ ,బుజ్జమ్మ , గంగమ్మ, సత్యమ్మ , పూలమ్మ, లడ్డు లక్ష్మి సరస్వతి ,సంగీత తదితరులు పాల్గొన్నారు.

## రేగోడు పాఠశాలలోచోరీ క్వింటాల్ బియ్యం మాయం



**ప్రజాపక్షం/రేగోడు:** వరుసగా మూడు రోజులు సెలవు ఉండడంతో పాఠశాల గదికి తాళం పగలగొట్టి బియ్యం అపహరించిన సంఘటన రేగోడులో సోమవారం బయటపడింది. రేగోడు ప్రాథమిక పాఠశాలలో ఈనెల 11న బియ్యం స్టాక్ ఉండగా సోమవారం బియ్యం స్టాక్‌లో తక్కువగా ఉండడంతో క్వింటాల్ బియ్యం అపహరణకు గురైనట్లు గుర్తించారు పాఠశాల గది తాళం పాలుగొట్టి ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించిన ఇన్చార్జి హెచ్ఎం స్రవంతి పోలీసులకు, ఎంఈఓ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం లకు ఫిర్యాదు చేశారు.

## రోగులకు మెరుగైన సంరక్షణ అందించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్

**ప్రజాపక్షం / నస్పూర్ :** దవాఖానాలకు వచ్చే రోగులకు వైద్య సిబ్బంది సత్వరమే స్పందించి సరైన పరీక్షలు చేస్తూ మెరుగైన సంరక్షణ అందించాలని ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, నస్పూర్ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ రోగి భద్రత దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా అసంక్రమణ వ్యాధులను ముందస్తుగా గుర్తించి, క్రమం తప్పకుండా మందులు వాడేలా చైతన్యం తీసుకురావాలన్నారు. ఆసుపత్రులలో రోగులకు తాగునీరు, కూర్చునే సదుపాయం, స్ట్రెచర్, వీల్ చైర్ వంటి సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. రోగులు సైతం వైద్యుల సలహాలు పాటిస్తూ సమయానికి మందులు వేసుకోవాలని కోరారు.

## 'నిర్మల్' కొయ్య బొమ్మల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

● పొనికి చెట్ల పెంపకానికి ప్రోత్సాహం ● పుష్కరాల్లో విక్రయాలు, ప్రదర్శనకు స్టాళ్లు ● కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ కొయ్య బొ మ్మల కళను పరిరక్షిస్తూ, కళాకారులకు ప్రోత్సా హం అందించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు.మంగళవారం నిర్మల్ పట్టణంలోని కొయ్య బొమ్మల ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కొయ్య బొమ్మల చరిత్ర, తయారీ విధానం,మార్కెటింగ్, కళాకారుల పరిస్థితి, పొనికి కర్ర లభ్యత తదితర అంశాలపై నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్మల్ కొయ్య బొమ్మలకు దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కళ ద్వారా నిర్మల్ జిల్లాకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందని, తరతరాలుగా కొనసాగుతున్న ఈ కళను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బొమ్మల తయారీకి ప్రధానంగా ఉపయోగించే పొనికి చెట్ల పెంపకానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. బాసరలో రానున్న గోదావరి పుష్కరాల సందర్భం గా కొయ్య బొమ్మల ప్రదర్శన,విక్రయాల కోసం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీపీవో శ్రీనివాస్,డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, తహసీల్దార్ రాజు,అధికారులు, నిర్వాహకులు,సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు వేదికలకు తాళాలు.. ప్రైవేట్ వ్యక్తులతో పంటల సర్వేలు!

● రూ. లక్షల నిధులతో నిర్మించినా నెరవేరని ప్రభుత్వ లక్ష్యం ● యూరియా సరఫరాలోనూ పర్యవేక్షణ లోపం.. రోడ్డెక్కుతున్న రైతాంగం



**ప్రజాపక్షం/నిర్మల్ :** రైతు సంక్షేమమే ధ్యేయంగా,వ్యవసాయాన్ని పండుగ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన (ఉత్కృష్ట) మిక్కిలి శ్రేష్ఠమైన కార్యక్రమాలు క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం వల్ల నిర్వీర్యమవుతున్నాయి. సాగు పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి, రైతులకు వేగవంతమైన సేవలు అందించడానికి నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉమ్మడి మండలాల ప్రాతిపదికన ప్రతి మండలానికి 6 నుంచి 7 రైతు వేదిక భవనాలను ప్రభుత్వం నిర్మించింది. ప్రతి క్లస్టర్ పరిధిలో నాలుగైదు వేల ఎకరాల విస్తీర్ణానికి ఒక వ్యవసాయ విస్తీర్ణాధికారి (ఎఇఒ)ని నియమించి, ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించింది. గతంలో కార్యాలయాలు లేక, సరైన సౌకర్యాలు లేక అధికారులు ఇబ్బందులు పడ్డారనే ఉద్దేశంతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి అధునాతన భవనాలను అందుబాటులోకి తెచ్చింది. కానీ భవనాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా అధికారుల తీరులో మాత్రం ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం.మండలాల్లోని మెజారిటీ రైతు వేదికలు నిత్యం తాళాలు వేసే దర్శనమిస్తున్నాయి. అధికారులు ఏ సమయంలో రైతు వేదికలకు వస్తున్నారో, ఎప్పుడు వెళ్లిపోతున్నారో ఎవరికీ తెలియని దుస్థితి నెలకొంది. చుట్టపు చూపుగా వచ్చి పట్టికల్లో సంతకాలు చేసి వెళ్లడమే తప్ప, రైతు వేదికల్లో కూర్చుని రైతు సమస్యలు తెలుసుకోవడం కానీ, పంట మార్పిడి విధానాలపై అవగాహన కల్పించడం కానీ చేయడం లేదని జిల్లా రైతాంగం తీవ్రంగా విమర్శిస్తోంది. పొలాల్లో పంటలకు చీడపీడలు ఆశిస్తే ఏఈఓలు క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించిన దాఖలాలు కరువయ్యాయని రైతులు వాపోతున్నారు.

### బాధ్యతారాహిత్యం

### ప్రైవేట్ యువకులతో సర్వేల నిర్వహణ!

ప్రస్తుతం వానాకాలం పంటల నమోదు ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. వ్యవసాయ శాఖ అధికారులు స్వయంగా ప్రతి రైతు పొలానికి వెళ్లి, పంట రకం, సర్వే నంబర్, విస్తీర్ణాన్ని పక్కాగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రైతు భరోసా, మద్దతు ధర ఇతర సంక్షే మ పథకాలు తమకు అందకుండా పోతాయని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల బద్ధకం వల్ల తాము శాశ్వతంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

**ఎరువుల కొరతతో రోడ్డెక్కుతున్న రైతన్నలు :** మరోవైపు సాగు కాలంలో రైతులకు అత్యంత కీలకమైన యూరియా, ఇతర ఎరువుల పంపిణీలోనూ వ్యవసాయ శాఖ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. క్లస్టర్ల వారీగా పం ట ల అవసరాలను అంచనా వేసి ఎరువుల సరఫరాను పర్యవేక్షించాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు లేకపోవడంతో జిల్లాలో యూరియా కొరత తీవ్రమవుతోంది. దీంతో ఎరువుల కోసం రైతులు గంటల తరబడి సమ్మేళన కేంద్రాల ముందు నిలబడాల్సి వస్తోంది. పలు కేంద్రాల్లో ప్రధాన రహదారులపై బైఠాయి ంచి ధర్నాలు నిర్వహించే వరకు పరిస్థితి దాటింది.కోట్ల రూపాయల ప్రజాధనంతో ఏర్పాటైన రైతు వేదికలు ఉపయోగపడకుండా పోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంపై రైతాంగం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది.జిల్లా కలెక్టర్ మరియు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ప్రైవేట్ వ్యక్తులతో సర్వేలు చేయిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అధికారులు నిత్యం రైతు వేదికల్లో అందుబాటులో ఉండేలా జారీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## పకడ్బందీగా బాల్య వివాహాల చట్టాన్ని అమలు చేయాలి

కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** బాల్య వివాహాల నివారణకు, లైంగిక నేరాల నుంచి బాలలను రక్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మిషన్ వాత్సల్య కింద బాల్య వివాహాల నిషేధిత చట్టం, పోక్సో చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ, మండల స్థాయి కమిటీలలో మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలన్నారు. డిపిఒ బిక్షపతి, డిఇఓ సచ్చిదానంద చారి, డిసిపిఒ మహేష్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘ అమృత గాత్రంతో ప్రపంచవ్యాప్తంగా శ్రోతలను దశాబ్దాల పాటు ఉర్రూతలూగించిన సంగీత సామ్రాజ్ఞి, గాయని భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి జీవిత చరిత్రను సినిమాగా రూపొందించే ప్రయత్నం ప్రారంభించారు. ఈ ప్రెస్టీజియస్ మూవీలో ఎంఎస్ సుబ్బలక్ష్మిగా రశ్మిక మందన్న నటిస్తున్నారు. ’

రీల్

# ‘ఎంఎస్ సుబ్బలక్ష్మి’గా రష్మిక



అమృత గాత్రంతో ప్రపంచవ్యాప్తంగా శ్రోతలను దశాబ్దాల పాటు ఉర్రూతలూగించిన సంగీత సామ్రాజ్ఞి, గాయని భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి జీవిత చరిత్రను సినిమాగా రూపొందించే ప్రయత్నం ప్రారంభించారు. నిర్మాతలు అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేష్, బన్నీ వాస్ సంయుక్తంగా ఈ ప్రెస్టీజియస్ మూవీలో ఎంఎస్ సుబ్బలక్ష్మి గా రశ్మిక మందన్న నటిస్తున్నారు. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఎంఎస్ సుబ్బలక్ష్మి 110వ జన్మదినోత్సవం సందర్భంగా ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ను ప్రకటించారు. చెన్నైలోని మ్యూజిక్ అకాడెమీ వేదికగా ఈ చిత్ర అనౌన్స్ మెంట్ ఘనంగా చేశారు.తన నట ప్రతిభతో దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకున్న హీరోయిన్ రశ్మిక మందన్న ఎంఎస్ సుబ్బలక్ష్మి పాత్రకు ప్రాణం పోసి, ఆ పాత్రలో జీవించబోతున్నారు. ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్ అనౌన్స్‌మెంట్ సంగీత ప్రియుల్లో ఆనందాన్ని నింపుతోంది. వరల్డ్ క్లాస్ మేకింగ్, హై టెక్నికల్ వ్యాల్యూస్‌తో ఈ సినిమా త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.



## ‘కమల రెడ్డి’గా రమ్యకృష్ణ

మంచు మనోజ్ నటిస్తున్న కొత్త సినిమా ‘డేవిడ్ రెడ్డి’. ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్‌పై వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమ రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్‌తో యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా డేవిడ్ రెడ్డి సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో మారియా ర్యాబోషప్క హీరోయిన్ గా నటిస్తోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాలో నటి రమ్యకృష్ణ ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఇందులో రమ్యకృష్ణ పాత్ర పేరు కమల రెడ్డి. నటి రమ్యకృష్ణ బర్త్ డే సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ‘డేవిడ్ రెడ్డి’ సినిమా నుంచి ఆమె బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సినిమాలో రమ్యకృష్ణ కమల రెడ్డి పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనున్నారు. ఈ పోస్టర్ లో ఆమె ఖడ్గంతో శత్రువులను తుదముట్టించి తన ఆసనంపై కూర్చుని ఫెరోషియస్ లుక్ లో ఆకట్టుకుంటున్నారు. రమ్యకృష్ణ కెరీర్ లో కమల రెడ్డి పాత్ర ఒక ఐకానిక్ క్యారెక్టర్ గా గుర్తుండిపోనుంది. మంచు మనోజ్, మరియా ర్యబోషప్క, రమ్యకృష్ణ, ఆర్. పార్తీబన్, కాంచన, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డిఒపి ఆచార్య వేణు, మ్యూజిక్ రవి బస్రూర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కొట్టు రవికుమార్.

# ‘ఫ్యామిలీ ప్యాక్’తో వస్తున్న శ్రీవిష్ణు




కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు తనకు బాగా సూటయ్యే కథలను ఎంచుకుంటూ తన అద్భుతమైన కామిక్ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరిస్తుంటారు. తాజాగా మరో ఆసక్తికరమైన ఎంటర్‌టైనర్‌తో వస్తున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ‘ఫ్యామిలీ ప్యాక్’ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ చిత్రం తెరకెక్కుతోంది. నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తుండగా, అనిల్ యెర్నేని సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ‘సామజవరగమన’ తర్వాత శ్రీ విష్ణు, రామ్ అబ్బరాజు కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. రామ్ అబ్బరాజు గత బ్లాక్‌బస్టర్ నారి నారి నడుమ మురారి’లో శ్రీ విష్ణు క్యామియో రోల్‌లో కనిపించారు. ఈ సినిమాలో శ్రీ విష్ణు సరసన సాక్షి మధోల్కర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ‘ఫ్యామిలీ ప్యాక్’ అనే హ్యూమరస్ టైటిల్‌తోనే సినిమా ఎలాంటి ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించబోతుందో ప్రజెంట్ చేశారు. ఫస్ట్ లుక్‌లో శ్రీ విష్ణు కలర్ ఫుల్ మల్టీ స్టోరీ ఇంటీరియర్‌లోపై నుంచి కిందికి పడుతూ కనిపిస్తున్నారు. చేతులు చాచి, షాక్ అయిన ఎక్స్‌ప్రెషన్‌తో ఆయన కనిపిస్తుండగా.. వివిధ అంతస్తుల్లో నరేష్ వీకే, అభిరామి, సాక్షి మధోల్కర్ సహా పలువురు కుటుంబ సభ్యులు నిలబడి కింద జరుగుతున్న వింత పరిస్థితిని చూస్తున్నారు. చుట్టూ ఎగురుతున్న కరెన్సీ నోట్లు పోస్టర్‌లోని హ్యూమర్‌ని మరింత పెంచుతున్నాయి. ఈ చిత్రానికి జె. యువరాజ్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీతం సమకూరుస్తున్నారు. అనిల్ పసాల ఎడిటర్‌గా, బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. రచయితలు భాను భోగవరపు, నందు సావరిగాన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. ‘ఫ్యామిలీ ప్యాక్’ పండగ సీజన్‌లో ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు వచ్చే ఏడాది సంక్రాంతికి సిద్ధమవుతోంది.

## 25న ‘ప్రేమనే ఊరిలో’ విడుదల



మహారత్న ప్రొడక్షన్స్, ఎస్‌కె పిక్చర్స్, వనిల్లా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా నిర్మించిన చిత్రం ‘ప్రేమనే ఊరిలో’. ఈ సినిమాకి మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివ, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేయగా అందరిలోనూ ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసింది. అలాగే తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన పాటలు ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ పొందాయి. 25న ఈ సినిమా థియేటర్స్ లో విడుదలకు సిద్ధమైంది. కెజిఎఫ్ , కాంతారా వంటి చిత్రాలకు డైలాగ్స్ అందించిన హనుమాన్ చౌదరి ఈ చిత్రానికి సంభాషణలు రాశారు. ప్రముఖ గేయ రచయిత రాంబాబు గోసాల పాటలను రచించారు. సునద్ గౌతమ్ సంగీతం అందిస్తుండగా, రాజ్‌కాంత్ ఎస్.కె సినిమాటోగ్రఫీ, హర్షిత్ ప్రభు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# ‘లీసా’కు మణిశర్మ సంగీతం




ఓం సాయిరామ్ ఆర్ట్స్, ఐరాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై వెంకట్ దుగ్గిరెడ్డి, రామకృష్ణ ఐల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ‘లీసా’. విలక్షణమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రతిభావంతురాలైన నటి అనన్య నాగళ్ల ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. జవహర్ పవార్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు రాని విధంగా రెండు భిన్నమైన జోనర్లను సరికొత్త పద్ధతిలో మేళవించి ‘లీసా’ కథను రూపొందించారు. తాజాగా ఈ సినిమా టీమ్ లో జాయిన్ అయ్యారు మెలొడీ బ్రహ్మ మణిశర్మ. స్క్రిప్ట్ విని ఇంప్రెస్ అయిన మణిశర్మ ఈ చిత్రానికి సంగీత దర్శకత్వ బాధ్యతలు వహించేందుకు ముందుకొచ్చారు. ఆయన మ్యూజిక్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. సతీష్ రెడ్డి మాసం ఈ చిత్రానికి కెమెరా బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు స్క్రీన్‌ప్లే సమకూర్చి, సహ నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. ‘ఎస్సార్ కళ్యాణమండపం’ దర్శకుడు శ్రీధర్ గాదె ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. పులి రాకేష్ గౌడ్ కె.నరసింహులు, బనడ్ల శ్రీపతి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ‘లీసా’ సినిమా నవంబర్ లో థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.అనన్య నాగళ్ల, అల్లాల రవిరెడ్డి గారు, సుమన్, మూసా అలీ ఖాన్, రత్నాకర్ రెడ్డి, జబర్దస్త్ సత్యశ్రీ, గడ్డం నవీన్, ఆకెళ్ల, రవిరెడ్డి, స్వప్న చౌదరి, గోపీ కార్తికేయ, సుజాత, సుజి, మానస, శ్యామ్, వెన్ని, జాను వర్మ, కనకం వెంకట్, బేబీ ట్వింకిల్, హనుశ్రీ తదితరులు నటిస్తున్నారు.

# హాస్యభరితంగా ‘అనుమాన పక్షి’



డిజె టిల్లు’తో దర్శకుడిగా తనదైన ముద్ర వేసిన విమల్ కృష్ణ.. మరో ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘అనుమాన పక్షి’. రాగ్ మయూర్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా హ్యూమర్, క్యారెక్టర్స్, కథనంలో పూర్తిగా డిఫరెంట్ గా ఉండబోతోంది. చిలక ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ చిలక, రాజేష్ జగ్తియాని, హిరాచంద్ దండ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమా 18న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో హీరో సిద్ధు జొన్నలగడ్డ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ప్రతి విషయాన్నీ అతిగా ఆలోచించే సన్నీ.. తన చుట్టూ జరిగే దాదాపు ప్రతిదాంట్లోనూ ఏదో అనుమానాస్పదమైన విషయం ఉందని భావిస్తుంటాడు. కశ్మీర్ వెళ్లిన తర్వాత ఓ అమ్మాయిని కలుసుకుంటాడు. ఆమెతో పరిచయం క్రమంగా ప్రేమగా మారుతుంది. మరోవైపు ఓ పోలీస్ ఆఫీసర్ సన్నీని వెంటాడటం మొదలుపెడతాడు. అసలు కశ్మీర్‌లో ఏం జరిగింది? ఆ పోలీస్ సన్నీని ఎందుకు వెంటాడుతున్నాడు? అనేదే కథలో కీలకాంశం.అజయ్, రాశి, ప్రిన్స్ సిసిల్, అనన్యా, చరిత్, బ్రహ్మాజీ తదితరులు తమ పాత్రల్లో ఆకట్టుకున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా సునీల్ కుమార్ నామా, శ్రీచరణ్ పాకాల తన సంగీతం, . జెకె మూర్తి ఆర్ట్ డైరెక్టర్‌గా, చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

# పంతాలకు పోవద్దు.. పదోన్నతులు కోల్పోవద్దు!

- కేసులు ఉపసంహరించుకుంటే 37 మందికి వెంటనే అదనపు ఎస్‌పిలుగా ప్రమోషన్లు
- సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తా: డిజిపి సి.వి. ఆనంద్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డిఎస్‌పిల పదోన్నతుల వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశం ఏర్పడింది. కోర్టు కేసులతో పదోన్నతుల ప్రక్రియకు ఆటంకం కలుగుతున్న నేపథ్యంలో పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దని 1991, 1995, 1996 బ్యాచ్‌ల డిఎస్‌పిలకు డిజిపి సి.వి. ఆనంద్ సూచించారు. సమస్య పరిష్కారానికి తాను ముందుండి చొరవ తీసుకుంటానని, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ మూడు బ్యాచ్‌లకు చెందిన 37 మంది డిఎస్‌పిలకు అదనపు ఎస్‌పిలుగా పదోన్నతులు రావాల్సి ఉంది. అయితే పదోన్నతుల విషయంలో కొందరు అధికారులు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో ప్రక్రియ కొంతకాలంగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో డిజిపి సి.వి. ఆనంద్ స్వయంగా చొరవ తీసుకుని డిజిపి కార్యాలయంలో ఆయా బ్యాచ్‌ల అధికారులతో సమావేశమయ్యారు. కేసుల విషయంలో నిర్ణయం తీసుకునేందుకు అధికారులకు వారం రోజుల సమయం ఇచ్చారు.

**‘కేసులు వేసుకుని నష్టపోవద్దు’..**

కోర్టు కేసుల కారణంగానే పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగడం లేదని డిజిపి వివరించారు. కేసులు వేసుకుని నష్టపోవద్దు. మీ సమస్య పరిష్కారానికి నేను ముందుంటా. అందరూ సహకరిస్తే త్వరగా పదోన్నతులు కల్పించవచ్చు అని ఆయన సూచించారు. ప్రస్తుతం ఉన్న 37 అదనపు ఎస్‌పి ఖాళీలకు వెంటనే పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డిజిపితో సమావేశం అనంతరం వరంగల్ జోన్‌కు చెందిన 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులు తాము కోర్టుల్లో దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు డిజిపికి లేఖ అందించారు. హైదరాబాద్ సిటీకి చెందిన ఆయా బ్యాచ్‌ల అధికారులు కూడా కేసుల ఉపసంహరణకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డిఎస్‌పిల నుంచి అదనపు ఎస్‌పిలుగా పదోన్నతుల అంశం పరిష్కార దిశగా కదిలింది. డిజిపి సి.వి. ఆనంద్ ప్రత్యేక చొరవతో సమస్యకు పరిష్కారం లభించే అవకాశాలు ఏర్పడటంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు. పదోన్నతుల ప్రక్రియ త్వరగా పూర్తయితే అర్హులైన అధికారులకు ప్రయోజనం కలగడంతో పాటు పోలీసు శాఖలో ఉన్నతస్థాయి ఖాళీల భర్తీకి కూడా మార్గం సుగమం కానుంది.

# లొంగిపోయిన మావోయిస్టు సుశీలా రాణి

5రూ.లక్షల చెక్కు
25రూ. వేల తక్షణ ఆర్థిక సాయం




**ప్రజాపక్షం/నిజామాబాద్:** మావోయిస్టు కమిటీ సభ్యురాలు నక్క సుశీలా అలియాస్ రాణి అలియాస్ లత లలిత రేలా జ్యోతి అలియాస్ మాధవి అలియాస్ శ్వేత నిజామాబాద్ పోలీసుల సమక్షంలో లొంగిపోయారు. నక్కసుశీల అలియాస్ రాణి లొంగిపోవటం మావోయిస్టు పార్టీకి ఎదురు దెబ్బ అని సిపి పేర్కొన్నారు. ఈ మేరకు సిపి సాయిచైతన్య మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మావోయిస్టు ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యురాలు, డీవీసీ ఛత్తీస్‌గఢ్ ఏరియాసభ్యురాలైన నక్క సుశీలా బోధన్‌లోని శక్కర్‌నగర్ స్వస్థలం కాగా ఆమె తండ్రి నిజాంషుగర్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్ పని చేసేవారని అక్టోబర్ 2005లో ఆయన గుండెపోటుతో మరణించారన్నారు. సుశీలా చిన్నప్పుడే తల్లి కమల అనారోగ్యంతో మృతి చెందింది. సుశీల 1985 లో హైదరాబాద్‌లోని నారాయణగూడలో మాడపాటి హన్మంతరావు బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న తరుణంలో ఆమెకు బంధువైన సురేంద్ర ద్వారా దివంగత రామ్మోహన్‌రావు పరిచయమయ్యారు. ఆయన సిపిఐ ఎంఎల్‌పిడబ్ల్యు సిద్ధాంతాలు కలిగి ఉండటంతో సుశీల ఆకర్షితురాలైంది. ఆమె 1990లో నల్గొండ జిల్లా కమిటీ ఎసిఎం అయిన సుంకర రామ్మోహన్‌రావు వివాహం చేసుకున్నారు. ఫిబ్రవరి 1992లో సిపిఐఎంఎల్ పిడబ్ల్యులో చేరారు. 2001లో నల్లమల్ల అడవిలో జరిగిన ఎదురు కాల్పుల్లో రామ్మోహన్‌రావు మరణించారు. ఆ తర్వాత 2004లో ఆమె ఎస్‌సిఎం సామలును వివాహం చేసుకున్నారు. ఛత్తీస్‌గడ్ అటవీ ప్రాంతంలో 2006లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆయన మరణించారన్నారు. తెలంగాణకు చెందిన అజ్ఞాత మావోయిస్టు కార్యకర్తలందరూ జనజీవన స్రవంతిలో చేరాలని ప్రభుత్వం చేసిన సూచన మేరకు నక్క సుశీలా సైతం జనజీవన స్రవంతిలో కలిసినట్లు సిపి వెల్లడించారు. 5 రూ.లక్షల చెక్కు, 25 రూ.వేల తక్షణ ఆర్థిక సాయమందించినట్లు తెలిపారు.

## చరిత్ర వెలికితీయాలి

(మొదటి పేజీ తరువాయి)

మహిళల చరిత్రను వెలుగులోకి తీసుకురావాలన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో ‘తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంమహిళల పాత్ర’ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్ పావని అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్య అతిథిగా రచయిత డాక్టర్ శ్రీదేవి , రచయిత కొండపల్లి నిహారిక, ఆరుట్ల సుశీలమ్మ, ఎఐటియుసి జాతీయ నాయకురాలు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి , తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి, కోశాధికారి రావి ప్రతిభ, అవదేశ్ రాణి, రచయిత విమల, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి, కార్యదర్శి పైమిదా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ సాయుధ పోరాట కాలంలో స్త్రీలు బయటకు రావడమే ఒక వీరోచిత ఘట్టమని పేర్కొన్నారు. అవిద్య, మూఢ నమ్మకాలు, వివక్ష, సామాజిక ఆంక్షలను అధిగమించి మహిళలు ఆయుధ శిక్షణ తీసుకోవడంతో పాటు కొరియర్లుగా, ఆరోగ్య సేవకులుగా, ప్రచారకులుగా పనిచేశారని తెలిపారు. వీరబైరాన్‌పల్లి, మల్లారెడ్డిగూడెం వంటి ప్రాంతాల్లో మహిళలు సమూహాలుగా రజాకార్లను ఎదిరించి పోరాడారని చెప్పారు. కాసర్ల కమలమ్మ, కట్కూరి సుశీలమ్మ, కొండవీటి ఇందిరమ్మ, కొమ్మిడి సుగుణమ్మ, గంగసాని ఆండాలమ్మ, చకిలం లలితాదేవి, మంగళపల్లి రాములమ్మ తదితర మహిళల సాహసగాథలు కూడా వెలుగులోకి రావాల్సి ఉందన్నారు. గంగసాని ఆండాలమ్మ మహారాష్ట్రకు వెళ్లి ఉద్యమానికి అవసరమైన ఆయుధాలను సేకరించారని, కొమ్మిడి సుగుణమ్మ కొరియర్‌గా ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొన్నారని వివరించారు. అమరవీరుల ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా పోరాట యోధుల జయంతి, వర్ధంతులను వారి స్వగ్రామాల్లో నిర్వహించి వారి చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రీదేవి సూచించారు. నిహారిక మాట్లాడుతూ మహిళలు ఆకాశంలో సగం కాదని, ఆకాశమే మహిళలని, వారు తలచుకుంటే సాధించలేనిది ఏమి లేదన్నారు. ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. అవదేశ్ రాణి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగా సాయుధ పోరాటంలో ముస్లిం మహిళల పాత్రం అనిర్వచనీయమన్నారు. విమల మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ఏలాంటి సంబంధం లేని బిజెపి నేతలు ఆ చరిత్రను వక్రీకరిస్తూ సభలు , సమావేశాలు నిర్వహిస్తున్నారని, ఈ వక్రీకరణను కమ్యూనిస్టు పార్టీలన్ని ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. ప్రేమ్ పావని అధ్యక్షోపన్యాసం చేస్తూ తెలంగాణ సాయుధ పోరాటం జరిగి 78 ఏళ్లు గడిచినా భూమి, విముక్తి కోసం ప్రజలు ఇప్పటికీ పోరాడుతూనే ఉన్నామన్నారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ చరిత్రలో అనాదిగా మహిళలకు అన్యాయం జరుగుతూనే ఉందని, చరిత్రలో పురుషుల కథనాలకే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోందన్నారు. ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలు చేసిన త్యాగాలు, వీరోచిత పోరాటాలు చరిత్రలో తగిన స్థాయిలో నమోదు కాలేదన్నారు. ‘హిస్ స్టోరీ’తో పాటు ‘హర్ స్టోరీ’ కూడా చరిత్రలో భాగం అయ్యేలా మహళలు కృషి చేయాలన్నారు. జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలు చూపిన పోరాట స్ఫూర్తి, త్యాగం మరవలేనిన్నారు. నిజాం, రజాకార్లు, దొరల గూండాలు మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడినా వెరవకుండా వీరోచితంగా పోరాడారన్నారు. ఉద్యమంలో పాల్గొన్న పురుషులను తమ కడుపులో పెట్టుకుని బిడ్డల్లా కాపాడుకుంటూ, సహచరులుగా, కూతుర్లుగా, తల్లులుగా మహిళలు అందించిన సహకారం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మహిళల త్యాగాలు మరవలేవన్నారు. పల్లెలపై తెగబడిన రజకార్లు, పోలీసులను చేతికిందిన వస్తువునే ఆయుధంగా చేసుకుని ఎదురొడ్డి నిలిచిన వీరమాతలని కొనియడారు. తులత సదస్సుకు సదస్సుకు ఛాయాదేవి స్వాగతం పలికారు.

## 2 లక్షల ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. పేదల కోసం రెండు కోట్ల ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంలో భాగంగా, తెలుగు రాష్ట్రాలకు ఐదు లక్షల ఇళ్లను కేటాయించారు. గతంలో తెలంగాణలో అధికారంలో ఉన్న పార్టీ ఈ పథకాన్ని తిరస్కరించడం వల్ల ‘ప్రధాన మంత్రి ఆవాస్ యోజన’ ప్రారంభమైనప్పటి నుండి రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ఇళ్లు కేటాయించబడలేదు. అయితే, ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా, ప్రస్తుత ప్రభుత్వం చేసిన అభ్యర్థన మేరకు, ఈ పథకం కింద తెలంగాణలో రెండు లక్షల ఇళ్లను నిర్మించనున్నారు. అదే విధంగా 2019–24 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌కు 1,78,000 ఇళ్లు కేటాయించగా, అందులో కేవలం 42,000 ఇళ్లు మాత్రమే నిర్మితమయ్యాయి, మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయి. కాగా, తాజాగా రాష్ట్రానికి మరో 1,22,000 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిని రెండు నుండి మూడు సంవత్సరాల వ్యవధిలో పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ‘ప్రధాన మంత్రి ఆవాస్ యోజన’ పథకం కింద, ప్రతి లబ్ధిదారునికి కేంద్రం నుండి రూ. 1.20 లక్షల ఆర్థిక సహాయం లభిస్తుంది. ఇతర పథకాలతో కలిపి వారికి మొత్తం రూ. 1.70 లక్షల నుండి రూ. 1.80 లక్షల వరకు ప్రయోజనాలు అందుతాయి. ‘స్వచ్ఛ భారత్ అభియాన్’ పథకం కింద, ఇంటి నిర్మాణంతో పాటు మరుగుదొడ్డి నిర్మాణానికి లబ్ధిదారులకు అదనంగా రూ. 12,000 లభిస్తాయి. పేదలకు మరింత సహాయం చేయడానికి, కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రోత్సహించడానికి, మద్దతు ఇవ్వడానికి అనేక చర్యలు చేపట్టింది. ఇటీవల, కేంద్రం ఈ పథకానికి సంబంధించిన అర్హత ప్రమాణాలను సడలించింది. దీని ప్రకారం, కుటుంబ నెలవారీ ఆదాయం రూ. 15,000 కంటే తక్కువగా ఉండాలి; ఇంతకుముందు ఈ పరిమితి రూ. 10,000గా ఉండేది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే వ్యక్తి బైక్ లేదా రిఫ్రిజిరేటర్ వంటి వ్యక్తిగత వస్తువులను కలిగి ఉండటం వల్ల అనర్హులు కారని కేంద్రం స్పష్టం చేసింది. దీనివల్ల దిగువ తరగతి వర్గాలలోని చాలా మందికి ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. సామాన్య ప్రజలకు సౌకర్యం కల్పించడానికి ప్రవేశపెట్టిన స్వీయ సర్వే సదుపాయంతో పాటు, లబ్ధిదారులను ఎంపిక చేసే జియోట్యాగింగ్ ప్రక్రియను ‘ఆవాస్ ప్లస్’ యాప్ ద్వారా నిర్వహిస్తున్నారు. కొత్తగా మంజూరైన ఇళ్లన్నింటినీ, అలాగే నిర్మాణంలో ఉన్న పాత ఇళ్లను రాబోయే రెండు నుంచి మూడు సంవత్సరాలలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## యుద్ధం చేయగలం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నాయని, ఈ ప్రమాదాలను ప్రతిఘటించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో జరిగే యుద్ధాలలో అమెరికా కృత్రిమ ఉపగ్రహాలకు నష్టం కలిగించడానికి, వాటి కార్యకలాపాలను అడ్డుకోవడానికి రష్యా–చైనా దేశాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని, కొత్త మార్గాలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు.అంతరిక్ష సైనిక సామర్థ్యాలను పెంపొందించుకోవాలని యోచిస్తున్నట్లు అమెరికా సీనియర్ సైనిక అధికారులు గతంలోనే ప్రకటనలు చేశారు. అమెరికా రక్షణకు ట్రంప్ ఒక గోల్డెన్ డోమ్ ప్రాజెక్టును కూడా ప్రకటించారు. అమెరికా అంతరిక్ష ఆయుధశక్తి పాత్రను నొక్కి చెబుతూ గత ఏడాది ఆయన ఒక ఉత్తర్వు విడుదల చేశారు.అమెరికా వద్ద ఇన్నాళ్ళుగా రహస్యంగా ఉన్న ఈ కొత్త సామర్థ్యాన్ని ఇప్పుడు ఎందుకు బహిరంగంగా ప్రకటించారన్న విషయంపై మీంక్ స్పందించలేదు.చైనా,రష్యాలు తమ సొంత అంతరిక్ష ఆయుధాలను అభివృద్ధి చేస్తున్నాయని ఎయిర్–స్పేస్ ఫోర్సెస్ మ్యాగజైన్ ప్రకటించింది.ఎక్స్–37 బి, గోల్డెన్ డోమ్ వంటి వ్యవస్థలద్వారా మరింత సమగ్రమైన అంతరిక్ష ఆయుధ వ్యవస్థను అమెరికా నిర్మిస్తోంది. కాగా బాహ్య అంతరిక్షాన్ని ఆయుధమయం చేయడాన్ని చైనా విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి గ్వో జియాకున్ తీవ్రంగా ఖండించారు.అంతరిక్షాన్ని యుద్ధభూమిగా మార్చడాన్ని, అంతరిక్షంలో లాంటి ఆయుధ పోటీనైనా చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అంతరిక్షంలో ఆయుధ పోటీ ప్రారంభించే ఉద్దేశం చైనాకు లేదని స్పష్టం చేశారు. బాహ్య అతరిక్షాన్ని శాంతిమండలంగా ఉంచాలని చైనా నిరంతరం వాదిస్తోందని,అక్కడి భద్రతను కాపాడేందుకు కృషిచేస్తూ వస్తోందని అన్నారు. ట్రాయ్ మీంక్ చేసిన బహిరంగ ప్రకటనను చైనా సైనిక వ్యవహారాల నిపుణుడు సాంగ్ జోంగ్ పింగ్ తీవ్రంగా విమర్శించారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆయుధ నిల్వలన్నీ తగ్గిపోయాయని ప్రపంచానికి బహిర్గతమైన తరుణంలో నిరంతరాయంగా తన సైనిక ఆధిపత్యాన్ని ప్రకటించుకోవడంకోసమే అమెరికా ఈ తాజా ప్రకటన చేసిందని సాంగ్ జోంగ్ పింగ్ విమర్శించారు. ఇప్పటివరకూ అమెరికా ఈ విషయంలో రష్య విధానం అమలు చేసిందని, ఇప్పుడు సైనిక ఆధిపత్యాన్ని ప్రదర్శించడంకోసమే ఈ ప్రకటన చేసిందని విమర్శించారు. అదేవిధంగా చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ, అంతరిక్ష ఆయుధాల విస్తరణ,బాహ్య అంతరిక్షంలో యుద్ధ సన్నాహాలను అమెరికా మానుకోవాలని కోరినట్లు ఎఎఫ్‌పి పేర్కొంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com